
ప్రపంచానిక ఆఖరు ఘడియలు
రూ॥140/- పేజీలు:154
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★


మమ్మల్ని ఉద్యోగులుగా గుర్తించండి
ఢిల్లీలో మహిళా గిగ్ వర్కర్ల నిరసన **05**

రాజ్యాంగాన్ని పాటించలేకపోతే భారత్ విడిచి వెళ్లిపోండి


సంపుటి 09, సంచిక: 67 | బుధవారం | 04-02-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## మున్సిపల్ ప్రచారం
# మిర్యాలగూడలో నేడు సిఎం సభ

- ఎన్నికలపై మంత్రులు, పిసిసి చీఫ్, ఇన్‌చార్జితో సమీక్షించిన ముఖ్యమంత్రి
- రెబల్స్‌ను దారిలోకి తేవాలి
- ఒక్క ఓటునూ నిర్లక్ష్యం చేయవద్దని సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియతో పాటు బీఫారమ్ అందజేత కార్యక్రమాలు కూడా పూర్తయిన నేపథ్యంలో ఇప్పటికే అభ్యర్థుల తరపున జోరుగా కొనసాగుతున్న ప్రచారాన్ని మరింత విస్తృతం చేయాలని సిఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలకు దిశానిర్ధేశం చేశారు. అందులో భాగంగా తాను 4వ తేదీన నల్లగొండ జిల్లా నుంచి ప్రచారాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. మొత్తం 116 మున్సిపాలిటీలకు, 7 కార్పొరేషన్లకు ఈ నెల 11వ తేదీన పోలింగ్ జరగనుంది. వారం రోజుల పాటు ప్రచారం నిర్వహించుకునేందుకు అవకాశం ఉండడంతో ప్రచార వ్యూహాలకు పదును పెట్టాలని సిఎం సూచించారు. బుధవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గంలో సిఎం రేవంత్ రెడ్డి పర్యటించనున్నట్లు తెలిపారు. రూ.200 కోట్లతో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేయనున్నారు. మహిళా సంఘాలకు చెక్కులను సిఎం పంపిణీ, అనంతరం బహిరంగ సభలో సిఎం పాల్గొనన్నురు. ఇదిలా ఉండగా మున్సిపల్ ఎన్నికలు, తాజా రాజకీయ పరిణామాలపై మంగళవారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో పార్లమెంట్ నియోజకవర్గాల ఎన్నికల ఇన్‌చార్జి మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులతో సమాలోచనలు చేశారు. టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి తరువాయి 2లో

### బరిలో 12,993 మంది..

నామినేషన్‌ల ఉపసంహరణ తరువాత రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల బరిలో 12,993 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మంగళవారం గడువు ముగిసే సమయానికి 6,701 నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. కాగా, బరిలో నిలిచిన స్వతంత్ర అభ్యర్థులకు ఎన్నికల అధికారులు బుధవారం నాడు ఎన్నికల గుర్తులను కేటాయించనున్నారు.

## అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం
# ప్రతిపక్షాలు ఫైర్



- పార్లమెంట్ లోపల, వెలుపలా ఆందోళనలు
- అమెరికా వత్తిడితో మోదీ వణికిపోయారని విమర్శలు
- రైతుల కష్టాన్ని, దేశాన్ని ప్రధాని అమ్మేశారని రాహుల్ గాంధీ ధ్వజం
- ఒప్పందాన్ని ఈ శతాబ్దపు అతిపెద్ద డీల్‌గా అభివర్ణించిన మోదీ
- ఒప్పందం పూర్తి స్వరూపంపై త్వరలోనే భారత్ – అమెరికా సంయుక్త ప్రకటన చేస్తాయని మంత్రి పీయూష్ గోయల్ వెల్లడి
- రష్యా నుంచి చమురు దిగుమతులు నిలిపివేయడానికి భారత్ అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన

**న్యూఢిల్లీ :** అమెరికా–భారత్‌ల మధ్య వాణిజ్య ఒప్పందానికి అంగీకారం కుదరడంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. పార్లమెంట్ లోపల, వెలుపల మోదీ సర్కార్‌పై ధ్వజమెత్తాయి. అమెరికా ఒత్తిడితో ప్రధాని మోదీ వణికిపోయారని ఆరోపించాయి. అమెరికాతో వాణిజ్య ఒప్పందం చేసుకునేందుకు ప్రధాని నరేంద్ర మోదీ రాజీపడ్డారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. అయితే భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని ఈ శతాబ్దపు గొప్ప ఒప్పందంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. కాగా సోమవారం రాత్రి ప్రధాని మోదీతో ఫోన్‌లో చర్చలు జరిపిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి అంగీకారం తెలిపినట్లు సోషల్ మీడియాలో ప్రకటించారు. అమెరికాపై విధిస్తున్న సుంకాలను సున్నా స్థాయికి చేర్చడానికి, రష్యా నుంచి చమురు దిగుమతులను నిలిపేయడానికి భారత్ అంగీకరించిందని ట్రంప్ తెలిపారు. భారత్‌పై విధించిన ప్రతీకార సుంకాలను 50 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నట్లు పేర్కొన్నారు.



**రైతుల కష్టాన్ని, దేశాన్ని అమ్మేశారు : రాహుల్ గాంధీ**

అమెరికా–భారత్‌ల మధ్య వాణిజ్య ఒప్పందం ద్వారా ప్రధాని మోదీ రైతుల కష్టాన్ని, దేశాన్ని అమ్మేశారని ధ్వజమెత్తారు. ఈ విషయాన్ని అన్నదాతలు అర్థం చేసుకోవాలని రాహుల్ పిలుపునిచ్చారు. అదానీపై అమెరికాలో కేసు, ఎప్‌స్టీన్ ఫైల్స్ కారణంగానే ప్రధాని రాజీపడ్డారని విమర్శించారు. ఈ విషయాలు దేశ ప్రజలకు తెలియకుండా ఉండేందుకు లోక్‌సభలో మొదటిసారి ప్రతిపక్షనేత (తన) ప్రసంగాన్ని అధికార పక్షం అడ్డుకుందని రాహుల్ ఆరోపించారు. భారత జాతీయ ప్రయోజనాల విషయంలో ప్రధాని మోదీ రాజీపడ్డారని దుయ్యబట్టారు. లోక్‌సభ నుంచి బయటకు వచ్చిన అనంతరం పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ 4 నెలలుగా ఆగిపోయిన ఒప్పందం సాయంత్రానికి ఎలా జరిగిందని ప్రతిపక్ష రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. ప్రధాని మోదీపై తీవ్రమైన ఒత్తిడి ఉందన్నారు. 'అమెరికా ఒత్తిడితో ప్రధాని మోదీ వణికిపోయారు. అమెరికాకు మోదీ మన దేశాన్ని అమ్మేశారు. నాలుగు నెలలుగా నిలిచిన ఒప్పందంపై అకస్మాత్తుగా సోమవారం రాత్రి మోదీపై తీవ్ర ఒత్తిడి వచ్చింది. అమెరికా ఒత్తిడితోనే ఒప్పందంపై మోదీ రాజీపడ్డారు. ప్రజల కష్టార్జితాన్ని మోదీ అమెరికాకు దోచిపెట్టారు. నరేంద్ర మోదీ ఇమేజ్‌ను వేలాది కోట్ల రూపాయలు వ్యయం చేసి తీర్చిదిద్దారు. అందుకే మన ప్రధాని రాజీపడాల్సి వచ్చింది. ఎవరు చేశారు? ఎలా చేశారు? అనేది దేశప్రజలు ఆలోచించాలి అని కోరారు.

**అందుకే మోదీ రాజీ :** 'అదానీపై అమెరికాలో ఓ కేసు ఉంది. వాస్తవానికి ఆ కేసు మోదీపై పెట్టాల్సిన కేసు. వారు అదానీని తరువాయి 2లో



## విపక్ష సభ్యుల
# సస్పెన్షన్

- మాజీ ఆర్మీచీఫ్ నరవణే పుస్తకంలోని విషయాలను ప్రస్తావించడానికి యత్నించిన రాహుల్ గాంధీ
- అనుమతి ఇవ్వని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా
- కాంగ్రెస్ సభ్యుల తీవ్ర అభ్యంతరం
- సభలో గందరగోళం
- కాగితాలు చింపి విసిరిన సభ్యుల నిరసన


సస్పెండైన తెలంగాణ కాంగ్రెస్ ఎంపి చామల

**న్యూఢిల్లీ :** లోక్‌సభలో మరోసారి తీవ్ర గందరగోళం నెలకొంది. విపక్ష సభ్యుల ఆందోళనలతో సభ కార్యకలాపాలు మంగళవారం పూర్తిగా స్తంభించాయి. స్పీకర్ చైర్‌పై నిరసన వ్యక్తం చేస్తూ కొందరు సభ్యులు కాగితాలు చించి విసరడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారిం ది. ఆ ఘటనపై కఠినంగా స్పందించిన స్పీకర్ మొత్తం బడ్జెట్ సమావేశాల కాలానికి ఎనిమిది విపక్ష సభ్యులను సస్పెండ్ చేశారు. మంగళవారం మధ్యాహ్నం పలు సార్లు వాయిదాల అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు సభ మళ్లీ సమావేశమైంది. ఆ సమయంలో చైర్‌లో ఉన్న ఎంపి దిలీప్ సైకియా సభను ప్రారంభించగానే విపక్ష సభ్యులు నిరసనలు చేపట్టారు. నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లిన కొందరు సభ్యులు పత్రాలు చించి స్పీకర్ వైపు విసరడం కలకలం రేపింది. సభా మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరించినందుకు ఎనిమిది మంది కాంగ్రెస్ సభ్యులను గుర్తించారు. సస్పెండ్ అయిన వారిలో ఎంపిలు హిబీ తరువాయి 2లో

### తుది దశలో ఒప్పందం : పీయూష్ గోయల్

వ్యవసాయం, పాడి పరిశ్రమ రంగాల ప్రయోజనాలకు ఎలాంటి రాజీ లేకుండా అమెరికాతో భారత్ అత్యుత్తమ వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకుందని వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఒప్పందం తుది దశలో ఉందని, పూర్తి స్వరూపంపై త్వరలోనే భారత్-అమెరికా సంయుక్త ప్రకటన చేస్తాయని చెప్పారు. అమెరికాతో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న వాణిజ్య ఒప్పందాన్ని ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం కుదుర్చుకున్నారని గోయల్ తెలిపారు.

### చమురు కొనుగోళ్లు నిలిపివేస్తామని భారత్ చెప్పలేదు : రష్యా

అమెరికాతో వాణిజ్య ఒప్పందంలో భాగంగా రష్యా నుంచి చమురు దిగుమతులను నిలిపివేయడానికి భారత్ అంగీకరించిందంటూ డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై క్రెమ్లిన్ స్పందించింది. న్యూఢిల్లీ నుంచి ఇంతవరకూ అలాంటి సంకేతాలేవీ తమకు రాలేదని పేర్కొంది. భారత్‌తో తమకు విలువైన సంబంధాలు ఉన్నాయని, ఇరు-దేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక భాగ్యస్వామ్యం కొనసాగుతుందని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ చెప్పారు.

# కబళించిన మృత్యువు



**నలుగురు మహిళలు దుర్మరణం**

- కూలీకి వెళ్లి తిరిగి వస్తుండగా చెరువులోకి దూసుకెళ్లిన ట్రాక్టర్
- జగిత్యాల జిల్లాలో ముగిలిపేట గ్రామంలో ఘటన

ప్రజాపక్షం /మల్లాపూర్

జగిత్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ఓ ట్రాక్టర్ బోల్తా కొట్టడంతో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన జిల్లాలోని మల్లాపూర్ మండలంలోని ముగిలిపేట వద్ద చోటుచేసుకుంది. కొందరు వ్యవసాయ కూలీలు.. పసుపు కోతకు వెళ్లి వస్తుండగా ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో పలువురు కూలీలు గాయపడ్డారు. సమాచారం తరువాయి 12లో

# వినూత్న వ్యవసాయ విధానాలు అనుసరించాలి

- రైతులను అధికారులు ప్రోత్సహించాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సూచన
- 'రైతు నేస్తం' వేదిక మరింత బలోపేతం కావాలని ఆకాంక్ష



ప్రజాపక్షం/హైదరాబాద్

వినూత్న వ్యవసాయ విధానాలను మరింత మంది రైతులు అనుసరించే విధంగా అధికారులు ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సూచించారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు 'రైతు నేస్తం' వేదిక మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. 'రైతునేస్తం' కార్యక్రమంలో భాగంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా రైతులతో మంగళవారం ముఖాముఖిగా ముచ్చటించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాలకు చెందిన రైతులు తమ వ్యవసాయ అనుభవాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ పథకాల వల్ల పొందుతున్న ప్రయోజనాలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కాగా సమగ్ర వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం అంశాలపై రైతులకు రంగారెడ్డి జిల్లాకు చెందిన రైతు శివ విస్తృత అవగాహన కల్పించారు. ఇఫ్కో కంపెనీ స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ కృపాశంకర్ నానో యూరియా వినియోగం, దాని ప్రయోజనాలు, సరైన వాడక విధానంపైన రైతులకు సమగ్రంగా వివరించారు. పిజెటిఎస్ఎయు నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ కిరణ్ బాబు,డాక్టర్ అరుణశ్రీ యాసంగి వరిలో వచ్చే పురుగులు, తెగుళ్లు,వాటి సమర్థవంతమైన యాజమాన్యంపై రైతులకు శాస్త్రీయంగా వివరించారు. కాగా 'యూరియా యాప్' అమలు తీరుపైన మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు స్వయంగా రైతులను అడిగి తెలుసుకున్నారు. యాప్ ద్వారా ఎరువుల సరఫరా పారదర్శకంగా, సులభంగా జరుగుతుండటం పట్ల రైతులు సంతృప్తి వ్యక్తం చేసినట్టు మంత్రి తుమ్మల తెలిపారు. యూరియా లభ్యత, సమయానికి సరఫరా వంటి అంశాలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. తేనెటీగల పెంపకం చేస్తూ అధిక తరువాయి 12లో



# కేబినెట్ నిర్ణయం చాలు

- గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై సుప్రీంకోర్టు క్లారిటీ


**న్యూఢిల్లీ :** తెలంగాణ రాష్ట్రంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకాల అంశం గత కొంతకాలంగా రాజకీయంగా, న్యాయపరంగా తీవ్ర చర్చకు దారితీసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపిక విషయంలో తరువాయి 12లో

# కడియం శ్రీహరికి నోటీసులు



ప్రజాపక్షం/హైదరాబాద్

ఎంఎల్‌ఎల ఫిరాయింపు వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎంఎల్‌ఎ కడియం శ్రీహరి అనర్హత పిటిషన్‌పై బుధవారం ఉదయం 11 గంటలకు అసెంబ్లీలోని స్పీకర్ ఛాంబర్‌లో విచారణ జరగనుంది. ఈ మేరకు కడియం శ్రీహరికి తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మరోసారి నోటీసులు జారీ చేశారు. విచారణకు హాజరుకావాలని అసెంబ్లీ సెక్రటరీ నుంచి కడియం శ్రీహరికి నోటీసులు అందాయి. మరోవైపు కడియం శ్రీహరిపై అనర్హత పిటిషన్ దాఖలు చేసిన కుత్బుల్లాపూర్ బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ కె.పి.వివేకానంద కూడా విచారణకు హాజరు కావాలని స్పీకర్ నోటీసులు పంపారు. మొదట స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఎంఎల్‌ఎ వివేకానంద వాదనలను నమోదు చేయనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, గత ఏడాది నవంబర్ 20న కడియం శ్రీహరితో పాటు దానం నాగేందర్‌కు స్పీకర్ ప్రసాద్ కుమార్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. తన నోటీసులకు తక్షణమే అఫిడవిట్ దాఖలు చేయాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. కానీ, కడియం శ్రీహరి తనకు వచ్చిన నోటీసులపై సమాధానం ఇచ్చేందుకు మరికొంత సమయం కావాలని స్పీకర్‌ను అభ్యర్థిస్తూ లేఖ రాశారు.



# డిఆర్‌డిఒ మరో ఘనత

**ఎస్ఎఫ్‌డిఆర్ పరీక్ష విజయవంతం**

**భువనేశ్వర్ :** దేశ క్షిపణి వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా భారత్ మరో ముందడుగు చేసింది. గగనతలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే దీర్ఘశ్రేణి క్షిపణుల అభివృద్ధికి కీలకమైన సాలిడ్ ఫ్యూయల్ డక్టెడ రామ్ జెట్ (ఎస్ఎఫ్‌డిఆర్) సాంకేతికతను డిఆర్‌డిఒ విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరంలోని చాందీపూర్ తరువాయి 12లో

## మణిపూర్ కొత్త ముఖ్యమంత్రిగా
# ఖేమ్‌చంద్ సింగ్



**న్యూఢిల్లీ :** మణిపూర్ నూతన ముఖ్యమంత్రిగా ఖేమ్‌చంద్ సింగ్ ఎంపికయ్యారు. మంగళవారం జరిగిన పార్టీ సమావేశంలో బిజెపి కేంద్ర పరిశీలకుడు తరుణ్ చుగ్, పార్టీ ఈశాన్య రాష్ట్రాల ఇన్‌చార్జ్ సంబిత్ పాత్రా తదితరుల సమక్షంలో వై.ఖేమ్‌చంద్ సింగ్‌ను బిజెపి శాసనసభా పక్ష నేతగా ఎన్నుకున్నారు. దీనితో ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో ఆయన నాయకత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కానుంది. మణిపూర్ కొత్త ప్రభుత్వంలో కుకీ మహిళా తరువాయి 12లో

## కర్ణాటకలో...
# విబి–జీ రామ్ జీ రద్దు

**మహాత్మాగాంధీ పథకం పునరుద్ధరణకు రంగం సిద్ధం**


అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

**బెంగళూరు:** గ్రామీణ ఉపాధికి తూట్లు పొడిచి కేంద్ర ప్రభుత్వంకొత్తగా తెచ్చిన విబి–జీ రామ్ జీ చట్టాన్ని రద్దు చేసి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని దాని పూర్వపు వాస్తవరూపంలో పునరుద్ధరించేందుకు కర్ణాటక రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో మంగళవారం ఒక తీర్మానం ప్రవేశపెట్టింది. అసెంబ్లీలో ప్రతిపక్ష బిజెపి శాసనసభ్యుల తీవ్ర నిరసనల మధ్య రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈ తీర్మానం ప్రవేశపెట్టారు. విబి–జీ రామ్ జీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా తరువాయి 12లో



## త్రైపాక్షిక చర్చల వేళ ఉక్రేన్-రష్యా పరస్పర దాడులు

**మాస్కో:** ఉక్రేన్‌–అమెరికా–రష్యా మధ్య అబుధాబిలో నేడు (ఫిబ్రవరి 4) మరో విడత త్రైపాక్షిక చర్చలు జరుగుతాయని ముందస్తు వార్తలు వెలువడిన తరుణంలో ఉక్రేన్‌–రష్యా మధ్య పరస్పర దాడులు మొదలయ్యాయి. జెలెన్‌స్కీ, ట్రంప్ విజ్ఞప్తి మేరకు వారం రోజులు దాడులకు విరామం ఇచ్చిన రష్యా తిరిగి మంగళవారం భారీస్థాయిలో దాడులు ప్రారంభించింది. ఉక్రేన్ సైన్యం కూడా ప్రతిదాడులు చేసింది. కీవ్ నగరంలో ఉష్ణోగ్రతలు మైనస్ 20 డిగ్రీలకు క్షీణించిన సమయంలో తెల్లారకముందే రష్యా క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసింది. దీంతో 1000 టవర్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నాటో ప్రధాన కార్యదర్శి మార్క్ రట్టే ఉక్రేన్ పార్లమెంటును ఉద్దేశించి ప్రసంగించేందుకు కీవ్ చేరుకున్న రోజునే ఈ దాడులు జరిగాయి. 70 బాలిస్టిక్ క్షిపణులు, 450 డ్రోన్లతో రష్యా దాడులు చేసిందని జెలెన్‌స్కీ చెప్పారు. వీటిల్లో 38 క్షిపణు లు ధ్వంసం సృష్టించాయని ఆ దేశ సైన్యం తెలిపింది. అదేవిధంగా రష్యా ఖేర్సన్ రీజియన్‌లోని నోవయా ఖాఖోవ్‌కా ప్రాంతంలో ఉక్రేన్ దళాలు చేసిన దాడుల్లోముగ్గురు మరణించినట్లు రష్యా గవర్నర్ వ్లాదిమిర్ సాల్డో ప్రకటించారు. మరణించినవారిలో స్థానిక ప్రభుత్వ అధికారి కూడా ఉన్నారు. అనేకమంది గాయపడ్డారు.
కీవ్‌పై రష్యా చేసిన దాడుల్లో అనేకమంది గాయపడ్డారు. కీవ్ నగరంలో ప్రజలు దాడుల నుండి తప్పించుకోవడానికి సురక్షిత ప్రదేశాలకు వెళుతున్నారు. ఇంధన వనరులపై దాడుల కారణంగా ఉక్రేన్‌లో వేలాదిఇళ్ళకు విద్యుత్ సదుపాయం లేదు. దీంతో హీటర్లు వారంతా చలికి వణుకుతున్నారు. చలిమంటలు వేసుకుని ఇతర మార్గాలు అనుసరిస్తున్నారు.
కాగా ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఒక ప్రకటన చేస్తూ రష్యా శాంతి యత్నాలను కాలరాస్తోందని, దౌత్యం కంటే దాడులకే పుతిన్ ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. రెండవ ప్రపంచ యుద్ధకాలంనాటి ప్రదర్శనశాలను రష్యా క్షిపణులు ధ్వంసం చేశాయని విమర్శించారు. ఉక్రేన్‌–అమెరికా–రష్యా మధ్య మూడో విడత త్రైపాక్షిక చర్చలు ఈనెల 4,5 తేదీలలో జరుగుతాయని గడచిన ఆదివారం నాడు జెలెన్‌స్కీ ప్రకటించారు. సమగ్ర చర్చలకు, బహుళ దొంతర్ల చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని కూడా ఆయన చెప్పారు.

# యుద్ధభేరీల మధ్య శాంతి యత్నాలు

## టర్కీలో ఆరో తేదీన అమెరికా–ఇరాన్ చర్చలు



**దుబాయ్:** జాతీయ ప్రయోజనాలే లక్ష్యంగా, షరతుల ప్రాతిపదికపై అమెరికాతో అణు చర్చల పునరుద్ధరణకు ఇరాన్ ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది. పరస్పర మర్యాద, గౌరవాలతో దేశ ప్రయోజనాలే లక్ష్యంగా చర్చలకు వెళ్ళాలని విదేశీమంత్రి అబ్బాస్ ఆరాఘ్చీకి ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ ఆదేశించారు. వచ్చే శుక్రవారమే (ఫిబవరి 6) టర్కీ నగరం ఇస్తాంబుల్‌లో ఈ చర్చలు జరిగే అవకాశాలున్నాయి. ఎక్స్ వేదికగా పెజెష్కియన్ ఈ విషయం ప్రకటించారు. పశ్చిమ ఆసియాలో అమెరికా ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నెర్, ఇరాన్‌మంత్రి ఆరాఘ్చీ, టర్కీ, ఖతార్, ఈజిప్టు దేశాల సీనియర్ ప్రముఖులు సమావేశంలో పాల్గొంటారు. చర్చలు ఫలించకపోతే చెడు జరిగే అవకాశాలే ఎక్కువగా ఉంటాయని ట్రంప్ అన్నారు. కానీ ఇరాన్‌పై దాడి చేస్తే అది ప్రాంతీయ యుద్ధానికి దారితీస్తుందని అయెతొల్లా అలీ ఖమేని ఇప్పటికే ఒక హెచ్చరిక చేశారు. ఈ పరస్పర ఉద్రిక్తతలమధ్య శాంతి కోసం దౌత్య యత్నాలు మొదలయ్యాయి.
న్యాయవిరుద్ధమైన, నిర్హేతుకమైన అంచనాలతో తమపై కయ్యానికి సిద్ధపడుతున్నప్పటికీ, ఖతార్, టర్కీ, ఈజిప్టు, ఒమన్ వంటి ఇరుగు పొరుగు మిత్రదేశాలు ఇచ్చిన సలహాల మేరకు వారిని మన్నించి అమెరికాతో అణు చర్చల పునరుద్ధణకు అంగీకరించినట్లు చెప్పారు. దౌత్యమార్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలని భావించామన్నారు. ఐతే దీనికి షరతులు వర్తిస్తాయని, జాతీయ ప్రయోజనాలే లక్ష్యంగా తాము చర్చలు జరుపుతామని ఆయన ప్రకటించారు. ''చర్చలకు రావాలని అమెరికా అధ్యక్షుడు చేసిన సూచనకు స్పందించాలని స్నేహపూర్వక దేశాలు చెప్పిన విషయాలను పరిగణనలోకి తీసుకున్నాం, అనుచితమైన అంచనాలు లేని వాతావరణం గనుక ఉంటే, న్యాయబద్ధమైన చర్చలకు వేదిక సిద్ధం చేయమని మా విదేశీమంత్రిని ఆదేశించాను'' అని పెజెష్కియన్ ఆ పోస్టింగ్‌లో పేర్కొన్నారు. టర్కీ ప్రభుత్వమే ఈ చర్చలకు రెండు వైపులా చొరవ చూపించింది. కాగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఈ చర్చలకు ముందుగా ఒక ప్రకటన చేస్తూ, ఇరాన్–అమెరికాలు న్యాయబద్ధమైన అణు ఒప్పందం చేసుకోవాలని, ప్రాంతీయ ఉద్రిక్తతలు చెలరేగకుండా దీర్ఘకాలిక ఒప్పందానికి రావాలని విజ్ఞప్తి చేసింది. పశ్చిమాసియా దేశాలు యుద్ధాన్ని కోరుకోవడంలేదని స్పష్టం చేసింది.
ఒకవైపు ఆరేబియా సముద్రంలో ఇరాక్‌కు సమీపంలో విమానవాహక యుద్ధ నౌకలను మోహరించి, గగనతల విన్యాసాలు చేస్తూ మరోవైపు చర్చలకు రావాల్సిందిగా ఇరాన్‌తో ట్రంప్ డబుల్ గేమ్ ఆడుతున్నారు. ఆయన దాదాపు లాటిన్ అమెరికా కరీబియన్, ఆర్కిటిక్ ప్రాంత దేశాలతో ఇలాంటి కుంత్రం వ్యూహాలే చేస్తున్నారు. మరోవైపు చైనా–రష్యా మిత్రదేశాలు మౌనంగా ఈ పరిణామాలను గమనిస్తున్నాయి.

### చర్చల్లో పాకిస్థాన్ పాత్ర!

ఇస్తాంబుల్‌లో అమెరికా–ఇరాన్ మధ్య చర్చల్లో పాల్గొనాల్సిందిగా పాకిస్థాన్‌కు ఆహ్వానం అందింది. పాకిస్థాన్ విదేశీమంత్రిత్వశాఖ ప్రతినిధి తహిర్ ఆంద్రబీ మంగళవారం ఇస్లామాబాద్‌లో ఈ విషయం ధృవీకరించారు. అమెరికా–ఇరాన్ మధ్య చర్చలకు, ఉద్రిక్తతల నివారణకు పాకిస్థాన్ మౌనంగా తాను చేయాల్సిందంతా చేస్తోందన్నారు. ఇరుదేశాలమధ్యా ఉద్రిక్తలను సడలించేందుకు చర్చల్లో పాకిస్థాన్ కీలకపాత్ర వహిస్తుందని, ఉప ప్రధాన మంత్రి–విదేశీమంత్రి ఇషాక్ దార్ పాల్గొంటారని చెప్పారు. పాకిస్థాన్‌తో పాటు సౌదీఅరేబియా, ఖతార్, ఈజిప్టు, ఒమన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాల ప్రతినిధులు పాల్గొంటారన్నారు.

### అమెరికాతో న్యాయబద్ధ చర్చలకు

# క్యూబా సిద్ధం

## ట్రంప్ అక్రమ ఆరోపణలకు ఖండన



**హవానా:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పదే పదే చేస్తున్న ఆరోపణలను క్యూబా తిరస్కరించింది. తమదేశంవల్ల అమెరికా భద్రతకు ఎలాంటి ప్రమాదంలేదని మరోసారి స్పష్టం చేసింది. వాస్తవ ప్రాతిపదికపై ఆచరణాత్మకమైన ఫలితాలు సాధించే పరస్పర గౌరవ–మర్యాదలతో కూడిన న్యాయబద్ధమైన సంభాషణలకు క్యూబా ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉంటుందని మరోసారి అమెరికాకు స్పష్టం చేసింది. అమెరికా నిర్బంధాలకు అనుగుణంగా వారితో సహకరించడానికి క్యూబా దేశం సిద్ధంగా లేదని క్యూబా విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ సోమవారం విడుదల చేసిన ప్రకటనను ఖతార్ న్యూస్‌మీడియా సంస్థ 'ఎజెఎంఎన్ ప్రచురించింది. ''నిర్మాణాత్మకమైన చర్చలు, చట్టబద్ధమైన సహకారం, శాంతియుత సహజీవనం ద్వారా క్యూబా ప్రజలు–అమెరికా ప్రజలు లబ్ది పొందాలి'' అని ప్రకటన పేర్కొంది. క్యూబాతో దౌత్యపరమైన సంబంధాన్ని పునరుద్ధరించినట్లు ట్రంప్ ప్రకటించిన కొద్ది గంటల తర్వాత క్యూబా నుండి ఈ ప్రకటన వెలువడింది.
పరస్పర మర్యాద–గౌరవాలు ఇచ్చిపుచ్చుకునే విధంగా చర్చలకు పిలుపు ఇస్తూ మా కరీబియన్‌దీవి ఎన్నడూ ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వదని, అలాంటి కార్యకలాపాలు చేపట్టదని పునరుద్ఘాటించింది. వెనుజులా తర్వాత క్యూబా సంగతి చూస్తాం అంటూ ట్రంప్ గతనెలారంభంలోనే రంకెలువేసి బెదిరింపులు ప్రారంభించారు. మాదక ద్రవ్యాలను, ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తోందంటూ వెనిజులాపై ఆరోపణలు గుప్పించి ఆ దేశంపై దురాక్రమణ చేశారు. ట్రంప్ ఎత్తుగడలు చాలా దశాబ్దాలుగా ఆ పాలకులు అనుసరిస్తున్నవేనని అనేక ఆంక్షలు ఎదుర్కొంటున్న క్యూబా పదే పదే చెబుతూ అమెరికా ఆరోపణలను నిర్ద్వంద్వంగా తిరస్కరించింది.

# ఒకే ఛత్రం కింద ఎలాన్‌మస్క్ వ్యాపారం

**న్యూయార్క్:** అమెరికా టెక్ బిలియనీర్ ఎలాన్‌మస్క్ తన రాకెట్ కంపెనీ స్పేస్ ఎక్స్‌ను, కృత్రిమ మేధకు చెందిన అంకురసంస్థ ఎక్స్ ఎఐను విలీనం చేశారు. దీనిని ఒక మైలురాయి ఒప్పందంగా పేర్కొన్నారు. దీంతో తన వ్యాపార సామ్రాజ్యం ఒకే ఛత్రం కింద విస్తరించడంతోపాటు కృత్రిమ మేధ రంగంలో భవిష్యత్ లక్ష్యాల నిమిత్తం కార్యకలాపాలను విస్తృతం చేయడానికి ఈవిలీనం దోహదం చేస్తుందన్నారు. కేవలం భూతలంపై సాంకేతికతను విస్తరించడంపైనే వ్యాపారాన్ని చేయకుండా అంతరిక్ష సంబంధమైన సాంకేతికతను భారీస్థాయిలో పెంచేందుకు ఈ విలీనం ఉపయోగపడుతుంది. ఈ అతి పెద్ద నిర్ణయంతో 1.25 ట్రిలియన్ డాలర్ల అతిపెద్ద వ్యాపార సామ్రాజ్యం ఆయనకు ఏర్పడింది. బ్లూంబెర్గ్ మంగళవారం ఈ విషయం వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖుల దగ్గర నుండి సాధారణ ప్రజల వరకూ ఎలాన్‌మస్క్ సాధిస్తున్న అంతరిక్ష విజయాల గురించి అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ విధానాల గురించే మాట్లాడుకుంటూ ఉంటారు. భిన్నమైన లక్ష్యాలతో స్థాపించిన రెండు కంపెనీల విలీనం మస్క్ తీసుకున్న అతి పెద్ద నిర్ణయం. ఉద్యోగుల సమాచారం నిమిత్తం ఎలాన్‌మస్క్ సంతకంలో స్పేస్‌ఎక్స్ వెబ్‌సైటులో ఈ సమాచారాన్ని అప్‌లోడ్ చేశారు.

**స్పేస్ ఎక్స్–ఎక్స్ ఎఐ విలీనం**

### ఫ్రాన్స్‌లో ఎక్స్‌పై దాడులు

ఫ్రాన్స్‌లో ఎలాన్‌మస్క్‌కు చెందిన ఎక్స్ కార్యాలయాలపై ప్రాసిక్యూషన్ అధికారులు మంగళవారం దాడులు చేశారు. సైబర్–క్రైమ్‌కు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ఫ్రాన్స్ అధికారులు యూరోపోల్ సహాయంతో ఫ్రాన్స్‌లో ఉన్న ఎలాన్‌మస్క్ సోషల్ మీడియా వేదికలపై దాడులు చేశారు. ఎఐ ఛాట్‌బోట్, గ్రోక్‌లు జతకలిసి ఉన్న ఎక్స్ ఆల్గోరిథమ్ కంటెంట్‌పై దర్యాప్తుకోసమే దాడులు చేసినట్లు ప్రాసిక్యూటర్ చెప్పారు. మస్క్‌తోపాటు ఎక్స్ వేదిక చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ లింకా యక్కారినోలను గడచిన ఏప్రిల్‌లో విచారణకు హాజరుకావాల్సిందిగా కోరామని రాలేదని ప్రాసిక్యూషన్ కార్యాలయం ప్రకటించింది. ఈ పరిణామాలపై ఎలాన్‌మస్క్ ఇంకా స్పందించలేదు. గత ఏడాది జనవరిలోనే ఈ వ్యవహారంపై దర్యాప్తు ప్రారంభమైంది.




# ముగిసిన ఉపసంహరణల పర్వం


తిరుగుబాటు సెగలు
మున్సిపల్ ఎన్నికల్లో టికెట్ల లొల్లి
రెబల్స్ ఆందోళనలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల్లో కీలకమైన నామినేషన్‌ల ఉపసంహరణ ఘట్టం ముగిసింది. ఉపసంహరణల గడువు ముగియడంతో, బరిలో నిలిచిన స్వతంత్ర అభ్యర్థులకు ఎన్నికల అధికారులు గుర్తులను కేటాయించనున్నారు. పార్టీల బిఫారమ్స్ పొందిన వారు అధికారికంగా బరిలోకి దిగగా, అసంతృప్తితో ఉన్న రెబల్స్ ఏ మేరకు ప్రభావం చూపుతారో అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. నామినేషన్‌ల ఉపసంహరణ గడువు ముగియడంతో రాష్ట్రంలో పలు జిల్లాల్లో రాజకీయ సమీకరణాలు వేడెక్కాయి. టికెట్లు దక్కని ఆశావహుల ఆగ్రహం, రెబల్స్ బుజ్జగింపులు, పార్టీల మధ్య ఘర్షణలతో ఎన్నికల వాతావరణం రణరంగాన్ని తలపించింది. టికెట్‌ల కేటాయింపుపై చోటుచేసుకున్న ఈ పరిణామాలు స్థానిక రాజకీయాలను మరింత వేడెక్కిస్తున్నాయి. తిరుగుబాటు అభ్యర్థులు ప్రధాన పార్టీల అధినాకత్వాలకు గుబులు పుట్టిస్తున్నారు. చివరి నిమిషం వరకు రెబల్ అభ్యర్థులను దారికి తెచ్చుకునేందుకు ప్రధాన పార్టీల నేతలు సర్వశక్తులు ఒడ్డారు. అయితే, కొన్నిచోట్ల బుజ్జగింపులు ఫలించగా, మరికొన్ని చోట్ల టికెట్ దక్కని నేతలు బహిరంగంగానే తమ నిరసనను వ్యక్తం చేశారు. మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత టి.జీవన్ రెడ్డి టికెట్ల కేటాయింపులో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సంజయ్ వర్గానికి ఎక్కువ టికెట్లు ఇచ్చారని, ఈ చర్యతో తన మెడ కోశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు జిల్లాల్లో మాజీ మంత్రులు ఇళ్లను ఆశావాహులు ముట్టడించారు. కరీంనగర్‌లో బిఆర్‌ఎస్ పార్టీలో టికెట్ల లొల్లి తారస్థాయికి చేరింది. బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తమకు టికెట్ ఇవ్వకుండా మోసం చేశారని ఆరోపిస్తూ రెండో డివిజన్ ఆశావహుడు దాసరి సాగర్, మూడో డివిజన్ ఆశావహుడు దాసరి ప్రభాకర్ ఆందోళనకు దిగారు. తమ ప్రచార కరపత్రాలను, పోస్టర్లను గంగుల నివాసం వద్దే తగులబెట్టి, నిప్పును ఇంట్లోకి విసిరారు. చెప్పులు విసురుతూ, మట్టి పోస్తూ శాపనార్థాలు పెట్టడం స్థానికంగా కలకలం రేపింది. జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీలో టికెట్ కేటాయింపు తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. మెట్‌పల్లి 24వ వార్డు టికెట్ ఆశించిన పట్టణ కాంగ్రెస్ అధ్యక్షురాలు హరిత, తనకు బీఫామ్ ఇస్తామని చెప్పి చివరి నిమిషంలో వేరే వ్యక్తికి ఇచ్చారని ఆరోపించారు. డిసిసి అధ్యక్షుడి పిలుపు మేరకు జగిత్యాల ఇందిరా భవన్ వెళ్తే, తన కళ్ల ముందే బీఫామ్ చించేసి వేరే వారికి ఇచ్చారని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. టికెట్ల కేటాయింపులు, ప్రచారం విషయంలో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఘర్షణ వాతావరణం నెలకొంది. సిద్దిపేట (14వ వార్డు) కాంగ్రెస్ అభ్యర్థిపై 'బాకీ కార్డు' అంటూ బిఆర్‌ఎస్ ప్రచారం చేయడంతో ఇరు వర్గాల మధ్య గొడవ జరిగింది. హాలియా (నల్లగొండ) బిఆర్‌ఎస్ అభ్యర్థి నామినేషన్ ఉపసంహరింపజేసేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారని ఇరు పార్టీల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది.

# ప్రభుత్వ ఆజ్ఞతోనే స్పీకర్ నా నోరు నొక్కేశారు

ప్రజాస్వామ్యంపై ఇది మాయని మచ్చ
లోక్‌సభలో రభసపై ఓంబిర్లాకు
రాహుల్‌గాంధీ నిరసన లేఖ





**న్యూఢిల్లీ:** చట్టసభలో సభ్యుణ్ణి మాట్లాడనివ్వకపోవడం దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై మాయని మచ్చ అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. జాతీయ భద్రత విషయం గురించి సోమవారంనాటి సభలో తనను మాట్లాడనివ్వకుండా అడ్డుకోవడంపై లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు మంగళవారం లిఖితపూర్వకంగా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ప్రసంగంపై ప్రతిపక్ష నాయకుణ్ణి మాట్లాడనివ్వకుండా స్పీకర్ బలవంతంగా అడ్డుకోవడం పార్లమెంటరీ వ్యవస్థ చరిత్రలో ఇదే మొట్టమొదటిసారి అని స్పష్టం చేశారు. ప్రభుత్వం జారీ చేసిన ఆజ్ఞలతోనే స్పీకర్ అడ్డుకున్నారన్నారు. 'ఇది ప్రజాస్వామ్యంపై మాయని మచ్చ, చాలా బలంగా నేను నా నిరసనను రికార్డుల్లో నమోదు చేస్తున్నాను' అని పేర్కొన్నారు. సభాధిపతిగా స్పీకర్ నిష్పాక్షికంగా వ్యవహరించాలని, సభలో ప్రతిపక్షాలు, ప్రతిపక్ష నాయకుడు సహా ప్రతి సభ్యుడికీ ఉన్న హక్కులను సంరక్షించే రాజ్యాంగ, పార్లమెంటరీ బాధ్యత స్పీకర్‌దేనని లేఖలో రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. ప్రతిపక్షనాయకుడికి, ప్రతి సభ్యుడికీ ఉన్న మాట్లాడేహక్కు ప్రజాస్వామ్యంలో ఒక విడదీయరాని భాగమని గుర్తుచేశారు. సభలో తన అభిప్రాయాలు వ్యక్తం చేసేందుకు ఉన్న మౌలికమైన ప్రజాస్వామ్య హక్కులను తిరస్కరించడం ఒక అసాధారణ పరిస్థితికి దారితీసిందని పేర్కొన్నారు.
పార్లమెంటు బడ్జెట్ సమావేశాలను ప్రారంభిస్తూ రాష్ట్రపతి చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా రాహుల్‌గాంధీని మాట్లాడనివ్వకుండా అధికారపక్ష సభ్యులు మూకుమ్మడిగా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సైనిక దళాల మాజీ ప్రధానాధిపతి ఎం.ఎం.నరవేన్ రాసిన ఇంకా ప్రచురితంకాని ''మెమొరీస్'' అనే పుస్తకంపై ఒక పత్రిక రాసిన వ్యాసాన్ని రాహుల్ గాంధీ తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ ఉటంకిస్తూ జాతీయ భద్రతపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్న తన అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు ప్రయత్నం చేశారు. అభిప్రాయాన్ని చెప్పనివ్వకుండా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సహా అధికార పక్ష సభ్యులు రా హుల్‌గాంధీపై విరుచుకుపడటంతో సభ లో తీవ్ర రభస జరిగింది. రెండు సార్లు సభ వాయిదా పడింది. సంబంధిత పత్రికకు ఉన్న ప్రామాణికత ఏమిటో ధృవీకరించాలని స్పీకర్ ఓం బిర్లా రాహుల్‌గాంధీని ఆదేశించారు. ఆ తర్వాత మధ్యాహ్నం జరిగిన సమావేశంలో కూడా రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. ఆ సమయంలో స్పీకర్ స్థానంలో ఉన్న కృష్ణప్రసాద్ తెన్నేటి ముగ్గురు ప్రతిపక్ష ఎంపీలను మాట్లాడనివ్వలేదు. వారంతా రాహుల్‌కు సంఘీభావం ప్రకటించారు. తర్వాత స్పీకర్ ఎన్‌డిఎ భాగస్వామ్యపార్టీ టిడిపి ఎంపి హరీశ్ బాలయోగిని మా ట్లాడాల్సిందిగా కోరారు. ఈ అప్రజాస్వామిక చర్యపై స్పీకర్ ఓం బిర్లాకు లిఖితపూర్వకంగా నిరసన తెలియజేశారు.

## నేడు సిఎం సభ

(మొదటి పేజీ తరువాయి)

నటరాజన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇంఛార్జి మంత్రులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ మంగళవారం సాయంత్రం గడువు ముగిసిన అనంతరం ఏయే కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో బరిలో మిగిలిన అభ్యర్థులు, ఇతర రాజకీయ పార్టీల బలాబలాలు, కాంగ్రెస్ తిరుగుబాటు అభ్యర్థులు ఎంత మంది బరిలో ఉన్నారు అనే అంశాలపై సమాచారంపై వారు విశ్లేషణ చేసినట్లు సమాచారం. మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, సిఎం రేవంత్ ప్రచార షెడ్యూల్‌పై కూడా చర్చించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, పంచాయతీ ఎన్నికల మాదిరిగానే మునిసిపల్ ఎన్నికలనూ సవాల్‌గా తీసుకుని పార్టీ అభ్యర్థులను గెలిపించుకుందామని, ఏ ఒక్క ఓటును కూడా నిర్లక్ష్యం చేయవద్దని, ఎక్కడ రెబల్స్ అభ్యర్థులు మిగిలినా వారిని దారికి తేవాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. ముఖ్యంగా ఎన్నికలు జరుగుతున్న 7 కార్పొరేషన్లూ కాంగ్రెస్ ఖాతాలో చేరాల్సిందేనని, అందుకు కాంగ్రెస్ పార్టీ ప్రచార వ్యూహాన్ని అనుసరించాలన్నారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించిన సర్వేలు కాంగ్రెస్‌కు సానుకూలంగా ఉన్నాయని నాయకులతో పునరుద్ఘాటించారు. ఈ సర్వేల ప్రకారం 80 శాతం సీట్లలో కాంగ్రెస్ కచ్చితంగా విజయం సాధించనుందని స్పష్టం చేశారు. మిగిలిన 20 శాతం సీట్లలో గట్టి పోటీ ఉందని, కష్టపడితే వాటిలోనూ సానుకూల ఫలితం వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. పార్టీ గుర్తుపై జరిగే ఈ ఎన్నికలను సవాల్‌గాతీసుకుని పనిచేయాలని ఎన్నికల్లో పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇన్చార్జిలుగా వ్యవహరిస్తున్న మంత్రులకు సిఎం సూచించారు. కొన్ని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో సమస్యలున్నాయని, వాటిపై ఇన్చార్జి మంత్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సిఎం ఆదేశించినట్లు సమాచారం. నామినేషన్ల ఉపసంహరణకు మంగళవారంతో గడువు ముగియడంతో బరిలో నిలిచిన పార్టీకి చెందిన తిరుగుబాటు అభ్యర్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారిని దారికి తేవాలని సమావేశంలో సిఎం మంత్రులకు పార్టీ నాయకులకు నొక్కి చెప్పినట్లు తెలిసింది. అన్ని సమస్యలనూ పరిష్కరించుకుని ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందని రేవంత్ రెడ్డి చెప్పారు. ఉత్తర తెలంగాణలో బిజెపిని తేలికగా తీసుకోవద్దని, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ నియోజకవర్గాల పరిధిలోని కార్పొరేషన్లు, మునిసిపాలిటీలపై గట్టిగా దృష్టి పెట్టాలని సూచించినట్లు తెలిసింది. కొన్ని చోట్ల బిజెపి, బిఆర్‌ఎస్ నాయకత్వాలు సీట్ల సర్దుబాటు చేసుకుంటున్నాయన్న అంశమూ చర్చకు వచ్చినట్లు సమాచారం.

## ప్రతిపక్షాలు ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

టార్గెట్ చేయటంలేదు. వారు నరేంద్ర మోదీ ఆర్థిక నిర్మాణాన్ని టార్గెట్ చేశారు. రెండోది ఎప్‌స్టీన్ ఫైల్స్ అవి ఇంకా విడుదల కాలేదు. అమెరికా బయటపెట్టని ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో చాలా విషయాలున్నాయి. ఎప్‌స్టీన్ ఫైల్స్ విషయంలో మోదీపై చాలా ఒత్తిడి ఉంది. వాటి ఒత్తిడితోనే ప్రధాని రాజీపడ్డారు. ప్రధాని అమెరికాకు ఎందుకు లొంగిపోయారన్నది ప్రజలు అర్థం చేసుకోవాలి' అని రాహుల్ గాంధీ అన్నారు. మరోవైపు వాణిజ్య ఒప్పందం విషయమై అమెరికా ఒత్తిడికి ప్రధాని మోదీ తలొగ్గారన్న ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శలను అధికార పక్షం తిప్పికొట్టింది.

### ఈ శతాబ్దపు అతిపెద్ద డీల్ : మోదీ

భారత్, అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందంపై తాజాగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్, అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందాన్ని(ట్రేడ్ డీల్) 'ఈ శతాబ్దపు అతిపెద్ద ఒప్పందం'గా ప్రధాని మోదీ అభివర్ణించారు. ఇది అంతర్జాతీయంగా పెరుగుతున్న భారత దేశ ప్రాముఖ్యతను మరింత పెంచుతుందని తెలిపారు. మంగళవారం ఎన్‌డిఎ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి ప్రధాని మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్, అమెరికా మధ్య కుదిరిన ట్రేడ్ డీల్ కారణంగా ఇరు దేశాల పరస్పర సుంకాలు ప్రస్తుతం ఉన్న 25 శాతం నుంచి 18శాతానికి తగ్గాయని వెల్లడించారు. ప్రపంచ వ్యవహారాల్లో, సమతుల్యతను కాపాడుకోవడంలో భారత దేశ పాత్ర మరింత పెరుగుతుందని ఎన్‌డిఎ ఎంపిలతో ఆయన అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయంతో కొంతమంది తీవ్ర నిరాశకు గురయ్యారని ప్రతిపక్ష పార్టీలను ఉద్దేశిస్తూ ప్రధాని మోదీ హాస్యంగా వ్యాఖ్యానించారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి, ఎగుమతులు పెరిగేందుకు ఈ ఒప్పందం ఎంతో ఉపకరిస్తుందని ప్రధాని మోదీ వెల్లడించారు. మరోవైపు ఈ సమావేశంలో ఎన్‌డిఎ ఎంపిలు ప్రధాని నరేంద్ర మోదీని సత్కరించారు.

# సస్పెన్షన్

(మొదటి పేజీ తరువాయి)

ఈడెన్, అమరీందర్ సింగ్, రాజా వారింగ్, మాణికం ఠాగూర్, గుర్జీత్ సింగ్, కిరణ్‌కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు. వీరిపై మిగిలిన బడ్జెట్ సమావేశాల కాలానికి సస్పెన్షన్ విధించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తీర్మానం ప్రవేశపెట్టారు. ఆ తీర్మానాన్ని సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. అనంతరం తీవ్ర గందరగోళం కొనసాగడంతో లోక్‌సభ బుధవారానికి వాయిదా పడింది.

### పార్లమెంట్ వెలుపల నిరసన

మరోవైపు, ఎంపిల సస్పెన్షన్‌పై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో పార్టీ ఎంపిలు పార్లమెంట్ భవనం వెలుపల నిరసన వ్యక్తం చేశారు. ఈ ఆందోళనలో రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. సరెండర్ మోదీ, ఎప్‌స్టీన్ మోదీ, మోదీట్రంప్ భాయీ భాయీ అంటూ నినాదాలు చేశారు. అవన్నీ ప్రజాస్వామ్య హక్కులను హరించే చర్యలని తెలిపారు. విపక్ష స్వరాన్ని అణిచివేస్తున్నారని వారు ఆరోపించారు. సభ్యులను సస్పెండ్ చేయడం అన్యాయమని, వెంటనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లోక్‌సభ నుంచి సస్పెండ్ అయిన తర్వాత హిబీ ఈడెన్ మాట్లాడుతూ 'ప్రతిపక్ష నాయకుడు పార్లమెంటు లోపల ఎందుకు మాట్లాడలేకపోతున్నారో స్పష్టంగా చెప్పారు. దానికి కారణం ప్రధానమంత్రి అమెరికా ముందు లొంగిపోయిన తీరు, వాణిజ్య ఒప్పందం కుదిరిన విధానం, ఆ ఒప్పందంలో జరిగిన అక్రమాలే. ఎప్‌స్టీన్ విషయం పార్లమెంటులో చర్చించాల్సిన అంశం, కానీ ఈ విషయాలేవీ చర్చించడం లేదు. మేం సభ లోపల, వెలుపల మా నిరసనను కొనసాగిస్తాం. మా ఎనిమిది మంది ఎంపిలను సస్పెండ్ చేశారు, కానీ మేం పార్లమెంటు లోపల, వెలుపల మా పోరాటాన్ని కొనసాగిస్తాం' అని తెలిపారు. అయితే లోక్‌సభలో గందరగోళానికి కారణంగా భారత్–చైనా సరిహద్దు ఘర్షణలకు సంబంధించిన అంశం. 2020లో జరిగిన భారత్ –చైనా ఘర్షణలపై మాజీ ఆర్మీ చీఫ్ నరవణె రాసిన ప్రచురితం కాని పుస్తకంలోని కొన్ని విషయాలను సభలో ప్రస్తావించాలని రాహుల్ గాంధీ ప్రయత్నించారు. అయితే అవి అధికారికంగా వెలువడని సమాచారమని పేర్కొంటూ స్పీకర్ అనుమతి ఇవ్వలేదు. దీంతో కాంగ్రెస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ నిరసనలు ప్రారంభించారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ, ప్రభుత్వం కీలక జాతీయ భద్రతా అంశాలపై చర్చకు భయపడుతోందని ఆరోపించారు. సైన్యానికి సంబంధించిన విషయాలపై పారదర్శకత ఉండాలని, పార్లమెంట్‌లో చర్చించేందుకు అవకాశం ఇవ్వాలన్నారు. సభలో తమకు మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడమే కాకుండా సభ్యులను సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. మరోవైపు అధికార పక్షం మాత్రం విపక్షంపై మండిపడింది. సభా నియమాలను పాటించకుండా, అల్లరి సృష్టించడం సమంజసం కాదని పేర్కొంది. సభా కార్యకలాపాలను అడ్డుకోవడం ప్రజల సమస్యల పరిష్కారానికి ఆటంకమని వ్యాఖ్యానించింది.

**లోక్‌సభ పలుమార్లు వాయిదా**

లోక్‌సభ బుధవారానికి వాయిదా పడడానికి ముందు వారణాసిలోని మణికర్ణికా ఘాట్‌లో జరిగిన కూల్చివేతలపై ప్రతిపక్ష ఎంపిల గర్జన, నిరసనల మధ్య లోక్‌సభ కార్యకలాపాలు మంగళవారం మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడ్డాయి. అంతకుముందు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికాభారత వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించడం, ఇతర అంశాలపై ప్రతిపక్ష ఎంపిల గర్జన నిరసనల మధ్య సభా కార్యకలాపాలు మ ధ్యాహ్నం 12గంటల వరకు ప్రారంభమయ్యాయి.
మధ్యాహ్నం 12 గంటలకు సభ తిరిగి సమావేశమైన వెంటనే, సమాజ్‌వాదీ పార్టీ సభ్యులు ఘాట్ పునరాభివృద్ధికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు, ఇది 1791లో మణికర్ణికా ఘాట్‌ను మొదట పునరుద్ధరించిన 18వ శతాబ్దపు మాల్వా రాజ్య రాణి అహల్యాబాయి హోల్కర్‌ను అవమానించడమేనని ఆరోపించారు. కాశీ విశ్వనాథ్ ఆలయ పునరుద్ధరణకు కూడా ఆమె ఘనత వహించారు. కృష్ణప్రసాద్ టెన్నెటి అభ్యంతరం చెప్పిన హోల్కర్ చిత్రాలను ఎస్‌పి ఎంపిలు ప్రదర్శించారు. విపక్ష సభ్యులు పట్టువీడకపోవడంతో సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. భారత్ – చైనా ఘర్షణలపై మాజీ ఆర్మీ చీఫ్ నరవణె రాసిన ప్రచురితం కాని పుస్తకంలోని కొన్ని విషయాలను లేవనెత్తేందుకు కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీని స్పీకర్ ఓం బిర్లా నిరాకరించిన అంశాన్ని కూడా ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తారు. సభ సమావేశమైన వెంటనే నిరసనలు ప్రారంభమయ్యాయి. సురుప్‌సింగ్ హిర్యా నాయక్ మృతికి బిర్లా సంతాప సూచికంగా మౌనం పాటించాలని బిర్లా సభ్యులను కోరారు. ఒక నిమిషం మౌనం పాటించిన తర్వాత, సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి 'మోదీని అప్పగించండి' వంటి నినాదాలు చేశారు.



# కేంద్రం నుంచి తెలంగాణకు రూ.25వేల కోట్లు రావాలి

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి రావాల్సిన నిధులకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణా రావు సంబంధింత అధికారులను ఆదేశించారు. మంగళవారం డా.బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శుల సమావేశం జరిగింది. ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం నిర్వహించిన ఈ సమావేశంలో సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ, కేంద్ర ప్రాయోజిత పథకాల నుండి అత్యధిక నిధులు పొందేలా ప్రణాళిక బద్ధంగా పనిచేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ సిఎస్ఎస్ క్రింద రూ. 5 లక్షల కోట్ల బడ్జెట్ లో ప్రతి పాదించిందని, దీనిలో భాగంగా 15 శాతం జనాభా ఉన్న తెలంగాణాకు కనీసం రూ. 25 వేలకోట్లు రావాల్సి ఉందని స్పష్టం చేశారు. ఈ కేంద్ర బడ్జెట్ లో ఫార్మా, రంగ అభివృద్ధి, సెమి కండక్టర్ తయారీ, వ్యవసాయ రంగంలో పలు అంశాల అభివృద్ధికి ప్రాధాన్యత నిచ్చారని, ఈ దిశగా తగు చర్యలు తీసుకోవాలని సి.ఎస్ సూచించారు. ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాను కలుపుతూ టెంపుల్ కారిడార్ అభివృద్ధికి అవకాశం ఉందని, దీనిలో భాగంగా వరంగల్ లో మామునూరు ఎయిర్ పోర్ట్ కూడా వస్తున్నందున ఈ జిల్లాల్లో టూరిజం, పారిశ్రామిక, వాణిజ్య రంగాల అభివృద్ధి కి గణనీయమైన అవకాశం ఉందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ రాష్ట్రానికి మరో రూ.10 వేల కోట్లు రావాల్సి ఉందని ఈ అంశంలో సంబంధిత శాఖల కార్యదర్శులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. 16 ఆర్థిక కమీషన్ లోభాగంగా 2011 జనాభా ప్రాతిపదికపై నిధుల మంజూరు ఉంటుందని, దీనితో పాటు డెమోగ్రాఫిక్ ఏరియా, పథకాల అమలు సామర్థ్యం, నిధుల వినియోగం లాంటి ప్రాతిపదికలపై కూడా నిధుల కేటాయింపు ఉంటుందని వివరించారు. ప్రధానంగా అభివృద్ధి ఆధారిత ఇండికేటర్ల ప్రాతిపదిక ప్రకారం నిధుల కేటాయింపుకు ప్రాధాన్య నిచ్చారని అన్నారు. కేంద్ర ప్రభుత్వంలో వినియోగం కాకుండా ఉన్న మిగులు నిధులను రాష్ట్రానికి దక్కేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సివి ఆనంద్, వికాస్ రాజ్, సంజయ్ కుమార్, జయేష్ రంజన్, సవ్యసాచి ఘోష్, అహ్మద్ నదీమ్, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, నవీన్ మిట్టల్, ఎన్. శ్రీధర్ వివిధ శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.

# దళిత వ్యతిరేక విధానాలు అవలంభిస్తోన్న బిజెపి

### సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలి : సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనరసింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్రంలోని మోదీ ప్రభుత్వ పాలనలో దళితులపైన జరుగుతున్న అన్యాయాలకు, బిజెపి దళిత వ్యతిరేక విధానాలను దళిత సమాజం అర్థం చేసుకుని సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం. బాలనరసింహ పిలుపునిచ్చారు. దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కె.ఏసురత్న అధ్యక్షతన హైదరాబాద్, మఖ్దూం భవనలోని రాజ్ బహదూర్ విజ్ఞాన కేంద్రంలో మంగళవారం డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎం. బాల నరసింహ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజ్యాంగంలోని సామాజిక న్యాయ భావనలను పక్కన పెట్టిందని, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పాలన సాగిస్తోందని విమర్శించారు. 2026–27 కేంద్ర ఆర్థిక బడ్జెట్‌లో దళితులకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం ద్వారా రిజర్వేషన్లను నిర్వీర్యం చేసిందని, దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బాలనరసింహ ఆరోపించారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల్లో బాధితులకు న్యాయం జరగకుండా అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. విద్య, ఉపాధి, భూమి, భద్రత వంటి మౌలిక హక్కుల విషయంలో దళితులను బిజెపి ప్రభుత్వం నిరంతరం మోసం చేస్తోందని, ఎన్నికల సమయంలోనే దళితుల గురించి మాట్లాడి, అధికారంలోకి రాగానే వారి సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో దళిత సమాజం మౌనంగా ఉండకుండా బిజెపి విధానాల అసలు స్వరూపాన్ని గుర్తించి, ఉద్యమాల బాట పట్టాలని సూచించారు. దళిత మహిళల పైన దాడులు, హత్యలు, అత్యాచారాలు జరిగినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లను ప్రతి నియోజకవర్గంలో అత్యధిక ప్రాధాన్యత దళితులకు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో 2018 నుండి ఇప్పటివరకు ఎస్‌సి ఇండస్ట్రీలో రుణాలు తీసుకున్న లబ్ధిదారులకు సబ్సిడీలు విడుదల చేయలేదని, తక్షణమే సబ్సిడీ రుణాలను విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ ఏప్రిల్ 26, 27వ తేదీలలో వరంగల్‌లో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర రెండవ మహాసభలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. హైదరాబాద్‌లోనే అంబేద్కర్ భవనాన్ని రాష్ట్ర ప్రభుత్వమే పునర్నిర్మించాలన్నారు. గత బిఆర్‌ఎస్ పాలనలో దళితులకు కేటాయించిన అసైన్డ్ భూములను అధికారుల అండదండతో ధరణిలో అక్రమంగా పట్టాలు చేసుకున్నారని, వీటిని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించి, వెంటనే వాటిని తిరిగి దళితులకు హక్కులను కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర నాయకులు కె రత్నకుమారి, వై ఉషశ్రీ, టి.రామకృష్ణ, కె.వెంకటస్వామి, ఆరుట్ల రాజ్‌కుమార్, జేరుపోతుల కుమార్, బి లక్ష్మ పతి, ఎం. సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో చార్జ్ షీట్‌కు సిట్ సన్నాహాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సంచలనంగా మారి న ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రత్యేక దర్యా ప్తు బృందం (సిట్) చార్జ్ షీట్ దాఖలు చేసేందుకు ప్రయత్నాలు వేగవంతం చేసింది. ఇప్పటికే ్ర పోలీసులు, బిఆర్‌ఎస్ పార్టీకి చెందిన పలువురు కీలక నేతల విచారణ పూర్తవడంతో, వారి వాం గ్మూలాలు, సాంకేతిక ఆధారాల ఆధారంగా తదుపరి చర్యలకు సిట్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. విచారణలో సేకరించిన డిజిటల్ డేటా, కాల్ డిటెయిల్స్, పత్రాల విశ్లేషణ దాదాపు ముగిసిన నేపథ్యంలో, ప్రస్తుత నిందితులపై మరింత బలమైన అభియోగాలు మోపే దిశగా అడిషనల్ చార్జ్ షీట్ రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ చార్జ్ షీట్‌లో మరికొందరిని నిందితులుగా చేర్చుతారా? లేక ప్రస్తుతం ఉన్న నిందితులకే పరిమితమవుతారా? అనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. సిట్ చేతిలో ఉన్న ఆధారాలు, కీలక సాక్షుల వాంగ్మూలాలే ఈ నిర్ణయానికి ఆధారంగా మారనున్నాయని అధికారులు సూచిస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రాజకీయంగా తీవ్ర దుమారం రేపిన నేపథ్యంలో, సిట్ దాఖలు చేయనున్న చార్జ్ షీట్‌పై రాష్ట్ర రాజకీయ వర్గాలన్నీ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి.

# మున్సిపల్ ఎన్నికల్లో... జాగ్రత్త!

### అధికారులను ఆదేశించిన డిజిపి శివధర్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికలను చట్టం ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర డిజిపి బి.శివధర్ రెడ్డి పోలీస్ అధికారులతో అన్నారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మున్సిపల్ ఎన్నికలు జరగనున్న ప్రాంతాల పోలీస్ కమిషనర్లు , జిల్లాల ఎస్‌పిలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లలతో మాట్లాడారు. రాష్ట్రంలోని 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కొత్తగూడెం, కరీంనగర్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, నిజామాబాద్, నల్గొండ, రామగుండం కార్పొరేషన్ల పరిధిలోని 414 వార్డులతో పాటు, 116 మున్సిపాలిటీల్లోని 2582 వార్డుల్లో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఈనెల 11వ తేదీన పోలింగ్, 13 తేదీన కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించి రాష్ట్ర పోలీస్ శాఖకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని డిజిపి సూచించారు. ఏ రకమైన ఫిర్యాదులు గాని , అవాంఛనీయ సంఘటనలు గాని జరగకుండా చర్యలు తీసుకోవాలని డిజిపి స్పష్టం చేశారు. నిబంధనల మేరకు కఠినంగా వ్యవహరించాలని డిజిపి పోలీస్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ పోలీస్ లీగల్ అడ్వైజర్ శ్రీరాములు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన చట్టాల గురించి సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....చట్టం ప్రకారం ఓటర్లను ప్రభావితం చేయడం, ఒకరికే ఓటు వేయాలని ఒత్తిడి తీసుకురావడం లేదా నామినేషన్ వేయకుండా అడ్డుకోవడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని, బాధితులపై సామాజికంగా లేదా ఆర్థికంగా బహిష్కరణలు విధిస్తే చట్టరీత్యా కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. అదే విధంగా శాంతియుత వాతావరణాన్ని దెబ్బతీసేలా మద్యం పంపిణీ చేసినా, ఎక్సైజ్ చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా కనీసం ఆరు నెలల నుంచి రెండేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందనీ ,ఆయుధాల చట్టం ప్రకారం లైసెన్స్‌డ్ ఆయుధాలను కలిగి ఉన్న వారు నిబంధనల మేరకు పోలీస్ స్టేషన్లలో జమ చేయాలని, లేనిపక్షంలో ఒక ఏడాది నుంచి మూడేళ్ల వరకు కఠిన కారాగార శిక్ష విధించాలని నిబంధనలు ఉన్నాయన్నారు. మరోవైపు ఎన్నికల ప్రచార పర్వంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు అనుసరించాల్సిన నిబంధనల విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించాలన్నారు. బహిరంగ ప్రదేశాల డిస్ఫిగర్మెంట్ చట్టం 1997ను అనుసరించి ఎవరైనా అనుమతి లేకుండా గోడలపై పోస్టర్లు అంటించినా, అశ్లీల ప్రకటనలు ప్రదర్శించినా వాటిని తొలగించడమే కాకుండా సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని, ధ్వని కాలుష్యాన్ని నియంత్రించేందుకు టౌన్ న్యూసెన్స్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాల్సి ఉందన్నారు. పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా బహిరంగ ప్రదేశాల్లో లౌడ స్పీకర్లు వాడటం చట్టరీత్యా నేరం. ప్రచార వాహనాల విషయంలోనూ మోటార్ వాహనాల చట్టం1988 కింద అనేక ఆంక్షలు అమల్లో ఉన్నాయనీ, ఎన్నికల ప్రచారానికి ఉపయోగించే వాహనాలకు రిటర్నింగ్ అధికారి నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి అని, ఆ అనుమతి పత్రం యొక్క ఒరిజినల్ కాపీని వాహనం ముందు భాగంలో ప్రదర్శించాలన్నారు.



## రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ వెబ్‌సైట్‌ను ప్రారంభించిన మంత్రి పొన్నం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యార్థులకు తల్లిదండ్రులతో ఉన్న బంధాన్ని రవాణా శాఖరోడ్డు భద్రతకు ఉపయోగించుకునేందుకు రోడ్డు భద్రత ప్రతిజ్ఞా వెబ్‌సైట్‌ను ప్రారంభించిందిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రతి విద్యార్థి వారి తల్లిదండ్రులతో రోడ్డు నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ హామీ పత్రాన్ని ఇవ్వాలని కోరారు. ఈ ప్రతిజ్ఞ రాబోయే కాలంలో రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు ఉపయోగపడుతుందని భావిస్తున్నామన్నారు. మంగళవారం సచివాలయంలో రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ వెబ్‌సైట్‌ను రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రోడ్డు నిబంధనల పాటిస్తామని ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల దగ్గర హామీ పత్రం తీసుకోవడం ద్వారా విద్యార్థులతో ఉన్న వారి బాండింగ్ తో రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని ఆన్‌లైన్‌లో క్షేత్ర స్థాయిలో రవాణా శాఖ అధికారులు పెద్ద ఉద్యమంలా తీసుకుపోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు చంద్రశేఖర్ గౌడ్, శివ లింగయ్య, రాష్ట్ర రవాణా అథారిటీ సభ్యుడు నవీన్ పెట్టెం తదితరులు పాల్గొన్నారు.

## ‘సిట్’ విచారణను ప్రభావితం చేసేలా సిఎం మాటలు

### శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిఎం రేవంత్ మాటలు సిట్ విచారణను ప్రభావితం చేసే విధంగా ఉన్నాయని బిఆర్‌ఎస్ శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి అన్నారు. కెసిఆర్ ఏనాడు కూడా విచారణను ఎదుర్కోనను అని అనలేదని, మున్సిపల్ ఎన్నికలు ఉన్నందునే మొదటి నోటీసు విచారణకు సమయం కావాలని కోరారన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెసిఆర్ ముమ్మాటికి తెలంగాణ జాతిపితనే అని అన్నారు. రేవంత్‌రెడ్డి విమర్శలను తెలంగాణ సమాజం గమనిస్తోందని, ఆయనకు తగిన బుద్ధి చెబుతుందన్నారు. సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణలో రేవంత్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, జాతర నిర్వహణకు శాశ్వత ఏర్పాట్లు చేస్తామని సిఎం ,మంత్రులు ఉత్తర కుమార ప్రగాల్భాలు పలికారని, కానీ 15 గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయిందని, అక్కడ కనీస ఏర్పాట్లను కూడా చేయలేకపోయారని ఆయన ఆరోపించారు. ఎంఎల్‌సి తక్కెళ్లపల్లి రవీందర్ రావు మాట్లాడుతూ కోదండరామ్‌కు రాజ్యసభ ,ఎంఎల్‌సి పదవి ఇస్తానని ఆనాడే కెసిఆర్ ప్రతిపాదించినప్పటికీ ఆయననే తిరస్కరించారని వివరించారు. ఎంఎల్‌సి పదవి ఇచ్చినట్టే ఇచ్చి రద్దయ్యేలా చేసిన సిఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు కోదండరామ్‌పైన మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.



## శాసన మండలి హాల్ త్వరలో ప్రారంభం

### చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శాసన మండలి హాల్ పారంభోత్సవ కార్యక్రమం త్వరలోనే ఉండనుందని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ శాసన సభ ప్రాంగణంలోని శాసన మండలి భవనం పునర్నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. మండలి సెక్రెటరీ డా. నరసింహా చార్యులు, ఆర్ అండ్ బి, అగాఖాన్ సంస్థ, తదితర అధికారులతో కలిసి పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ‘ రాబోయే బడ్జెట్ సమావేశాలను అసెంబ్లీ పక్కనే ఉన్న భవనంలోనే శాసనమండలి నిర్వహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందని తెలిపారు. తాజాగా ఇప్పటి వరకు పూరైన పనుల పురోగతిని ఆరా తీసిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఖచ్చితంగా శాసన మండలి బడ్జెట్ సమావేశాలు అసెంబ్లీ ఆవరణలో ఉన్న భవనంలో నిర్వహించుకోవాలని సూచించారన్నారు. పనుల, వేగం పెంచి త్వరగా భవనాన్ని పూర్తి చేసి శాసన మండలి అధికారులకు అప్పగించాలని ఛైర్మన్ సూచించారు .ఆలస్యం చేస్తే కాంట్రాక్టు పనులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బిజెపి ప్రభుత్వం

### కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి ఆగ్రహం



**ప్రజాపక్షం/హైదరాబాద్/యాదాద్రి :** ప్రజల గొంతుకను సభలో వినిపిస్తుంటే అప్రజాస్వామికంగా మాపై సస్పెన్షన్ వేటు వేశారని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నదని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభలో మంగళవారం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో తెలంగాణకు చెందిన భువనగిరి కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి సహా ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపిలను స్పీకర్ సస్పెండ్ చేశారు. సస్పెన్షన్ అనంతరం పార్లమెంట్ ఆవరణలో ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ‘రాహుల్ గాంధీ వాస్తవాలు మాట్లాడుతుంటే తట్టుకోలేక బిజెపి మైకులు కట్ చేస్తోందని దుయ్యబట్టారు. ప్రధాని మోదీ, ట్రంప్ ఒత్తిడికి తలొగ్గి దేశ ప్రయోజనాలను పణంగా పెడుతున్నారని ఆయన ఆరోపించారు. ఆ విషయాన్ని ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తారా?‘ అని ఆయన ప్రశ్నించారు. బిజెపి చేస్తున్న ఈ ‘చిల్లర రాజకీయాలకు‘ భయపడేది లేదని, బుధవారం పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద సస్పెండైన ఎనిమిది మంది ఎంపిలం ఆందోళన చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

**అడ్డదారిలో గెలవాలని చూస్తున్న బిఆర్‌ఎస్**

మున్సిపల్ ఎన్నికల్లో అడ్డదారిలో గెలవాలని చూస్తున్న బిఆర్‌ఎస్ పార్టీకి తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెసిఆర్ కుటుంబంపై ఘాటు విమర్శలు చేశారు. ‘హరీష్ రావు ఒక లక్కీ స్టార్. ఎమ్మెల్యే కాకముందే రాజశేఖర్ రెడ్డి హయాంలో మంత్రి పదవి పొందిన చరిత్ర ఆయనది. ఓట్లు వేయించుకోకుండానే పదవులు అనుభవించిన వ్యక్తి ఆయన’ అని చామల విమర్శించారు. రేవంత్ రెడ్డి స్వశక్తితో ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగితే, అది చూసి హరీష్ రావు కడుపు మంటతో రగిలిపోతున్నారని, ఆ మంట తగ్గడానికి ‘ఈనో‘ ప్యాకెట్లు వాడుకోవాలని ఎద్దేవా చేశారు.

## రెండేళ్లలోనే 70 వేల ఉద్యోగాలు భర్తీ

### ఎమ్మెల్సీ బల్మూరి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్అధికారం చేపట్టిన రెండేళ్లలోనే 70 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని, దీనినిజీర్ణించుకోలేని మాజీ మంత్రి కె.తారక రామారావు ప్రజా ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఎంఎల్‌సి బల్మూరి వెంకట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగులు కలవడానికి కూడా కనీసం అపాయింట్ మెంట్ ఇవ్వని కెటిఆర్ ఇప్పుడు వారి కోసం మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందన్నారు. గాంధీ భవన్‌లో మంగళవారం ఆయన మీడియా తో మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వ పాలనలోనే నిరుద్యోగులకు పూర్తి న్యాయం జరుగుతోందని, ఇప్పటికే 70వేల ఉద్యోగాలు భర్తీ చేసి నియామక పత్రాలు అందజేశామని వెల్లడించారు.. మరిన్ని నోటిఫికేషన్ల విడుదల కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఇందుకు సంబంధించి టిజిపిఎస్‌సి ప్రక్రియను మొదలు పెట్టిందన్నారు. అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ను కొనసాగిస్తోందని, త్వరలోనే మరికొన్ని నియామకాల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేయనుందని తెలిపారు. కెటిఆర్ 10 ఏళ్లు అధికారంలో ఉన్నప్పుడు లక్షా 60వేల ఉద్యోగాలు ఇచ్చామని చెబుతున్నారని, వారు ఎంత వరకు ఉద్యోగాలు ఇచ్చారో ఉద్యోగాలను అంగట్లో సరుకులు లెక్కనఎట్ల అమ్ముకున్నారో అందరికీ తెలిసేందని పేర్కొన్నారు. కాంగ్రెస్ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగులకు న్యాయం చేయడానికి ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని నిరుద్యోగులు ప్రతిపక్షాల మాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు.

## ఎంఐఎం మాజీ ఎమ్మెల్యే అహ్మద్ పాషా ఖాద్రీ మృతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆల్ ఇండియా మజ్లీస్ఎఇత్తేహాదుల్ ముస్లిమిన్ (ఎఐఎంఐఎం) పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ(72) మరణించారు. రెండేళ్లుగా మూత్ర పిండాల వ్యాధితో బాధపడుతూ, హైదరాబాద్ ఒవైసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం కన్నుమూశారు. సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ 1954 సెప్టెంబర్ 15న సయ్యద్ ముర్తుజా పాషా ఖాద్రీ, సయ్యదా అమతుల్ కరీం దంపతులకు హైదరాబాద్‌లో జన్మించారు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 10వ తరగతి వరకు చదువుకున్న పాషా ఖాద్రీ 1986, 1991లో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్‌గా ఎన్నికైయ్యారు. ఆతర్వాత 2004లో చార్మినార్ నియోజవర్గం నుంచి మొదటిసారి ఎమ్మెల్యేగా గెలుపొంది తిరిగి 2009, 2014, 2018లో ఇదే నియోజకవర్గం నుంచి వరసగా విజయం సాధించారు.

## తెలంగాణ బస్సులకు అనుమతివ్వాలి

### తిరుమలలో రూ.300 దర్శనం

### టిటిడికి సిపిఐ నేత డాక్టర్ కె.నారాయణ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో రూ.300 ప్రత్యేక దర్శనం కోసం తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్‌కు చెందిన టూరిజం బస్సులకు అనుమతి ఇవ్వాలని సిపిఐ సెంట్రల్ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి)ను కోరారు. ఈ మేరకు టిటిడి చైర్మన్‌కు నారాయణ లేఖ రాశారు. గతంలో తెలంగాణ టూరిజం కార్పొరేషన్‌కు చెందిన నాలుగు బస్సుల ద్వారా వచ్చే 172 మంది భక్తులకు, విమాన ప్రయాణం ద్వారా వచ్చే 50 మంది భక్తులకు, కస్టమైజడ్ ద్వారా వచ్చే 78 మంది భక్తులకు టికెట్లను ప్రతి రోజు టిటిడి ఇచ్చేదని లేఖలో గుర్తు చేశారు. డిసెంబర్ 2024 నుంచి టిటిడి నిర్ణయాల కారణంగా ఈ టూరిజం బస్సులకు రూ.300 దర్శనం టికెట్లతో తిరుమల దర్శనానికి అనుమతి లేకుండా పోయిందని ఆయన లేఖలో పేర్కొన్నారు. దీంతో టూరిజం కార్పొరేషన్‌కు ఆర్థిక నష్టంతో పాటు భక్తులకు కూడా అసౌకర్యం ఏర్పడుతోందని తెలిపారు. అంతేకాకుండా, గతంలో ఉన్న విధానాన్ని పునరుద్ధరించి తెలంగాణ టూరిజం కార్పొరేషన్‌కు చెందిన టూరిజం బస్సులకు మళ్లీ రూ.300 దర్శనం టికెట్ ద్వారా తిరుమల దర్శనానికి అనుమతి ఇవ్వాలని నారాయణ కోరారు.

# ఒటిపి మోసాలపై ప్రజలు అప్రమత్తం

### సైబర్ పోలీసుల హెచ్చరిక

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఫోన్ కాల్స్, ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్ సందేశాలు, నకిలీ కస్టమర్ కేర్ నంబర్లు, ఫిషింగ్ వెబ్‌సైట్ల ద్వారా ఒటిపి (వన్ టైమ్ పాస్‌వర్డ్)లను సేకరించి సైబర్ మోసగాళ్లు ప్రజలను భారీగా మోసం చేస్తున్నారని హైదరాబాద్ సైబర్ క్రైమ్స్ పోలీసులు హెచ్చరించారు. ఒటిపి దొరికిన వెంటనే బ్యాంక్ ఖాతాలు, క్రెడిట్ కార్డులు, డిజిటల్ వాలెట్లు, ఈకామర్స్ యాప్స్‌లలోకి అక్రమంగా ప్రవేశించి డబ్బు దోచుకుంటున్నారని తెలిపారు. సైబర్ నేరగాళ్లు బ్యాంక్ ఉద్యోగులు, కస్టమర్ కేర్ సిబ్బంది, డెలివరీ ఏజెంట్లు, ఉద్యోగం లేదా లోన్ ఇస్తామని చెప్పే మధ్యవర్తులుగా నటిస్తూ ఒటిపి అడుగుతున్నారని పేర్కొన్నారు. అలాగే రిఫండ్, క్యాష్‌బ్యాక్, గిఫ్ట్ ఓచర్లు పేరుతో కూడా ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు.

**ఒటిపి మోసాల ప్రధాన విధానాలు:**

నకిలీ బ్యాంక్ కెవైసి అప్డేట్ కాల్స్ ద్వారా ఒటిపిలు అడగడం
ఆన్‌లైన్ షాపింగ్ రిఫండ్ లేదా క్యాష్‌బ్యాక్ పేరిట ఒటిపి కోరడం
గూగుల్‌లో కనిపించే నకిలీ కస్టమర్ కేర్ నంబర్ల ద్వారా మోసం
ఉద్యోగం, లోన్ మంజూరు చేస్తామని చెప్పి ఒటిపి అడగడం
యుపిఐ కలెక్ట్ రిక్వెస్టుల ద్వారా డబ్బు డెబిట్ చేయడం
సిమ్ స్వాప్ మోసాల ద్వారా బ్యాంకింగ్ ఎస్ఎంఎస్‌లు తమ నియంత్రణలోకి తీసుకోవడం
ఈకామర్స్ రిటర్న్ లేదా డెలివరీ పేరిట ఒటిపిలు పొందడం

**ప్రజలకు సైబర్ పోలీసుల సూచనలు:**

ఒటిపిను ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ చెప్పవద్దు
బ్యాంక్, ప్రభుత్వం, ఈకామర్స్ సంస్థలు ఒటిపి అడగవని గుర్తుంచుకోవాలి
తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్, మెసేజెస్ నమ్మవద్దు
అనుమానాస్పద యుపిఐ కలెక్ట్ రిక్వెస్టులను ఆమోదించవద్దు
అధికారిక వెబ్‌సైట్ లేదా యాప్‌లో ఉన్న కస్టమర్ కేర్ నంబర్లనే ఉపయోగించాలి
మెసేజ్‌ల స్క్రీన్‌షాట్‌లను ఇతరులకు పంపకూడదు
సిమ్ లాక్, ఫోన్ స్క్రీన్ లాక్, ట్రాన్సాక్షన్ అలర్ట్స్ వంటి భద్రతా ఫీచర్లు యాక్టివేట్ చేసుకోవాలి




ఏదైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైమ్స్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సూచించారు. ప్రజలు సైబర్ అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని కోరారు.

## బిఆర్‌ఎస్‌కు అనుకూలం

### అన్ని పట్టణాలపై గులాబీ జెండా ఎగరవేయాలి : కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మున్సిపల్ ఎన్నికలలో బిఆర్‌ఎస్ ఘనవిజయం సాధించాలని, అన్ని పట్టణాలపై గులాబీ జెండాను ఎగరవేయాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు పిలుపునిచ్చారు. బిఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మున్సిపల్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో కెటిఆర్ మంగళవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైన నేపథ్యంలో బిఆర్‌ఎస్‌కు అనుకూల వాతావరణం నెలకొందని వివరించారు. రానున్న వారం రోజుల పాటు పార్టీ శ్రేణులంతా సమన్వయంతో కష్టపడితే, భారీ మెజారిటీతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. గత మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ ప్రభంజనం ముందు ప్రతిపక్షాలు నిలవలేకపోయాయని, అప్పట్లో కాంగ్రెస్, బిజెపిలు కేవలం ఏడెనిమిది స్థానాలకే పరిమితమైన విషయాన్ని కెటిఆర్ గుర్తు చేశారు.పోలింగ్ రోజున ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు నాయకులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు మున్సిపల్ కోఆర్డినేటర్లు తమకు కేటాయించిన క్షేత్రాల్లోనే అందుబాటులో ఉండాలని కెటిఆర్ సూచించారు.

## యువకుడికి కత్తిపోట్లు



**ప్రజాపక్షం/చిట్యాల :** నల్లగొండ జిల్లా చిట్యాల సమీపంలో ఒక యువకుడిని గుర్తు తెలియని వ్యక్తి కత్తితో దాడి చేసిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. నల్లగొండ పట్టణానికి చెందిన ఇమ్రాన్ నల్లగొండ నుండి హైదరాబాద్‌కు కారులో ప్రయాణిస్తున్నాడు. నార్కట్‌పల్లిలో ఒక వ్యక్తి హైదరాబాద్ వరకు లిఫ్ట్ అడిగాడు. అతనిని కారులో ఎక్కించుకున్న ఇమ్రాన్‌ను సదరు వ్యక్తి చిట్యాల శివారులోకి రాగానే కత్తితో దాడి చేశాడు. ఇమ్రాన్ దగ్గర ఉన్న మొబైల్ ఫోన్‌ను లాక్కోవడానికి ప్రయత్నించాడు. ఇమ్రాన్ అతనిని తీవ్రంగా ప్రతిఘటించిన నేపథ్యంలో కత్తిపోట్లకు గురయ్యాడు. సంఘటనా స్థలంలో ఉన్న స్థానికులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయడంతో క్షతగాత్రుడిని నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. దుండగుడు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

**ఇమ్రాన్‌పై గంజాయి కేసులు..** కాగా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కత్తిపోట్లలో గాయపడిన ఇమ్రాన్‌పై నల్లగొండలోని పోలీస్ స్టేషన్‌లలో గంజాయి కేసులున్నాయని, ఇతనిపై జరిగిన దాడి సంఘటనను ఆ కోణంలో దర్యాప్తు చేస్తామని అన్నారు.

## నాలుగవ వార్డులో సిపిఐ పోటీ



### మిగిలిన 9 వార్డులలో కాంగ్రెస్ పోటీ
### సిపిఐ, కాంగ్రెస్ పార్టీల సంయుక్త ప్రకటన

**ప్రజాపక్షం/చండూరు :** ఈనెల 11న జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా చండూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ), కాంగ్రెస్ పార్టీ కలిసి ఎన్నికల్లో పోటీ చేయడం జరుగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ డిసిసిబి చైర్మన్ చండూరు మున్సిపల్ కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం వారు చండూరులోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంయుక్తంగా మాట్లాడుతూ చండూరు మున్సిపాలిటీలో ఉన్న మొత్తం 10 వార్డులలో సిపిఐ, కాంగ్రెస్ కలిసి పోటీ చేస్తాయని ప్రకటించారు. మున్సిపాలిటీలోని నాల్గవ వార్డులో సిపిఐ పోటీ చేస్తుందని మిగిలిన 9 వార్డులలో కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తుందని ప్రకటించారు. సిపిఐ, కాంగ్రెస్ కలిసి పోటీ చేస్తే ప్రత్యర్థుల డిపాజిట్ గల్లంతు కావాలని, సిపిఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా ఐక్యంగా ప్రచారం చేస్తూ మున్సిపాలిటీలో ఉన్న 10కి 10 వార్డులు గెలిపించుకోవాలని చండూరు మున్సిపాలిటీపై మరోసారి కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

## ర్యాండమైజేషన్ విధానం కీలకం



### జిల్లా ఎన్నికల అధికారి బి.చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సిబ్బంది కేటాయింపులో భాగంగా రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియను మంగళవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో మున్సిపల్ జిల్లా ఎన్నికల పరిశీలకులు జి.రమేష్ సమక్షంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్, నందికొండ, చండూర్, చిట్యాల, దేవరకొండ, హాలియా, మిర్యాలగూడ మున్సిపాలిటీల పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్లకు అవసరమైన పోలింగ్ సిబ్బందిని కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు.అన్ని మున్సిపాలిటీలలో మొత్తం 162 వార్డులు,475 పోలింగ్ స్టేషన్లు ఉండగా, 20 శాతం రిజర్వుతో కలిపి ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక పిఓ, ఒక ఏపిఓ, ఇతర పిఓల చొప్పున మొత్తం 1713 మంది పోలింగ్ సిబ్బందిని రెండవ రాండమైజేషన్ ద్వారా కేటాయించినట్లు తెలిపారు. పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు రాండమైజేషన్ విధానం అత్యంత కీలకమని అన్నారు. ఈ ర్యాండమైజేషన్ కార్యక్రమానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్, ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి హాజరయ్యారు.

## ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

### బరిలో భారీగా స్వతంత్ర అభ్యర్థులు



**ప్రజాపక్షం/-సూర్యాపేట :** మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం మంగళవారంతో ముగిసింది. ఆయా పార్టీల నుండి టిక్కెట్‌ను ఆశించి బంగపడ్డ వారు తమ నామినేషన్లను ఉపసంహరించుకోలేదు. దీంతో స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో దిగనున్నారు. కొంతమంది అభ్యర్థులు తమ పార్టీ పెద్దలు బుజ్జగించడంతో తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. నామినేషన్లు ఉపసంహరించుకోగా ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను అధికారులు అధికారికంగా వెల్లడించారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట మున్సిపాలిటిలో మొత్తం 48 వార్డుల్లో 264 మంది ఎన్నికల బరిలో ఉన్నారు. ఇందులో ఆమ్ ఆద్మీ నుండి 1, బిఎస్‌పి 3, బిజెపి 47, సిపిఎం 3, కాంగ్రెస్ 48, బిఆర్ఎస్ 45, జనసేన 10, ఏఐఎఫ్‌బి (ఫార్వర్డ్ బ్లాక్) 2, ఇతర పార్టీల వారు 27, స్వతంత్రులు 78 మంది పోటీలో నిలిచారు. హుజూర్‌నగర్ మున్సిపాలిటిలో మొత్తం 28 వార్డులు ఉండగా, ఎన్నికల బరిలో 111 మంది ఉన్నారు. ఇందులో ఆమ్ ఆద్మీ 1, బిజెపి 22, సిపిఐ 2, సిపిఎం 1, కాంగ్రెస్ 25, బిఆర్ఎస్ 27, జనసేన 8, ఇతర పార్టీల వారు 2, స్వతంత్రులు 23 మంది బరిలో నిలిచారు. నేరేడుచర్ల మున్సిపాలిటిలో మొత్తం 15 వార్డులు ఉండగా 54 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. బిజెపి 15, సిపిఎం 2, కాంగ్రెస్ 15, బిఆర్ఎస్ 14, ఇతర పార్టీలు 1, స్వతంత్రులు 7 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. తిరుమలగిరి మున్సిపాలిటిలో మొత్తం 15 వార్డులకు గాను 56 మంది అభ్యర్థులు బరిలో ఉండగా బిజెపి నుండి 13, సిపిఎం 2, కాంగ్రెస్ 15, బిఆర్ఎస్ 15, ఇతర పార్టీలు 3, స్వతంత్రులు 8 మంది ఉన్నారు. కోదాడ మున్సిపాలిటిలో మొత్తం 35 వార్డుల్లో మూడు వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 32 వార్డులకు గాను 100కు పైగా అభ్యర్థులు బరిలో ఉన్నారు.

### ‘నా చివరి శ్వాస వరకూ’

# ప్రజల సంక్షేమం కోసమే

### ఎన్నికల ప్రచారంలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ :** నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పలు డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థుల తరుపున రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి విస్తృత ప్రచారం నిర్వహించారు. హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మంచి చెడులో అండగా నిలిచే కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ఉంటామని ప్రతినబూనారు. చర్లపల్లి(15)వ డివిజన్ అభ్యర్థి పెరిక నాగరాజు, మర్రిగూడ 14 డివిజన్ అభ్యర్థి బొజ్జ శంకరయ్యకు మద్దతుగా చర్లపల్లి బొద్రాయి చౌరస్తా వద్ద ప్రచారం నిర్వహించారు. అనంతరం 12వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి మామిడి కార్తీక్, 27 డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి సట్టు నాగమణి శంకర్, 28వ డివిజన్ అభ్యర్థి గుండబోయిన పుష్పలత వెంకన్న, 29వ డివిజన్ అభ్యర్థి గులాబ్ మహమ్మద్ షఫిక్, 26వ డివిజన్ అభ్యర్థి అసిమా సుల్తాన్ (బషీర్), 30వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి మారగోని నవీన్ గౌడ్ తరపున విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భావోద్వేగ ప్రసంగం చేశారు. ‘‘5సార్లు నన్ను ఎమ్మెల్యేగా గెలిపించిన నా నల్లగొండ ప్రజల రుణం తీర్చుకోలేనిదనీ, నల్లగొండ ప్రజలతో నాది విడదీయని ఆత్మీయబంధమన్నారు. నల్లగొండ నే నా ఇల్లు... నల్లగొండనే నా ప్రాణం... నల్లగొండనే నా కుటుంబం.. నల్లగొండనే నా జీవితమని, పేద ప్రజల మధ్యలో ఉండడం నాకిష్టం’’ అని మంత్రి పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ హాఫీజ్ ఖాన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, తిప్పర్తి మాజీ జెడ్పిటిసి పాశం రామ్ రెడ్డి, అభ్యర్థులు పాల్గొన్నారు.



## గ్రామాల్లో పులి సంచరిస్తున్న ప్రదేశాల్లో కలెక్టర్ ప్రత్యేక చర్యలు



**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లాలోని కొన్ని గ్రామాల పరిసర ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లుగా అటవీ శాఖ అధికారులు గుర్తించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం రాజాపేట మండలం బసంతాపూర్ గ్రామంలో నిన్న రాత్రి పులి దాడిలో మృతి చెందిన లేగ దూడ సంఘటన స్థలాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల గ్రామాలలో పులి సంచరిస్తున్నందున పులిని పట్టుకోవడానికి చేసే ప్రయత్నాల పై అటవీ అధికారులతో కలెక్టర్ చర్చించారు. అటవీ అధికారులు పులిని పట్టుకోవడానికి థర్మల్ డ్రోన్‌ను ఉపయోగించి పులి సంచరిస్తున్న ప్రదేశాలను వీడియో తీయడం, ట్రాప్ కెమెరా, పులిని బంధించడానికి బోన్లు ఏర్పాటు చేయడం జరిగిందని అటవీ శాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రత్యేకంగా అడవి ప్రాంతాలకు ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు రాత్రి వేళల్లో ఒంటరిగా బయటకు వెళ్లకూడదని, వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లేటప్పుడు గుంపులుగా వెళ్లాలని తెలిపారు. రాత్రి వేళలో పశువులను బయటికి వదలకుండా పశువుల పాకలో వెలుతురు ఉండేలా చూసుకోవాలన్నారు. పులి కనిపించినట్లు గమనించిన వెంటనే అటవీ శాఖ అధికారులకు లేదా స్థానిక గ్రామ పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని కోరారు. వాటి దగ్గరకు వెళ్లే ప్రయత్నం చేయరాదని అన్నారు. జిల్లా యంత్రాంగం మరియు అటవీ శాఖ సిబ్బంది పులి అడుగు జాడలను గమనిస్తూ , దాని పట్టుకోవడానికి, అడవిలోకి పంపడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు భయాందోళనకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## చిట్యాలలో కాంగ్రెస్‌కు సిపిఐ సంపూర్ణ మద్దతు



**ప్రజాపక్షం/చిట్యాల :** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్నట్లు సిపిఐ నాయకుల తెలిపారు. మంగళవారం రోజున 2, 5 వార్డులకు నామినేషన్ వేసిన సిపిఐ నాయకులు షేక్ ఖాతీజ, బొలుగూరి సుగుణమ్మలు తమ నామినేషన్‌లను ఉపసంహరించుకున్న అనంతరం స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశంను కలిసి తమ మద్దతును ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీతో ఉన్న స్నేహాన్ని కొనసాగిస్తామని, అన్ని వార్డులలో అభ్యర్థులను గెలిపించడానికి కృషి చేస్తామని అన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెలుతున్న కాంగ్రెస్ పార్టీ వెంటే తాము ఉంటామని ఈ సందర్భంగా వారు ప్రకటించారు. ఈ సందర్భంగా వీరేశం మాట్లాడుతూ సిపిఐ నాయకుల మద్దతుతో తమ బలం మరింత పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు లొడంగి శ్రవణ్‌కుమార్, మండల కార్యదర్శి ఎండి అక్బర్, సహాయ కార్యదర్శి షేక్ షరీఫ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు పోకల దేవదాసు, నాయకులు పాటిమాధవరెడ్డి, జడలచినమల్లయ్య పాల్గొన్నారు.

## ప్రజా ఆశీర్వాదంతో గెలిచి సత్తా చాటాలి

### భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పురపాలక సంఘం రెండవ సాధారణ ఎన్నికల్లో భాగంగా ఈనెల 11న జరిగే పోచంపల్లి మున్సిపాలిటీ 13 వార్డులకు జరిగే ఎన్నికలలో పోటీ చేసే కౌన్సిలర్ అభ్యర్థులకు మంగళవారం బి ఫారాలను అందజేసి ప్రజా ఆశీర్వాదంతో భారీ మెజారిటీతో అందరూ గెలిచి కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన పట్టణ కేంద్రంలోని మార్కండేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి చైర్మన్ అభ్యర్థి కౌన్సిలర్లకు బి ఫారాలను అందజేసి ఆల్ ది బెస్ట్ చెప్పారు. 13 వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులు, టౌన్ అధ్యక్షులు భారత లవ కుమార్ మండల పార్టీ అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, డిసిసి అధ్యక్షులు కళ్లెం రాఘవ రెడ్డి, మర్రి నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు అంబరీష్ రెడ్డి, బాల్‌రెడ్డి, పోచంపల్లి బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, బండారు ప్రకాష్ రెడ్డి, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు గంజి యుగంధర్, ఉపాధ్యక్షులు రుద్ర చంద్రప్రకాష్, చేనేత కార్మిక సంఘం కార్యదర్శి బిట్ల గణేష్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు అభిమానులు ఆయన వెంట ఉన్నారు.

## మోటార్ సైకిల్ దొంగతనాల ముఠా అరెస్టు



### సుమారు రూ.7 లక్షల విలువైన 8 మోటార్ సైకిళ్లు, 4 స్మార్ట్‌ఫోన్లు స్వాధీనం : అడిషనల్ ఎస్‌పి రమేష్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ జిల్లా కేతేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను కేతేపల్లి పోలీసులు అరెస్టు చేశారని అడిషనల్ ఎస్‌పి రమేష్ తెలిపారు. మంగళవారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మోటార్ సైకిల్ దొంగతనాల ముఠాను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్‌పి మాట్లాడుతూ కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పల్లెం నరసయ్య హైదరాబాద్ నుండి విజయవాడ వెళ్తూ, కేతేపల్లి గ్రామంలోని సాయి కృష్ణ హోటల్ వద్ద రాత్రి సమయంలో నిద్ర రావడంతో హోటల్ ఆవరణలో బైక్ పార్క్ చేసి నిద్రించగా, మరుసటి డిసెంబర్ 31న తెల్లవారు జాము సుమారు లేచి చూడగా బైక్ కనిపించక పోవడంతో కేతేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ దర్యాప్తులో భాగంగా, మంగళవారం తెల్లవారు జాము సమయంలో, కొర్లపహాడ్ ఎక్స్ రోడ్ వద్ద విజయవాడ వైపు వెళ్లే వాహనాలను కేతేపల్లి ఎస్.ఐ, సిబ్బంది తనిఖీ చేస్తుండగా, రెండు మోటార్ సైకిళ్లపై నలుగురు వ్యక్తులు విజయవాడ వైపు వస్తూ పోలీసులను గమనించి పారిపోవడానికి ప్రయత్నించగా, అప్రమత్తమైన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారని తెలిపారు. విచారణలో ఏ 1 పగిళ్ల శివ కుమార్ ఇద్దరు బాల నేరస్తులు నల్లగొండలోని ప్రతీక్ రెడ్డి మెమోరియల్ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతున్నారని, జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. వారి వద్ద నుంచి సుమారు రూ.7 లక్షల విలువైన 8 మోటార్ సైకిళ్ళు,4 స్మార్ట్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసును నల్లగొండ డి.ఎస్.పి పర్యవేక్షణలో విజయవంతంగా ఛేదించిన సిఐ శాలిగౌరారం కొండల్ రెడ్డి, సీసీస్ సిఐ జితేందర్ రెడ్డి, ఎస్ఐ విజయ్ కుమార్, కేతేపల్లి ఎస్ఐ సతీష్, హెడ్ కానిస్టేబుల్ విష్ణు వర్ధనగిరి, వాహీద్, పుష్ప గిరి సిబ్బందిని అదనపు ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.

## కాంగ్రెస్ – బిఆర్ఎస్ మధ్య హోరాహోరీ..

### ప్రజాదరణ దక్కేది ఎవరికి..?

**ప్రజాపక్షం/సూర్యాపేట : సూర్యాపేట మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ మధ్య హోరాహోరీ నెలకొంది. ఆ పార్టీల నేతలు ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ తమ రాజకీయ చతురతను ప్రదర్శిస్తున్నారు. అధికార పార్టీ ఆర్యవైశ్య కమ్యూనిటీకి చెందిన ఓ బడా కాంట్రాక్టర్ సతీమణిని ఎన్నికల బరిలో నిలుపగా బిఆర్ఎస్ అందుకు ధీటుగా దేశం కోసం ప్రాణాలర్పించిన అదే కమ్యూనిటీకి చెందిన కల్నల్ సంతోష్ బాబు తల్లిని పోటీకి దింపింది. వీరు ఇరువురూ ఒకే కమ్యూనిటికి చెందిన వారు కావడంతో అత్యధికంగా ఓటు బ్యాంక్ ఉన్న ఆర్యవైశ్యుల ప్రజాదరణతో-పాటు ఇతర కమ్యూనిటీ ఓటర్లు ఎటు వైపు మొగ్గు చూపుతారో అనే చర్చ ప్రజల్లో పెద్దఎత్తున సాగుతుంది. దీంతో సూర్యాపేట మున్సిపల్ అధికార పీఠంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది.**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత వరుసగా జరిగిన రెండు మున్సిపల్ ఎన్నికల్లో సూర్యాపేట మున్సిపాలిటిలో బిఆర్ఎస్ జెండా ఎగురవేసింది. మొత్తం 48 వార్డులు ఉండగా గత ఎన్నికల్లో బిఆర్ఎస్ 24 స్థానాల్లో విజయం సాధించగా, కాంగ్రెస్ 15, బిజెపి 5, ఇతరులు/ స్వతంత్ర అభ్యర్థులు 4 స్థానాల్లో విజయం సాధించారు. ముచ్చటగా మూడవ సారి గెలిచి హ్యాట్రిక్ సాధించాలని బిఆర్ఎస్ తహతహలాడుతుంది. గెలుపే లక్ష్యంగా మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అధికార పార్టీ అంచనాలకు అందకుండా ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ శరవేగంగా పావులు కదుపుతున్నాడు. గత మున్సిపల్ ఎన్నికల్లో ఆర్యవైశ్య కమ్యూనిటికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మొరిశెట్టి శ్రీనివాస్ సతీమణి సుధారాణిని చైర్మన్ చేస్తానని మాట ఇవ్వగా ఆమె 39వ వార్డు నుండి కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. మొత్తం బిఆర్ఎస్ కౌన్సిలర్లు 24 మంది గెలుపొందడంతో చైర్‌పర్సన్ పీఠం కూడా బిఆర్ఎస్‌కే దక్కగా కొన్ని రాజకీయ సమీకరణలతో ఆనాడు జగదీష్ రెడ్డి ఎవరి ఊహలకు అందని విధంగా 9 వార్డు నుండి కౌన్సిలర్ అభ్యర్థిగా గెలిచిన దళిత సామాజిక వర్గానికి చెందిన పెరుమాళ్ళ అన్నపూర్ణ శ్రీనివాస్‌ను చైర్‌పర్సన్‌గా నియామకమయ్యేలా పార్టీ అధిష్టానాన్ని ఒప్పించి, మెప్పించి ఆ స్థానంలో కూర్చోబెట్టారు. దీంతో బిఆర్ఎస్ పట్ల ఆర్యవైశ్యులలో ఆనాటి నుండి కొంత వ్యతిరేకత మొదలైంది. దీనిని పసిగట్టిన అధికార కాంగ్రెస్ పెద్దలు ఈ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు ఆర్థికంగా బలంగా ఉన్న ఆర్యవైశ్య కమ్యూనిటికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ మొరిశెట్టి లక్షాది సతీమణి నివేదితకు చైర్మన్ పీఠం ఆశచూపి ఎన్నికల బరిలోకి దింపారు. ఇదే అస్త్రంతో ముందుకు వెళ్ళి సూర్యాపేట మున్సిపాలిటిపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని వ్యూహరచన చేశారు. కానీ దీనిని ముందే పసిగట్టిన జగదీష్ రెడ్డి అదే కమ్యూనిటికి చెందిన దేశం కోసం ప్రాణాలర్పించిన కల్నల్ సంతోష్ బాబు తల్లి బిక్కుమళ్ళ మంజులకు మున్సిపల్ పీఠంపై కూర్చోబెట్టేందుకు 44వ వార్డు నుండి ఎన్నికల బరిలోకి దింపి కాంగ్రెస్‌కు అదిరిపోయే ట్విస్ట్ ఇచ్చారు. ఈ ప్రతిష్ఠాత్మక 44 వార్డు నుంచి బిజెపి ముఖ్య నేత సంకినేని వెంకటేశ్వరరావు బిజెపి అభ్యర్థిగా బూర రమాదేవి లక్ష్మణ్‌ను బిసి అభ్యర్థిగా బరిలోకి దించారు.



**అధికార పీఠంపై తీవ్ర ఉత్కంఠ**

మున్సిపల్ పీఠాన్ని ఒకే సామాజిక వర్గానికి చెందిన ఆర్యవైశ్యులకు ఇస్తామని అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్‌లు ఆశ చూపడంతో దేశం కోసం ప్రాణాలు అర్పించిన కల్నల్ సంతోష్ బాబు కుటుంబానికి, బడా కాంట్రాక్టర్ మొరిశెట్టి లక్షాది కుటుంబానికి మధ్య జరుగుతున్న ఎన్నికల పోరులా మారింది. ఇదే విషయమై రాజకీయ వర్గాలతో పాటు సామాన్య ప్రజల్లో పెద్ద ఎత్తున చర్చ సాగుతుంది. కల్నల్ సంతోష్ బాబు తల్లి బిక్కుమళ్ళ మంజుల ప్రజాసేవకై తాము ముందుకు వస్తున్నామని చెబుతుండగా, కాంట్రాక్టర్ మొరిశెట్టి లక్షాది సతీమణి నివేదిత సూర్యాపేట అభివృద్ధికై పాటుపడేందుకు ఎన్నికల్లో పోటీచేస్తున్నట్లు చెప్పుకొస్తున్నారు. సూర్యాపేట మున్సిపాలిటిలో అత్యధిక ఓటు బ్యాంక్ ఉన్న ఆర్యవైశ్యులు ఎటువైపు ఉంటారు మిగతా సామాజిక వర్గాల వారు ఎటువైపు ఉంటారన్నది అంతుచిక్కడంలేదు. ఈ ఇరువురిలో ప్రజాదరణ ఎవరికి దక్కనుందో కూడా తెలియని పరిస్థితి. దీంతో అధికార పీఠంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. బిఆర్ఎస్ వేసిన సెంటిమెంట్ అస్త్రం ఫలిస్తుందా... లేక కాంగ్రెస్ చెబుతున్న అభివృద్ధి అస్త్రం ఫలిస్తుందో ఓటర్ల ఎవరూ కరుణిస్తారో చూడాల్సిందే.

## పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి



### జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లాలో మున్సిపల్ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది విధిగా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ విసి హాల్‌లో జిల్లాలోని మున్సిపల్ కమీషనర్లు, ఆర్‌డిఓలు, తహశీల్దార్లతో మున్సిపల్ ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 7, 8, 9 తేదీలలో ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది ఫెసిలిటేషన్ సెంటర్లలో సంబంధిత మున్సిపాలిటికి చెందిన పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకోవాలని, అభ్యర్థులకు పోస్టల్ బ్యాలెట్ జారీ చేసిన తదుపరి సాధారణ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉండదని, కావున అభ్యర్థులు ఇట్టి విషయాన్ని గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, డిప్యూటి సిఈఓ శిరీష, డివిజనల్ పిఓ నారాయణరెడ్డి, ఎన్నికల నోడల్ అధికారులు, ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో పోలీసులకు తీవ్ర గాయాలు

### సిఎం బందోబస్త్‌కు వెళ్తున్న క్రమంలో ఘటన



**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** నేడు మిర్యాలగూడలో పర్యటించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభ నిర్వహణ కోసం బందోబస్తుకు వెళ్తున్న ఇద్దరు కానిస్టేబుల్‌లను గుంటూరు వైపుకు వెళ్తున్న ఓ కంటైనర్ లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు మదార్, సురేష్‌లు సీఎం బందోబస్తు కోసం వారి బైక్‌పై సభాస్థలి ప్రాంతానికి వెళ్తుండగా హైద్రాబాద్ నుంచి గుంటూరు వైపుకు వెళ్తున్న ఓ భారీ కంటైనర్ అతివేగంతో బైక్ వెనుక నుంచి ఢీకొట్టడంతో కానిస్టేబుల్స్ ఇద్దరు కిందపడడంతో తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. కానిస్టేబుల్ మదార్‌కు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్సనిమిత్తం హైద్రాబాద్‌కు తరలించగా స్వల్ప గాయాలతో బయటపడిన సురేష్‌ను స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేపడుతున్నట్లుగా పోలీసులు తెలిపారు.

## బిఆర్ఎస్ అభ్యర్థి కిడ్నాప్

### దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని
### మాజీ ఎమ్మెల్యే బొల్లం ఫిర్యాదు



**ప్రజాపక్షం/కోదాడ:** మున్సిపల్ ఎన్నికల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో గెలవలేక 11వ వార్డు టిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి ప్రసాద్‌ను కాంగ్రెస్ దుండగులు కిడ్నాప్ చేశారని తక్షణమే పోలీసులు వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ పేర్కొన్నారు. మంగళవారం కోదాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఈ అంశంపై ఎన్నికల ఇన్‌ఛార్జి బూడిద బిక్షమయ్యగౌడ్‌తో కలిసి పిర్యాదు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో నేరుగా గెలవలేక దొడ్డి దారిన కాంగ్రెస్ నాయకులు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. కిడ్నాప్‌కు గురైన తమ పార్టీ అభ్యర్థి దొడ్డిగొర్ల ప్రసాద్‌ను వెంటనే సురక్షితంగా విడిపించి తమకు అప్పగించాలని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అధికార అహంకారంతో దౌర్జన్యానికి పాల్పడితే సహించబోమని హెచ్చరించారు. కాగా 11 వార్డులో స్వచ్ఛగా ఎన్నికలు జరగాలని ఏకగ్రీవానికి తాము అంగీకరించమని బలవంతంగా ఏకగ్రీవం చేయటం తగదని ఆ వార్డు ప్రజలు ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరగాలే తప్ప తప్పుడు విధానాలను అవలంభించి ఏకగ్రీవం చేసుకోవడాన్ని తాము ఖండిస్తున్నామని వార్డు ప్రజలు తీవ్రస్థాయిలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## రాజ్యసభ నుంచి ప్రతిపక్షాలు వాకౌట్

**న్యూఢిల్లీ:** ఇండో–అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చకు డిమాండ్ చేస్తూ మంగళవారం రాజ్యసభ నుంచి అనేక ప్రతిపక్ష పార్టీల సభ్యులు వాకౌట్ చేశారు. ప్రభుత్వం తమ నిరాశను బయటపెడుతోందని ఆరోపించారు. జీరో అవర్ ముగిసిన వెంటనే కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేష్ ఇండో–అమెరికా వాణిజ్య ఒప్పందం అంశాన్ని లేవనెత్తారు। ఒప్పందం గురించి సమాచారం వాషింగ్టన్ నుండి అందుతోందని ఆరోపించారు. ప్రతిపక్ష సభ్యులు సభలో నిరసన ప్రారంభించడంతో సభా నాయకుడు జె పి నడ్డా ప్రభుత్వం ఈ విషయాన్ని చర్చించడానికి సిద్ధంగా ఉందని, పార్లమెంటులో ఇండో–అమెరికా వాణిజ్య ఒప్పందంపై ప్రకటన చేస్తుందని అన్నారు. భారతీయ వస్తువులపై సుంకాల తగ్గింపు గురించి అమెరికా అధ్యక్షుడు సోషల్ మీడియాలో పోస్ట్ ద్వారా తెలియజేశారని, ప్రధానమంత్రిని నిజమైన స్నేహితుడు అని కూడా ప్రస్తావించారని ఆయన అన్నారు. ప్రతిపక్షాల నిరాశ బయటకు వస్తోందని, వాణిజ్య ఒప్పందాన్ని ప్రస్తావిస్తూ ఆయన మంచి విషయాలలో కూడా చెడు చూడటం ప్రారంభించారని నడ్డా ఆరోపించారు. 'ఇండోఅమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చించడానికి, ఒప్పందం అన్ని సూక్ష్మ వివరాలను అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, సంబంధిత మంత్రి ప్రతిదీ వివరిస్తారని సభకు హామీ ఇవ్వాలనుకుంటున్నాను. వాణిజ్య ఒప్పందంపై ప్రభుత్వం స్వయంగా ఒక ప్రకటన విడుదల చేస్తుంది' అని నడ్డా అన్నారు. దేశ ప్రయోజనాలను అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ ప్రతిపక్ష సభ్యులు నినాదాలు కొనసాగించారు. ప్రభుత్వం ప్రకటన చేస్తున్నప్పుడు, వారు వినాలని చైర్మన్ సి పి రాధాకృష్ణన్ అన్నారు.



ప్రభుత్వం చర్చించడానికి సిద్ధంగా ఉందని, కానీ ప్రతిపక్ష సభ్యులు గందరగోళం సృష్టిస్తున్నారని ఆయన అన్నారు. ప్రతిపక్ష సభ్యులు ముందు వరుస వైపు కదులుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిలబడ్డారు. ప్రతిపక్ష సభ్యులు వాకౌట్ చేయగానే, ప్రతిపక్షాల ప్రవర్తన ఖండించదగినదని, ప్రతిదానిలోనూ రాజకీయాలు సృష్టించడమే వారి ఉద్దేశ్యం అని నడ్డా అన్నారు. టిఎంసి మినహా అన్ని ప్రతిపక్ష సభ్యులు నిరసనగా వాకౌట్ చేశారు. టిఎంసి సభ్యుడు సాకేత్ గోఖలే సభలో కూర్చుని వాకౌట్ చేసిన కొద్దిసేపటికే వెళ్లిపోయారు.ఢిల్లీ పోలీసులు ఎస్ఐఆర్ బాధిత కుటుంబాలను చూసుకున్న తీరుపై టిఎంసి ప్రత్యేక వాకౌట్ నిర్వహించిందని తెలిపింది.

# 'మమ్మల్ని ఉద్యోగులుగా గుర్తించండి'

### ఢిల్లీలో మహిళా 'గిగ్' వర్కర్ల 'నిరసన గళం'

**'జిపిఎస్ఐడబ్ల్యుయు' మహిళా విభాగం పిలుపు మేరకు జంతర్ మంతర్ వద్ద ప్రదర్శన**

**కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాలలోనూ నిరసన జ్వాల**

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో 'గిగ్' వర్కర్లు తమ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఆక్షేపిస్తూ నిరసన గళాన్ని వినిపించారు. దాదాపు 100మందికి పైగా గిగ్ కార్మికులు వారిలో అధికశాతం మహిళలు ఈ నిరసన కార్యక్రమంలో గొంతెత్తారు. తమను ఉద్యోగులుగా గుర్తించాలని వారు గట్టిగా డిమాండ్ చేశారు. ఖాతాలను ఏకపక్షంగా బ్లాక్‌చేయడం, తక్కువ ఆదాయాల సమస్యను పరిష్కరించి ఆదుకోవాలని, డిజిటల్ ప్లాట్‌ఫారాలలో కనీస కార్మిక రక్షణ కొరవడటాన్ని గిగ్ కార్మికులు తమ నిరసన ద్వారా ప్రతిధ్వనించారు. గిగ్,ప్లాట్‌ఫారమ్ సర్వీసెస్ వర్కర్స్ యూనియన్ (జిపిఎస్ఐడబ్ల్యుయు) మహిళా విభాగం నాయకత్వంలో ఈ ప్రదర్శన జరిగింది. కాగా ఇదే తరహా నిరసన ప్రదర్శనలు కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాలలో కూడా జరిగాయి.



మంగళవారం మధ్యాహ్న సమయంలో పంజాబీ బాగ్‌లోని గృహ సేవల ప్లాట్‌ఫారమ్‌తో పనిచేస్తున్న సునీత అనే గిగ్ వర్కర్ జంతర్‌మంతర్ వద్ద మాట్లాడుతూ తాను ఇప్పటికే ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొనడం ద్వారా దాదాపు రూ.900 రోజువారీ ఆదాయాన్ని కోల్పోయానని తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. సౌకర్యవంతమైన పనిగంటలు, స్థిరమైన ఆదాయాలు ఇస్తామని హామీ ఇచ్చిన తర్వాత తాను ఈ గిగ్ పనికి ఆకర్షితురాలిని అయ్యానని, కానీ ఇప్పుడు తన అకౌంట్ బ్లాక్ చేయబడుతుందనే భయంతో ఉన్నానని సునీత తెలియజేసింది. 'ప్రారంభంలో చాలా బుకింగ్స్ ఉండేవి. నీవు నీ కుటుంబాన్ని చక్కదిద్దుకోగలవు అని నమ్మబలికారు. కానీ, ఎ లాంటి వివరణ లేకుండానే ఇప్పుడు నా అకౌంట్‌ను బ్లాక్ చేశారు' అని ఆమె ఆరోపించారు. మరో నిరసనకారిణి మాట్లాడుతూ 2022 లో తన అకౌంట్‌ను సస్పెండ్ చేయడానికి ముందు దాదాపు నాలుగు సంవత్సరాలపాటు తాను అదే కంపెనీలో పనిచేశానన్నారు. కొన్ని నెలల తర్వాత తన భర్త మరణించడంతో స్థిరమైన ఉద్యోగం తనకు దొరకడం ఎంతో కష్టమైందన్నారు. నెలకు రూ.15,000జీతంతో కొంతకాలం వంట మనిషిగా పనిచేసిన తర్వాత తన యజమాని కుటుంబం ఢిల్లీకి వెళ్లిపోవడంతో ఆ ఉద్యోగాన్ని కూడా కోల్పోయాయని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, చాలామంది గిగ్ వర్కర్లు ప్లాట్‌ఫారమ్స్‌ల్లో తమను గుర్తుపడితే తొలగించివేస్తారేమోనన్న భయంతో ముఖాలను కనబడకుండా తాము ధరించిన వస్త్రాలు, మాస్కులతో కనబడకుండా కప్పి ఉంచి నిరసన ప్రదర్శనలో పాల్గొనడం గమనార్హం. సునీత మాట్లాడుతూ ఇటీవల తనకు రూ.2,295 విలువైన బుకింగ్ వచ్చిందని, అందులో నుంచి రూ.431 కమిషన్‌గా, రూ.970 'కంపల్సరీ క్రెడిట్ రీచార్జి'గా తగ్గించినది తీసుకోవాల్సివచ్చిందని వివరించారు. కార్మికులు ఖాతా సస్పెన్షన్లు, చెల్లింపు వివాదాలు లేదా భద్రతా సమస్యలను ఎదుర్కొన్నప్పుడు ప్లాట్‌ఫారమ్‌లు తమ బాధ్యత నుంచి తప్పించుకున్నాయని జిపిఎస్ఐడబ్ల్యుయు ప్రెసిడెంట్ సీమా సింగ్ ఆరోపించారు. లైంగిక వేధింపులు లేదా అర్ధరాత్రి భద్రతా ప్రమాదాల విషయంలో మహిళా కార్మికులకు పెద్దగా సహాయం లభించలేదని సింగ్ ఆరోపించారు. వారు అందించేది కేవలం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ)చాట్ బాట్ మాత్రమేనని, వేధింపులు, దూషణలు ఎదుర్కొంటున్న మహిళలకు అది ఏమాత్రం ఉపయోగపడదని సీమాసింగ్ చెప్పారు. తక్కువ జీతం, రక్షణలేని పరిస్థితులు, టైట్ వర్క్ డెడ్‌లైన్లపై ఢిల్లీలోని గిగ్ వర్కర్లు క్రిస్టమస్, నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా సమ్మె నిర్వహించిన కొన్ని వారాల తర్వాత ఈ నిరసన చోటుచేసుకుంది.

## బెంగాల్-జార్ఖండ్ బొగ్గు మాఫియా కేసుల్లో...'ఇడి' దాడులు

**ఢిల్లీ, కోల్‌కతా,అనన్సోల్, దుర్గాపూర్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోదా**

**అక్రమ ఇసుక, బొగ్గు వ్యాపారం కేసుల దర్యాప్తులో భాగంగా సోదాలు కొనసాగుతున్నట్లు అధికారులు వెల్లడి**

**కోల్‌కతా:** అక్రమ ఇసుక, బొగ్గు వ్యాపారం సంబంధిత కేసుల దర్యాప్తులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మరింత దూకుడు పెంచింది. జార్ఖండ్, పశ్చిమబెంగాల్ వ్యాప్తంగా పనిచేస్తున్న బొగ్గు మాఫియాకు వ్యతిరేకంగా కొనసాగుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దాడుల్లో భాగంగా మంగళవారం పశ్చిమబెంగాల్, ఢిల్లీలోని పలు ప్రాంతాలలో తాజాగా సోదాలు నిర్వహించింది. ఈ విషయాన్ని ఆ సంస్థ అధికారులు తెలిపారు. ఢిల్లీ, కోల్‌కతా, అసన్సోల్, దుర్గాపూర్, పశ్చిమ బర్ధమాన్ జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ బృందాలు కేంద్ర సాయుధ పోలీసులు బలగాలతో కలిసి ఉదయం 630గంటల నుండి సోదాలు నిర్వహించాయని వారు చెప్పారు. సోదాలు జరిగిన ప్రదేశాలలో అసన్సోల్‌లో బుడ్‌బుడ్ పోలీస్‌స్టేషన్‌కు కొత్తగా నియమితులైన ఆఫీసర్‌ఇన్‌చార్జి (ఒసి) మనోరంజన్ మండల్ నివాసం కూడా ఉంది. ఈసోదాలు అక్రమ ఇసుక, బొగ్గు వ్యాపారానికి సంబంధించిన దర్యాప్తులో భాగంగా కొనసాగుతున్నాయని ఒక సీనియర్ అధికారి తెలిపారు. బుడ్‌బుడ్ స్టేషన్‌లో ఇంకా అధికారికంగా బాధ్యతలు స్వీకరించని మండల్ అ వినీతి ఆరోపణల నేపథ్యంలో బరబానీ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నప్పుడు గత సంవత్సరం సస్పెన్షన్‌కు గురయ్యాడు.అనంతరం అసన్సోల్ పోలీస్ స్పెషల్ బ్రాంచ్‌కు అటాచ్ చేయబడ్డాడు.ఇటీవల ఆయన తిరిగి ఓసిగా పునర్నియమించబడిన విషయం ఇప్పుడు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ యాక్షన్ ద్వారా వెలుగుచూసింది. అంతేకాకుండా ఆ ప్రాంతంలోని పలువురు ఇసుక, బొగ్గు ట్రేడర్స్ నివాసాలు, కార్యాలయాలలో కూడా ఇడి సోదాలు జరిపింది. దుర్గాపూర్‌లోని సెప్కో ప్రాంతంలో కె.కె. మినరల్స్ యజమాని, ఇసుక వ్యాపారి ప్రబీర్ దత్తాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులు నిర్వహించింది. అదే సమయంలో ఇడి అధికారులు ఏకకాలంలో ఆయన సోదరుడు అమిత్ దత్తా నివాసంపై కూడా దాడులు నిర్వహించాయి. ఇడి బర్ధమాన్ జిల్లాలోని బంకుర, పశ్చిమ్, పుర్బా జిల్లాల్లో ఇసుక గనులను నిర్వహిస్తున్నదని, పనాగఢ్‌లో కార్యాలయాలు ఉన్నాయని అధికారులు చెప్పారు.పనాగఢ్‌లోని షేక్ హసీమ్ మీర్జా బేగ్, అందుల్స్ లోని భక్తర్‌నగర్ ఏరియాలో , పాండవేశ్వర్‌లో బొగ్గు వ్యాపారి షేక్ మైజుల్ ఇళ్లల్లో కూడా సోదాలు జరిగాయి. కోల్‌కతా, ఢిల్లీతోపాటు అనే ప్రదేశాలలో దాడులు జరుగుతున్నాయని వర్గాలు తెలిపాయి. ఈ కేసులో తొలి రౌండర్ సోదాలు గత ఏడాది నవంబరులో నిర్వహించగా రూ.14కోట్లకు పైగా నగదు, బంగారాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫర్స్‌మెంట్ డైరెక్టరేట్ తెలిపింది. జార్ఖండ్‌పశ్చిమబెంగాల్ సరిహద్దులో అతిపెద్ద అక్రమ బొగ్గు సరఫరా నెట్ వర్క్ పనిచేస్తున్నాయని పోలీసుల ఎఫ్ఐఆర్‌లు సూచించాయి. సోదాల సమయంలో స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లు, ఇతర రికార్డులు ఎఫ్ఐఆర్‌లలో మోపబడిన ఆరోపణలను ధృవీకరిస్తున్నాయి. స్థానిక అధికారుల సహాయంతో నిర్వహింపబడుతున్న వ్యవస్థీకృత రాకెట్ ఆపరేటింగ్‌ను గుర్తించడానికి కూడా దారితీసిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఒక ప్రకటనలో తెలియజేసింది. పశ్చిమబెంగాల్, జార్ఖండ్ సరిహద్దు ప్రాంతాలలో ఈ సిండికేట్ చాలా సమర్థవంతంగా పనిచేస్తున్నదని భారీ నేరాల ద్వారా ఆదాయాన్ని సృష్టించుకుంటోందని ఇడి ఆరోపించింది. ఈ ఫెడరల్ దర్యాప్తు సంస్థ దర్యాప్తు చేస్తున్న మరొక కుంభకోణం కేసు నుండి ఇది భిన్నంగా ఉంటుంది. దీనిలో గతనెలలో కోల్‌కతాలోని పొలిటికల్ కన్సల్టెన్సీ సంస్థ ఐపాక్ ప్రాంగణంపై దాడి చేసింది.

### శబరిమల బంగారం చోరీ కేసులో...

## 'మురారిబాబును ప్రశ్నించిన ఇడి'

**కొచ్చి :** దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన కేరళలోని శబరిమల గోల్డ్ 'నష్టం'తో సంబంధమున్న కేసులో ట్రావెన్‌కోర్ దేవస్వోం బోర్డ్ (టిడిబి) మాజీ పరిపాలనా అధికారి మురారిబాబును మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ప్రశ్నించింది. అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ దర్యాప్తు సంస్థ ప్రివెన్షన్ ఆఫ్ మనీ ల్యాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్ఎ) చట్టం కింద మురారి బాబు స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసిందని వారు వెల్లడించారు. కేరళ స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) ఆ అధికారిని అరెస్ట్ చేయగా, ఇటీవల ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. కాగా ఈ దర్యాప్తులో భాగంగా 'ఇడి' మరొక మాజీటిడిబి పరిపాలనా అధికారి ఎస్.శ్రీకుమార్ స్టేట్‌మెంట్‌ను కూడా రికార్డు చేసింది. ఈ కేసులో గత నెలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలను ప్రారంభించింది. ఈ సోదాల సందర్భంగా చెన్నైలోని 'స్మార్ట్ క్రియేషన్స్' అనే సంస్థ ప్రాంగణంలో ప్రధాన నిందితుడు ఉన్నికృష్ణన్ పొట్టికి చెందిన రూ.1.3కోట్ల విలువైన 8 స్థిరాస్తులను స్తంభింపజేశామని, 100గ్రాముల బంగారు కడ్డీని స్వాధీనం చేసుకున్నట్లు ఇడి జనవరి 21న జారీ చేసిన ఒక ప్రకటనలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తెలిపింది. రెండు ఎఫ్ఐఆర్‌లను పరిగణనలోనికి తీసుకుని కేరళ పోలీసులు జనవరి 9న పిఎంఎల్ఎ కేసు దాఖలు చేసింది. రాజకీయంగా సున్నితమైన ఈ కేసును ఇప్పటికే కేరళ రాష్ట్ర హైకోర్టు పర్యవేక్షణలో 'రాష్ట్ర సిట్' దర్యాప్తు చేస్తోంది. ఈ దర్యాప్తు అయ్యప్ప ఆలయంలోని వివిధ కళాఖండాల నుండి బంగారాన్ని దుర్వినియోగం చేయడానికి అధికారిక దుష్ప్రవర్తన, పరిపాలనా లోపాలు, నేరపూరిత కుట్ర సహా వరుస అవకతవకలకు సంబంధించినది. ద్వారకపాలక విగ్రహభాగాలు, పీఠం (పీఠాలు), గర్భగుడి తలుపు ఫ్రేమ్ ప్యానెల్‌లతో సహా ఆలయంలోని పవిత్రమైన బంగారుపూతతో కూడిన కళాఖండాలను అధికారిక రికార్డులలో ఉద్దేశపూర్వకంగా 'రాగిపలకలు'గా తప్పుగా చూపించి 2019–2025 మధ్యకాలంలో ఆలయ ప్రాంగణం నుంచి అనధికారికంగా తొలగించారని దర్యాప్తులో తేలిందని ఇడి ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కళాఖండాలను తర్వాత చెన్నై, కర్ణాటకలోని 'స్మార్ట్ క్రియేషన్స్', 'రొద్దం జ్యూవెలర్స్'లకు ప్రైవేట్ సదుపాయాల కోసం రవాణా చేసి మరమ్మతు, రీప్లాంటింగ్ పని ముసులో రసాయనిక ప్రక్రియల ద్వారా బంగారాన్ని వెలికితీస్తున్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తన దర్యాప్తులో కనుగొంది.సేకరించిన బంగారం, సంబంధిత ఆస్తులు, నేరం ద్వారా వచ్చిన ఆదాయాన్ని నిందితులు తమ వద్ద ఉంచుకోవడం, బదిలీచేయడం, దాచడం వంటి పనులకు పాల్పడ్డారని 'ఇడి' తెలియజేసింది.

### బ్యాంకు చార్జీల బాదుడు...

## 21 వేల కోట్లు వసూలు!

**న్యూఢిల్లీ:** బ్యాంక్ ఖాతాల రుసుముల రూపంలో గత కొన్నేళ్లలో ప్రజల నుంచి వేల కోట్ల రూపాయలు వసూలయినట్లు కేంద్ర ప్రభుత్వం లోక్‌సభకు వెల్లడించింది. దేశ వ్యాప్తంగా ఉన్న 11 ప్రభుత్వ రంగ బ్యాంకులు కనీస నిల్వలు లేని ఖాతాలపై గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో రూ.8,092 కోట్లకు పైగా చార్జీలు వసూలు చేశాయని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. ఈ వసూళ్లు సంవత్సరానికోసారి గణనీయంగా పెరుగుతున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2022–23 లో కనీస నిల్వ లేని ఖాతాల నుంచి రూ.2,407.82 కోట్లు, 2023–24 లో రూ.2,909.10 కోట్లు, 2024–25లో రూ.2,775.91 కోట్లు వసూలు చేశాయి. అంటే ఖాతాలో డబ్బు లేకపోయినందుకే మూడేళ్లలో వేల కోట్ల రూపాయలు బ్యాంకుల ఖాతాల్లో చేరినట్లే. అలాగే ఖాతాదారుల మొబైల్ ఫోన్‌లకు సందేశాలు పంపినందుకు బ్యాంకులు రుసుముల పేరుతో భారీగా వసూలు చేశాయి. ఈ మొత్తం 2022–23లో రూ.1,193.19 కోట్లు, 202324లో రూ.976.98 కోట్లు, 2024–25లో రూ.1,217.60 కోట్లుగా ఉంది. మొత్తంగా ఎస్ఎంఎస్ సౌకర్యం ఒక్కటే ప్రజలపై వేల కోట్ల భారం వేసింది. బ్యాంకులకే కాదు, ప్రభుత్వ విధానాల్లో ఆలస్యం చేసిన వారిపైనా భారీ వసూళ్లు జరిగాయి.

## అజిత్ పవార్ అంత్యక్రియల్లో రెచ్చిపోయిన దొంగలు అరెస్ట్



**పుణె :** జనవరి 28న విమాన ప్రమాదంలో మహారాష్ట్ర డిప్యూటీ సిఎం అజిత్ పవార్ సహా ఐదుగురు మరణించిన విషయం తెలిసిందే. అయితే, జనవరి 29న బారామతిలో విద్యా ప్రతిష్ఠాన్ మైదానంలో ఆయన అంత్యక్రియలు జరగ్గా కొందరు రెచ్చిపోయారు. ఈ కార్యక్రమంలో కొంతమంది దొంగలు తమ చేతివాటం చూపించారు. అంత్యక్రియలకు హాజరైన వారిలో దాదాపు 15మంది వ్యక్తులకు చెందిన రూ.30లక్షల విలువ చేసే బంగారు వస్తువులను కొట్టేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా ఈ కేసులో ఏడుగురిని అరెస్ట్ చేశారు. నిందితులను రాజ్‌కుమార్ బాబురావు అథవాలే, మహ్మద్ అనీస్, ఎజాజ్ భగు మిరావాలే, మహ్మద్ సాదిక్, బాలు అలియాస్ దత్తాత్రయ బాబాన్ ధోత్రే, తుషార్ కైలాస్ మసాల్, నితిన్ అంకుష్ గైక్వాడ్‌లుగా గుర్తించారు. పలువురి బంగారు గొలుసులు, నగదు చోరీకి గురైనట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. సాంకేతిక, రహస్య సమాచారం ఆధారంగా దర్యాప్తు ప్రారంభించి, నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా ఎస్‌పి సందీప్ గిల్, ఎఎస్‌పి గణేష్ బిరాదార్, సబ్‌డివిజనల్ పోలీసు అధికారి సుదర్శన్ రాథోడ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్ జరిగింది. నిందితుల నుంచి దొంగిలించబడిన వస్తువులను బాధితులకు అప్పగించేందుకు సమగ్ర విచారణ జరుగుతోందని పోలీసులు తెలిపారు.

### రాజ్యాంగాన్ని పాటించలేకపోతే

## భారత్ విడిచి వెళ్లిపోండి

**వాట్సాప్, మెటాకు సుప్రీంకోర్టు వార్నింగ్**

**న్యూఢిల్లీ :** భారత రాజ్యాంగాన్ని పాటించలేకపోతే, దేశం విడిచి వెళ్లిపోవాలని ప్రఖ్యాత సోషల్ మీడియా కంపెనీలు వాట్సాప్, మెటాలకు సుప్రీంకోర్టు హితవు పలికింది. భారత ప్రజల గోప్యతా (ప్రైవసీ) హక్కును కాపాడే విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ తాము రాజీపడేది లేదని దేశ సర్వోన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. దేశంలోని కోట్లాది పేద, నిరక్షరాస్య ప్రజలకు మీ ప్రైవసీ పాలసీలు అర్థమవుతాయా అని వాట్సాప్, మెటాలను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలీలతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. పేద మహిళ, రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే నిరుపేద వ్యక్తి, ఎవరైనా తమిళం మాత్రమే మాట్లాడే వ్యక్తి లాంటి వాళ్లకు మీ ప్రైవసీ పాలసీలు అర్థమవుతాయా అని సోషల్ మీడియా కంపెనీలను సుప్రీంకోర్టు బెంచ్ నిలదీసింది. కొన్నిసార్లయితే తమలాంటి వ్యక్తులే ఆ పాలసీలను అర్థం చేసుకోలేక సతమతం అవుతుంటారని ధర్మాసనం పేర్కొంది. 2024 నవంబరు 18న వాట్సాప్ నిర్వాహక కంపెనీ మెటాపై రూ.213.14 కోట్ల జరిమానాను కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) విధించింది. వాట్సాప్ యూజర్ల సమాచారాన్ని అడ్వర్టయిజ్‌మెంట్ కంపెనీలకు షేర్ చేసే ప్రక్రియపైనా ఐదేళ్ల నిషేధాన్ని విధించింది. "వాడితే వాడండి, లేదంటే వదిలేయండి" అన్నట్లుగా వాట్సాప్ ప్రైవసీ పాలసీ ఉందని సీసీఐ వ్యాఖ్యానించింది. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో వాట్సాప్, మెటా అప్పీల్ పిటిషన్లు దాఖలు చేశాయి. మంగళవారం వీటిపై విచారణ నిర్వహించే క్రమంలో సుప్రీంకోర్టు ధర్మాసనం తాజా వ్యాఖ్యలు చేసింది. భారత ప్రభుత్వ సంస్థ సిసిఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, వాట్సాప్, మెటా కంపెనీల తరఫు న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, అఖిల్ సిబల్ వాదనలు వినిపించారు. నిలిపివేయండి (ఆప్ట్ ఔట్) అనే ప్రస్తావన తమ ప్రైవసీ పాలసీలో ఉందని, అలాంటప్పుడు యూజర్ల సమాచారాన్ని తాము వాణిజ్య ప్రకటనల సంస్థలకు బదిలీ చేయడంపై అభ్యంతరం ఎందుకని వాట్సాప్ తరఫు న్యాయవాదులు వాదించారు.



ఆప్ట్ ఔట్ లాంటి ఆప్షన్ల గురించి తమలాంటి వాళ్లకే సరిగ్గా తెలియదని, ఎక్కడో బిహార్‌లోని మారుమూల పల్లెల్లో ఉండే భారతీయులకు ఎలా తెలుస్తుందని సుప్రీంకోర్టు బెంచ్ ప్రశ్నించింది. ప్రైవసీ పాలసీ మాటున భారతీయ వాట్సాప్ యూజర్ల వ్యక్తిగత సమాచారాన్ని చోరీ చేస్తున్నారని మండిపడింది. ఇలా జరగకుండా అడ్డుకుంటామని ధర్మాసనం తేల్చి చెప్పింది.

**మెటా డేటా భద్రతపై సూచనలివ్వండి.. కేంద్రానికి ఆదేశం**

తుషార్ మెహతా వాదనతో సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ ఏకీభవిస్తూ రాజ్యాంగాన్ని పాటించలేకపోతే, దేశం విడిచి వెళ్లిపోవాలని వాట్సాప్, మెటాలను హెచ్చరించారు. ఈ లిటిగేషన్‌లో భారత ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖను కూడా ఒక పక్షంగా చేరుస్తున్నట్లు వెల్లడించారు. సోషల్ మీడియా యూజర్ల మెటా డేటా భద్రతపై తగిన సూచనలను తమకు సమర్పించాలని ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖను సీజేఐ ఆదేశించారు.

## యుపి ప్రభుత్వ ఉద్యోగులకు సర్కార్ షాక్!

**68 వేల మందికి జీతాలు నిలిపివేత**

**లక్నో:** ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ఆ రాష్ట్ర ఉద్యోగుల జీతాలకు బ్రేక్ వేసింది. ప్రభుత్వ ఉద్యోగులందరికీ 'ఆస్తుల వివరాలు చెప్పకపోతే జీతం లేదు' అనే కఠిన నిర్ణయం అమలులోకి వచ్చింది. ఈ ఒక్క ఆదేశంతో 68,000 మందికి పైగా ఉద్యోగుల జనవరి నెల జీతాలను నిలిపివేసింది. ప్రభుత్వ సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచాలన్న లక్ష్యంతో తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఉత్తర ప్రదేశ్‌లో వివిధ శాఖల్లో కలిపి ఎనిమిది లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, ఉద్యోగులందరూ 2025 డిసెంబరు 31 వరకు సంపాదించిన తమ ఆస్తుల పూర్తి వివరాలను 'మానవ సంపద' పోర్టల్‌లో 2026 జనవరి 31లో గా తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఈ విషయంపై ముఖ్య కార్యదర్శి గతంలోనే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ వేలాది మంది ఉద్యోగులు చివరి తేదీ వరకు ఆస్తుల వివరాలు సమర్పించకపోవడం అధికారులను ఆశ్చర్యానికి గురి చేసింది. ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ 'ఈ నిబంధనలపై ముందుగానే సమాచారం ఇచ్చాం. అనేక సార్లు రిమైండర్‌లు పంపాం. అయినా 68 వేల మందికి పైగా ఉద్యోగులు గడువులోగా ఆస్తి వివరాలు అప్‌లోడ్ చేయలేదు. అందుకే ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం వారి జనవరి జీతాలను నిలిపివేశాం' అని వివరించారు. కాగా శాఖల అధిపతులకూ ప్రభుత్వం కఠిన ఆదేశాలు జారీ చేసింది. తమ కింద పనిచేసే ఉద్యోగులు నిబంధనలు తప్పనిసరిగా పాటించేలా చూడాలని సూచించింది. గడువు దాటితే అది ప్రతికూల అంశంగా పరిగణించబడుతుందని హెచ్చరించింది. మరింత కఠినంగా, 2025 ఫిబ్రవరి 1 తర్వాత జరిగే పదోన్నతులను కూడా పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేసింది. అయితే జీతాలు నిలిపివేయబడిన ఉద్యోగులకు ఇంకా ఒక అవకాశం ఉంది. ఇప్పటికీ తమ ఆస్తి వివరాలను 'మానవ సంపద' పోర్టల్‌లో అప్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

## భారత్-అమెరికా వాణిజ్య ఒప్పంద ప్రకటన

### సంక్షిప్త చరిత్ర

**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ తన మొదటి పదవీకాలం (2017–2021) లో కూడా భారతదేశం – అమెరికా ఒక చిన్న వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరిపాయి. కానీ అది కార్యరూపం దాల్చలేదు.2018 జూలై, 2019 సెప్టెంబర్ మధ్య జరిగిన పలు దఫాల చర్చలలో ప్రతిపాదిత ఒప్పందంపై చర్చించారు. కానీ వ్యవసాయం, డిజిటల్ పన్నులు, సుంకాల వంటి అంశాలపై విభేదాల కారణంగా ఎటువంటి ఒప్పందం ఖరారు కాలేదు. ఆ తర్వాత, బైడెన్ పరిపాలన (జనవరి 2021 నుండి జనవరి 2025 వరకు) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరపడానికి ఆసక్తి చూపలేదు.

తాజాగా సోమవారం రాత్రి భారత్ అమెరికా ఒప్పందంపై ట్రంప్ ప్రకటన నేపథ్యంలో ఎప్పుడెప్పుడు ఏమి జరిగిందో తెలుసుకుందాం..

**2025 ఫిబ్రవరి 13:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికాభారతదేశ వాణిజ్య సంబంధాన్ని మరింతగా పెంచుకోవడానికి అంగీకరించారని ఒక ఉమ్మడి ప్రకటన పేర్కొంది. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని ప్రస్తుత 191 బిలియన్ల నుండి 500 బిలియన్‌ల డాలర్లకు రెట్టింపు చేయాలనే కొత్త లక్ష్యాన్ని ఇరువురు నాయకులు నిర్దేశించారు. పరస్పర ప్రయోజనకరమైన, బహుళ రంగాల ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బిటిఎ) మొదటి విడతపై 2025 శరదృతువు (సెప్టెంబర్ – డిసెంబర్)నాటికి చర్చలు జరపాలని వారు ప్రణాళికలు ప్రకటించారు.

**మార్చి 4–6:** వాణిజ్య,పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్ వాషింగ్టన్ డిసిని సందర్శించారు. అమెరికా వాణిజ్య ప్రతినిధి జామిసన్ గ్రీర్, వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లుట్నిక్‌తో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు.

**ఏప్రిల్ 2:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతీయ వస్తువులపై 26 శాతం (10 శాతం బేస్‌లైన్ సుంకం, 16 శాతం ప్రతి సుంకం) అదనపు దిగుమతి సుంకాన్ని ప్రకటించారు.



**ఏప్రిల్ 9 :**అమెరికా– భారత వస్తువులపై 26 శాతం పరస్పర సుంకాన్ని 90 రోజుల పాటు (2025 జూలై 9 వరకు) నిలిపివేసింది.

**ఏప్రిల్ 23— 29 :** నాటి భారత ప్రధాన సంధానకర్త రాజేశ్ అగర్వాల్ (ప్రస్తుతం వాణిజ్య కార్యదర్శి) ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం కోసం అమెరికా సహచరులతో మొదటి వ్యక్తిగత సమావేశం కోసం వాషింగ్టన్‌ను సందర్శించారు. సుంకాలు, నాన్ టారిఫ్ అడ్డంకులు,కస్టమ్స్ సులభతరంతో సహా 19 అధ్యాయాలపై నిబంధనలను వారు చర్చించారు.

**మే 17–20:** వాణిజ్యం, పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్ వాషింగ్టన్‌ను సందర్శించి అమెరికా వాణిజ్య ప్రతినిధి గ్రీర్, అమెరికా వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లుట్నిక్‌లను కలిశారు.

**జూన్ 4–10:** అమెరికా అదనపు వాణిజ్య ప్రతినిధి బ్రెండన్ లించ్ నేతృత్వంలోని అమెరికా ప్రతినిధి బృందం వారం రోజుల చర్చల కోసం భారతదేశాన్ని సందర్శించింది. చర్చలు మార్కెట్ యాక్సెస్, డిజిటల్ వాణిజ్యం, కస్టమ్స్ సులభతరం, శానిటరీ మరియు ఫైటోసానిటరీ చర్యలు, వాణిజ్యానికి సాంకేతిక అడ్డంకులు, చట్టపరమైన చట్రాన్ని కవర్ చేసాయి.

**జూన్ 26:** జూలై 9 గడువుకు ముందు విభేదాలను పరిష్కరించుకోవడానికి, అగర్వాల్ నేతృత్వంలోని భారత ప్రతినిధి బృందం తదుపరి చర్చల కోసం మరోసారి వాషింగ్టన్‌ను సందర్శించింది.

**జూన్ 27:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారతదేశంతో అమెరికా ఒక 'అత్యంత పెద్ద' వాణిజ్య ఒప్పందాన్ని చేసుకోబోతోందని అన్నారు.

**జూలై 31:** 2025 ఆగస్టు 7 (భారత కాలమానం ప్రకారం ఉదయం 9.30 గంటలకు ) నుండి అమలులోకి వచ్చే 25 శాతం సుంకాన్ని అమెరికా ప్రకటించింది.

**ఆగస్టు 6 :** రష్యా చమురును న్యూఢిల్లీ నిరంతరం కొనుగోలు చేస్తున్నందుకు జరిమానాగా, ట్రంప్ భారతదేశం నుండి వచ్చే వస్తువులపై అదనంగా 25 శాతం సుంకాన్ని విధించారు. ఈ ఉత్తర్వు తర్వాత, కొన్ని మినహాయింపుల జాబితాలోని వస్తువులు మినహా, భారతీయ వస్తువులపై మొత్తం సుంకం 50 శాతానికి పెరిగింది. ఇది 2025 ఆగస్టు 27 నుండి అమలులోకి వస్తుందని ప్రకటన.

**సెప్టెంబర్ 16:** యునైటెడ్ స్టేట్స్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ కార్యాలయ అధికారులు భారతదేశంలో వాణిజ్య ఒప్పందంలోని వివిధ అంశాలపై చర్చలు జరిపారు. ఈ విషయంలో ప్రయత్నాలను ముమ్మరం చేయాలని నిర్ణయించారు.

సెప్టెంబర్ 22: వాణిజ్య చర్చల కోసం గోయల్ న్యూయార్క్‌కు వెళ్ళారు. ఆయనతో పాటు అగర్వాల్ కూడా ఉన్నారు.

**అక్టోబర్ 15–17:** చర్చల కోసం భారత బృందం వాషింగ్టన్‌లో ఉంది. ఆరు అధికారిక రౌండ్ల చర్చలు జరిగాయి.

**డిసెంబర్ 10:** డిప్యూటీ యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ రిక్ స్విట్జర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం, భారతీయ వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్‌తో రెండు రోజుల వాణిజ్య చర్చల కోసం జాతీయ రాజధానికి వచ్చింది.

2026 జనవరి 12: భారతదేశంలో అమెరికా రాయబారి సెర్గియో గోర్, వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి ఇరుపక్షాలు క్రియాశీలకంగా నిమగ్నమై ఉన్నాయని నొక్కి చెప్పారు.

**జనవరి 31:** 'ఫాదర్ ఆఫ్ ఆల్ అగ్రిమెంట్స్' అయిన ఈ ఒప్పందం పురోగతి గురించి అడిగినప్పుడు, మంచి చర్చలు జరుగుతున్నందున భారతదేశం దీనిని అమెరికాతో 'త్వరగా' ముగించడానికి కృషి చేస్తోందని గోయల్ అన్నారు.

**2026 ఫిబ్రవరి 2:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో టెలిఫోన్ సంభాషణ తర్వాత సోమవారం నాడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ, భారతదేశం –అమెరికా ఒక వాణిజ్య ఒప్పందంపై అంగీకరించాయని, దీని ప్రకారం వాషింగ్టన్ భారతీయ వస్తువులపై పరస్పర సుంకాన్ని ప్రస్తుత 25 శాతం నుండి 18 శాతానికి తగ్గిస్తుందని తెలిపారు.

# ఒత్తిళ్ల ఒప్పందాలు!

సుమారు వారం రోజుల వ్యవధిలో మన దేశం రెండు కీలక అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలు చేసుకుంది. ఒకటి పాశ్చాత్య ఖండంలోని శక్తివంతమైన ఆర్థిక సమాఖ్య యూరోపియన్ యూనియన్ (ఇయు)కాగా, మరొకటి ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక శక్తి అమెరికా. అధికారిక ప్రకటనల్లో ఈ ఒప్పందాలను చరిత్రాత్మక విజయాలుగా, భారీ మార్కెట్ ప్రవేశ అవకాశాలుగా, ఎగుమతులకు సువర్ణావకాశాలుగా అభివర్ణిస్తున్నారు. కానీ ఈ ప్రకటనల వెనుక ఉన్న వాస్తవాలు, మౌనంగా దాచి ఉంచిన నిబంధనలు, ప్రజాస్వామ్య ప్రక్రియను పక్కన పెట్టిన విధానం అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. దేశ భవిష్యత్తుపై ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఒప్పందాలు నిజంగా సమాన భాగస్వామ్యాలా? లేక ఆర్థిక ఒత్తిళ్లకు లోబడి తీసుకున్న రాజకీయ నిర్ణయాలా? దేశ ఆర్థిక వ్యవస్థకు ఇవి బలమా లేక దీర్ఘకాలిక బలహీనతల విత్తనాలా? అన్న ప్రశ్నలు ప్రతిధ్వనిస్తున్నాయి. వివిధ ప్రతిపక్ష పార్టీలు, పలువురు నేతల అభిప్రాయాలు, అభ్యంతరాలను గమనిస్తే, ఈ రెండు ఒప్పందాలపై అనుమానాలు పెరుగుతాయి. ఒప్పందాల విషయంలో పార్లమెంటును పక్కన పెట్టడం ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడమే. ఏ అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందమైనా కేవలం ఆర్థిక పత్రం కాదు. అది రైతు జీవితం, కార్మిక భవితవ్యం, వినియోగదారుల భద్రత, చిన్న పరిశ్రమల ఉనికిని నేరుగా ప్రభావితం చేసే రాజకీయ – సామాజిక నిర్ణయం. అలాంటి ఒప్పందాల విషయంలో పార్లమెంటుకు పూర్తి వివరాలు తెలియజేయడం, విస్తృత చర్చ జరపడం ప్రజాస్వామ్యానికి మూలం. కానీ ఇక్కడ పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. ఒప్పందాల వివరాలు దేశ శాసనసభ ముందు ఉంచకముందే, విదేశీ ప్రకటనలు, సోషల్ మీడియా సందేశాలు, అర్ధాంతర వ్యాఖ్యల ద్వారానే ప్రజలకు సమాచారం అందుతున్నది. దీనిని కేవలం విధానపరమైన లోపంగా చూడకూడదు. ముమ్మాటికీ ఇది ప్రజాస్వామ్య ఆచరణకు ఏర్పడిన అతిపెద్ద ప్రమాదం. దేశ ప్రజలకు, ముఖ్యంగా రైతులకు, చిన్న వ్యాపారులకు, కార్మికులకు ఈ ఒప్పందాల వల్ల ఎలాంటి లాభం కలుగుతుందనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం లేదు. ఈ ఒప్పందాలపై మొదటగా తలెత్తే సందేహం వ్యవసాయ రంగం గురించే. భారత దేశంలో వ్యవసాయం కేవలం ఒక ఆర్థిక రంగం కాదు.. కోట్లాది కుటుంబాల జీవనాధారం, సామాజిక స్థిరత్వానికి మూలం. విదేశీ వ్యవసాయ ఉత్పత్తులు దేశీయ మార్కెట్లోకి తక్కువ సుంకాలతో ప్రవేశిస్తే, దేశంలో రైతుల పరిస్థితి ఏమిటనేది ప్రశ్న. రైతు సమస్యలు దశాబ్దకాలంగా నిర్లక్ష్యానికి గురవుతునే ఉన్నాయి. అదే పంథా ఇంకా కొనసాగుతునే ఉంది. ప్రకృతి మీద ఆధారపడి, అప్పుల మధ్య, మద్దతు ధరల అనిశ్చితిలో మన రైతు బతుకీడుస్తున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో విదేశీ వ్యవసాయ దిగుమతులకు ద్వారాలు తెరవడం అంటే, దేశీయ రైతును మార్కెట్ నుంచి నెమ్మదిగా బయటకు నెట్టివేయడమే. ఇలాంటి ఆర్థిక విధానాలు సామాజిక విపత్తులకు ఆహ్వానం పలుకుతాయి. అధికారిక ప్రకటనలను అనుసరించి, అమెరికా నుంచి భారీ మొత్తంలో వస్తువులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ఎగుమతులతో పోలిస్తే, దిగుమతుల విలువ కొన్ని రెట్లు అధికంగా ఉంటాయి. అభివృద్ధి చెందిన దేశంతో, అసమానతలు నిండి ఉన్న దేశాన్ని పరుగులు తీయించడంలో అర్థం ఏమిటో కేంద్రానికే తెలియాలి.

భారత ఆర్థిక వ్యవస్థలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు వెన్నెముకలాంటివి. ఇవే ఎక్కువ ఉపాధిని కల్పిస్తున్నాయి. కానీ వాణిజ్య ఒప్పందాల ద్వారా విదేశీ ఉత్పత్తులు తక్కువ ధరలకు మార్కెట్లోకి వస్తే, ఈ పరిశ్రమలు పోటీలో నిలబడలేవు. తక్కువ ఉత్పత్తి వ్యయం, భారీ సాంకేతిక ఆధిక్యం కలిగిన విదేశీ సంస్థలతో పోటీ పడటం చిన్న వ్యాపారుల కు అసాధ్యం. ఫలితంగా మూసివేతలు, ఉద్యోగ నష్టాలు, ఆర్థిక అస్థిరత... దేశంలో ఔషధ రంగం ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందింది. తక్కువ ధరలో మందులు అందించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తోంది. కానీ వాణిజ్య ఒప్పందాల్లో మేధోసంపత్తి హక్కులపై కఠిన నిబంధనలు ఉంటే, జనరిక్ మందుల తయారీకి అడ్డంకులు ఏర్పడతాయి. ఇది ప్రజారోగ్యంపై నేరుగా ప్రభావం చూపుతుంది. పాడి పరిశ్రమకు సైతం ఇలాంటి సమస్యలు తప్పవు. దేశ ప్రయోజనాలను గుర్తించకుండా, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించకుండా చేసుకునే ఒప్పందాల వల్ల ఎవరికి ప్రయోజనం? పైగా, ఆర్థిక ఒప్పందాలు కేవలం వాణిజ్య పరిమితుల్లోనే ఉండవు. అవి విదేశాంగ విధానాన్ని కూడా ప్రభావితం చేస్తాయి.

ఒక దేశంతో ఆర్థికంగా అధికంగా అనుసంధానం కావడమం టే, ఇతర వ్యూహాత్మక భాగస్వామ్యాలను అభద్రతకు గురిచేయడమే. ఇంధన, విద్యుత్ వనరుల కొనుగోళ్లలో మార్పులు, సంప్రదాయ భాగస్వాములతో దూరం పెరగడం, కొత్త రాజకీయ ఒత్తిళ్లు వంటి సమస్యలు వెన్నంటే ఉంటాయి. ఇవి దేశ విదేశాంగ స్వేచ్ఛను కుదించే ప్రమాదం ఉంది. బహుళ ధ్రువ ప్రపంచంలో స్వతంత్ర నిర్ణయాలు పనికిరావన్నది నిజం. అన్నిటినీ మించిన అత్యంత ప్రమాదకరమైన అంశం పారదర్శకత లోపం. ప్రజలకు, పార్లమెంటుకు పూర్తి సమాచారం ఇవ్వకుండా తీసుకునే నిర్ణయాలు ప్రజాస్వామ్యానికి ముప్పు. ఈ రోజు వాణిజ్య ఒప్పందాలైతే.. రేపు రక్షణ, శక్తి, డేటా విధానాలా? అన్న అనుమానం సహజం. ఒకవైపు ప్రపంచ మేటి ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఎదగుతున్నామనే ప్రకటనలు... మరోవైపు ఇయు, అమెరికాతో చాటుమాటు ఒప్పందాలు.. రెంటికీ మధ్య చెప్పలేని అగాథం. అభివృద్ధి అంటే కేవలం పెద్ద మార్కెట్లకు ప్రవేశం కాదు. అది సమాన అవకాశాలు, దేశీయ రంగాల రక్షణ, సామాజిక న్యాయం. రైతు ఆత్మహత్యలు పెంచి.. చిన్న పరిశ్రమలను మూతపెట్టి.. యువతను నిరుద్యోగులుగా మార్చే విధానాలను అభివృద్ధి అనలేం. ఒప్పందాలు తప్పుకాదు.. అవసరం. కానీ, అవి జరిగిన తీరు.. వాటిలోని అంశాలు కీలకం. పరస్పర సహకారాన్ని, వ్యాపారవాణిజ్య సంబంధాలను ఎవరూ కాదనరు. కానీ, వాటివల్ల ఎవరు లాభపడుతున్నారన్నది కీలకం. సమానత్వంపై, పారదర్శకతపై, జాతీయ ప్రయోజనాలపై ఆధారపడి న ఒప్పందాలను స్వాగతించాలి. మద్దతునివ్వాలి. అయితే, ఒప్పందాలపై చర్చ జరగాలి. ప్రభావాలను నిజాయితీగా అంచనా వేయాలి. లేకపోతే, ఈ రోజు చరిత్రాత్మక విజయంగా పేర్కొంటున్న ఒప్పందాలు, రేపు చరిత్రలో అతిపెద్ద తప్పిదాలుగా మారే ప్రమాదం లేకపోలేదు.



## మా పార్టీ నిర్ణయాలను మేమే తీసుకుంటాం

ఎన్‌సిపి జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడి హోదాలో అజిత్ పవార్ తర్వాత మార్పు ప్రక్రియను నేను బాధ్యతాయుతంగా పర్యవేక్షిస్తున్నాను. ఎవరు, ఎప్పుడు, ఎలా, ఏ పదవిలో ఉంటారనే బాధ్యత నాపై ఉంది. దానిని నెరవేరుస్తున్నాను. మా పార్టీ విషయాలను నిర్ణయించడానికి వేరేవారికి ఏమి అధికారం ఉంది? మా పార్టీకి సంబంధించిన నిర్ణయాలను మేమే తీసుకుంటాం. ఆ ప్రక్రియలోనే ఉన్నాం. విలీనం విషయానికొస్తే, ముందుగా మేము పార్టీలోని అన్ని అంతర్గత విషయాలను పరిష్కరించి, ఆ తర్వాతే ఇతర విషయాల గురించి ఆలోచిస్తాం. ఆ అంశం నేడు మా ముందు లేదు. ప్రస్తుతం మా ముందున్న అంశాలలో ఎన్‌సిపి శాసనసభాపక్షానికి ఎవరు నాయకత్వం వహిస్తారనేది ఇప్పటికే నిర్ణయమైపోయింది. పార్టీకి ఎవరు నాయకత్వం వహిస్తారనే ప్రక్రియ కొనసాగుతోంది.

– ఎఎన్‌ఐతో ఎన్‌సిపి వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రఫుల్ పటేల్




## కేన్సర్ పట్ల కనీస అవగాహన కలిగి ఉందాం!

ఖచ్చితమైన చికిత్స అందుబాటులో లేని కారణంగా కేన్సర్ వ్యాధితో పెద్ద సంఖ్యలో రోగులు మరణించడం ఒక ప్రపంచ ప్రజారోగ్య సమస్యగా మారింది. శరీరంలోని ఏ భాగానికి చెందిన కణజాలమైనా నియంత్రణ లేకుండా అపరిమితంగా పెరగడంతో ట్యూమర్స్ ఏర్పడడంతో పాటు ఇతర శరీర కణజాలాలు కూడా విధ్వంసం చేయబడడాన్ని కేన్సర్ అని అర్థం చేసుకోవాలి. నాన్‌కమ్యూనికబుల్ వ్యాధుల్లో గుండె జబ్బుల(63.3 శాతం) తర్వాత 2వ అత్యధిక మరణాలకు కారణం అవుతున్న క్యాన్సర్ (18.1 శాతం) ఒక ప్రపంచ స్థాయి సమస్యగా గుర్తించబడింది. ఊపిరితిత్తులు, రొమ్ము, గర్భాశయ, ప్రొస్టేట్, చర్మం, జీర్ణనాళ కేన్సర్లు అతి ముఖ్యమైనవి. మహిళల్లో రొమ్ము, గర్భాశయ కేన్సర్లు అధికంగా కనిపిస్తే, పురుషుల్లో నోటి, ఊపిరితిత్తుల కేన్సర్లు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. ఊపిరితిత్తుల కేన్సర్ మహిళలు, పురుషుల్లో కూడా ఎక్కువగానే కనిపిస్తుంది. పిల్లల్లో (బాలలు, బాలికలు) లింఫోయిడ్ ల్యుకేమియా(రక్త) కేన్సర్ అధికంగా కనిపిస్తున్నది. ఈ వ్యాధి పట్ల సంపూర్ణ అవగాహన కల్పించడానికి, నివారణ మార్గాలు, చికిత్స మార్గాలు, రోగ లక్షణాలు లాంటి అంశాలను చర్చించే వేదికగా ప్రతి ఏట 04 ఫిబ్రవరి రోజున ప్రపంచ కేన్సర్ దినం నిర్వహించుట 2000 సంవత్సరం నుంచి ప్రారంభమైంది.

**కేన్సర్ కారణాలు, రోగ లక్షణాలు, చికిత్స మార్గాలు:**

కేన్సర్ వ్యాధి రావడానికి ముఖ్య కారణాలుగా జన్యు మార్పులు, అనువంశిక మార్గాలు, పొగ తాగడం, అధిక ఆల్కహాల్ సేవనం, స్థూలకాయం, పర్యావరణ కాలుష్యం, ప్రమాదకర రసాయనాలతో పని చేయడం, రేడియోషన్‌కు గురి కావడం, ప్రాసెస్డ్ ఫుడ్, శారీరక వ్యాయామం కొరవడడం, నిశ్చల జీవనశైలి, ఆలస్యంగా గుర్తించడం, అవగాహన లోపం, పేదరికం, సూర్యకిరణాల్లో అతినీలలోహిత కిరణాలకు గురికావడం లాంటివి పేర్కొనబడినవి. కేన్సర్ వ్యాధి రోగ లక్షణాల్లో గడ్డలు లేదా ట్యూమర్స్ ఏర్పడడం, బరువు తగ్గడం, రక్తస్రావం కలగడం, అలసట, చర్మ మార్పులు, దగ్గు, మలబద్ధకం, మింగడంలో అసౌకర్యం, గురక, అజీర్ణం, జ్వరం, రక్తహీనత, సంతానోత్పత్తి సమస్యలు, చమట పట్టడం, దురలవాట్లు, కుటుంబ చరిత్ర, నిరక్షరాస్యత లాంటివి వస్తాయి. కేన్సర్ నిర్ధారణలో రక్త పరీక్షలు, ఇమేజింగ్ పరీక్షలు, ఎండోస్కోపీ లాంటివి వినియోగించబడుతున్నాయి. కేన్సర్ చికిత్సలో సర్జరీ, కీమోథెరపీ, రేడియోథెరపీ, ఇమ్యునోథెరపీ, టార్గెటెడ్ థెరపీ, హార్మోన్ థెరపీ, స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంట్ లాంటి విధానాలు అందుబాటులో ఉన్నాయి.

**తీసుకోవలసిన జాగ్రత్తలు :** పోషకాహారం తీసుకోవడం, తరుచుగా పరీక్షలు చేయించుకోవడం, శరీర బరువు నియంత్రణలో ఉంచుకోవడం, ఆల్కహాల్‌కు దూరంగా ఉండడం, పొగాకు ఉత్పత్తులకు చరమగీతం పాడడం, శారీరక వ్యాయామం, టీకాలు తీసుకోవడం, ఇన్‌ఫెక్షన్ కాకుండా చూసుకోవడం, చురుకైన దినచర్య పాటించడం, సూర్యుడి అతినీలలోహిత కిరణాలు సోకకుండా జాగ్రత్త పడడం లాంటివి తప్పనిసరిగా పాటించాలి. కేన్సర్ రోగులకు చికిత్సలు చేస్తున్న ఆంకాలజీ వైద్యులు, రేడియాలజిస్టులు, సర్జన్లు, ప్యాథాలజిస్టులు, ఆంకాలజీ నర్సుల సేవలకు కృతజ్ఞతలు తెలిపే సందర్భంగా కూడా ప్రపంచ కేన్సర్ దినం వేదికలు ఉపయోగపడాలి. నిరక్షరాస్యత, పేదరికం, పోషకాహారలోపం లాంటి కారణాలతో మన దేశంలో కేన్సర్ అతిగా ప్రబలుతున్నందున ప్రతి ఒక్కరు దీనిపట్ల అవగాహన కలిగి ఉండడం, అవగాహన కల్పించడం నిరంతరం జరగాలి. కేన్సర్ రోగులులేని భారతాన్ని నిర్మించే కృషి చేయాలి.

(నేడు 'ప్రపంచ క్యాన్సర్ డే' సందర్భంగా)

# కేంద్రం ఆర్థిక ఆధిపత్యాన్ని పెంచిన 16వ ఆర్థిక సంఘం

ఆర్.సూర్యకుమార్

పదహారవ ఆర్థిక సంఘం సమాంతర పంపిణీ (హారిజాంటల్ డివల్యూషన్) ఫలితాలను ఒక సాంకేతిక పునర్వ్యవస్థీకరణగానే విస్తృతంగా భావిస్తున్నారు. ఇది జాతీయ ఉత్పత్తికి రాష్ట్రాలు అందించే సహకారాన్ని స్పష్టంగా గుర్తిస్తూ ఆర్థిక పనితీరుకు ప్రతిఫలాన్ని ఇచ్చేదిగా కనిపిస్తోంది. కానీ ఈ గణాంకాల వెనుక ఒక ముఖ్యమైన రాజకీయఆర్థిక మార్పు దాగి ఉంది. భారతదేశ సమాఖ్య ఆర్థిక ఒప్పందం, సమానత్వం నుండి మారి షరతులతో కూడిన ప్రోత్సాహకాల దిశకు మళ్లుతోంది. అదే సమయంలో, పంపిణీ చేయదగిన నిధుల పరిధి (డివిజబుల్ పూల్)కు వెలుపల ఉండే సాధనాల ద్వారా కేంద్రం పన్ను వనరులపై తన నియంత్రణను కొనసాగిస్తూనే ఉంది.

కొత్త ఫార్ములా ప్రకారం అత్యధిక ప్రయోజనం పొందిన ఏకైక రాష్ట్రంగా కర్ణాటక నిలవడం ఈ వైరుధ్యాన్ని అసాధారణ స్పష్టతతో వెల్లడిస్తుంది. పదిహేనవ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం పంపిణీ చేయదగిన నిధుల వాటాలో 3.65 శాతంగా ఉన్న కర్ణాటక వాటా, 2026–31 పంపిణీ కాలానికి 4.13 శాతానికి పెరుగుతుంది. దీంతో ఆ రాష్ట్రానికి అదనంగా రూ.7,387 కోట్ల లబ్ధి చేకూరుతుంది. మొత్తం కలుపుకొని సుమారు రూ.63,050 కోట్ల నిధులు బదిలీ అవుతాయి. ప్రధానంగా 'స్థూల జాతీయోత్పత్తికి సహకారం' అనే అంశానికి 10 శాతం వెయిటేజీని ఇచ్చినందున ఈ లబ్ధి చేకూరింది. గతంలో ఈ ప్రాతిపదిక స్పష్టమై న రూపంలో లేదు. ఇది అధిక సంఘటిత రంగం, అధిక సేవా రంగ ప్రాధాన్యత, జాతీయ, ప్రపంచ విలువ గొలుసులలో లోతైన అనుసంధానం ఉన్న రాష్ట్రాలకు విపరీతంగా ప్రయోజనం చేకూరుస్తుంది.


అయితే, ఈ పైపై లాభం భారత ఆర్థిక సమాఖ్య వ్యవస్థకు సంబంధించిన మరింత కీలకమైన కొలమానాన్ని మరుగున పరుస్తోంది. రాష్ట్రా లు కేంద్ర ఖజానాకు అందించే ప్రతి రూపాయికి తిరిగి పొందే వాటా ఎంత? భారతదేశ జిడిపిలో కర్ణాటక వాటా సుమారు 8.5 – 9 శాతం, అలాగే ఆదాయ పన్ను, కార్పొరేట్ పన్ను,సేవలపై జిఎస్‌టిల ద్వారా వచ్చే నికర ప్రత్యక్ష పన్నుల వసూళ్లలో 12 నుండి 14 శాతం వరకు ఉంది. అయినప్పటికీ, పన్నుల పంపిణీ తర్వాత కేంద్ర పన్నులలో దాని వాటా కేవలం 4 శాతానికి కొద్దిగా ఎక్కువగా ఉంది. 16వ ఆర్థిక సంఘం సర్దుబాటు తర్వాత కూడా, అనేక అంచనాల ప్రకారం కర్ణాటక కేంద్రానికి అందించే ప్రతి రూ.1కి 50 పైసలు నుంచి 55 పైసల మధ్య మాత్రమే తిరిగి పొందుతోంది. పదిహేనవ ఆర్థిక సంఘం కాలంలోని 50 పైసల కంటే తక్కువ స్థాయి నుండి ఇది స్వల్పంగా మాత్రమే మెరుగుపడింది.

ఈ అసమతుల్యత కేవలం కర్ణాటకకే పరిమితం కాదు. జిడిపిలో దాదాపు 8, కేంద్ర పన్ను ఆదాయంలో సుమారు 10 శాతం వాటా అందించే గుజరాత్ కొత్త ఫార్ములా ప్రకారం అదనంగా రూ.4,228 కోట్లు పొందనుంది. హర్యానా రూ.4,090 కోట్లు పొందుతుంది. అయినప్పటికీ, ఈ రెండు రాష్ట్రాలు నిర్మాణపరంగా నికర సహకారులుగా (నెట్ కాంట్రిబ్యూటర్స్) మిగిలిపోయాయి. కేరళ వాటా 1.93 శాతం నుండి 2.38 శాతానికి పెరిగి, రూ.6,975 కోట్లు అదనంగా లభించింది. అధిక తలసరి ఆదాయం, మెరుగైన జనాభా సూచికల కలయిక కారణంగా ఆ రాష్ట్రం లబ్ధి పొందింది. కానీ, ఇక్కడ కూడా కేంద్ర పంపిణీ ద్వారా దక్కే నిధుల కంటే రాష్ట్రం స్వంత పన్ను కృషి, వినియోగ ఆధారిత జిఎస్‌టి వాటా చాలా ఎక్కువగా ఉన్నాయి.

దీనికి విరుద్ధంగా మధ్యప్రదేశ్ ఈ ఫార్ములా పునఃపంపిణీ తర్కానికి మరో కోణాన్ని చూపిస్తుంది. సుమారు రూ.1.12 లక్షల కోట్ల కేటాయింపును పొందినప్పటికీ, పంపిణీ చేసే నిధులలో(డివిజబుల్ పూల్‌లో) దాని వాటా 7.85 శాతం నుండి 7.35 శాతానికి పడిపోయింది. పాత ఫార్ములాతో పోలిస్తే దానికి దక్కినదానిలో రూ.7,677కోట్లు తగ్గింది. ఈ తగ్గింపు సామర్థ్యం సంబంధిత కొలమానాలు, కొత్త జిడిపి సహకార ప్రాతిపదికన తక్కువ స్కోర్లను ప్రతిబింబిస్తుంది. ఇది ఆదాయ అంతరం, జనాభా ఆధారిత సమానత్వానికి అధిక ప్రాధాన్యతనిచ్చిన మునుపటి ఆర్థిక సంఘాల విధానం నుండి వైదొలిగినట్లు స్పష్టమైన మార్పును సూచిస్తుంది.

విడిగా చూసినప్పుడు, ఇలాంటి పునర్వ్యవస్థీకరణను 'నైతిక ప్రమాదం' (మోరల్ హజార్డ్), దీర్ఘకాలిక ఆధారపడటంపై ఒక దిద్దుబాటు చర్యగా సమర్థించవచ్చు. అయితే మొత్తంగా చూస్తే, రాష్ట్రాల మధ్య ఆదాయ అసమానతలు ఇంకా ఎక్కువగా ఉన్న దేశంలో, ఆర్థిక సమానత్వం భవిష్యత్తుపై ఇది అసౌకర్యమైన ప్రశ్నలను లేవనెత్తుతుంది. మొదటి ఐదు రాష్ట్రాల తలసరి స్థూల రాష్ట్ర ఉత్పత్తి (జిఎస్‌డిపి)దిగువ ఐదు రాష్ట్రాల కంటే ఇప్పుడు 3.5 రెట్లు ఎక్కువగా ఉంది. గత దశాబ్దకాలంలో వరుస పంపిణీలు జరిగినప్పటికీ ఈ వ్యత్యాసం నిష్పత్తి ఏమాత్రం తగ్గలేదు.

అసలైన లోపం సమాంతర పంపిణీ సూత్రం (హారిజాంటల్ ఫార్ములా)లో లేదు. అది నిలువు పంపిణీ సూత్రం(వెర్టికల్ ఫార్ములా), కుంచించుకుపోతున్న పంపిణీ చేసే నిధుల (డివిజబుల్ పూల్) తగ్గిపోతున్న పరిణామంలో ఉంది. **2026--31 కాలానికి రాష్ట్రాల వాటాను నికర ఆదాయంలో 41శాతంగా కొనసాగించాలని కేంద్రం తీసుకున్న నిర్ణయం కాగితంపై స్థిరంగా కనిపిస్తున్నప్పటికీ, వాస్తవానికి పంచుకోదగిన మొత్తం పన్ను ఆదాయంలో క్రమంగా తగ్గుదలను ఇది కప్పిపుచ్చుతోంది. గత పదేళ్లలో సెస్‌లు, సర్‌ఛార్జ్‌ల ద్వారా సేకరించిన మొత్తం పన్ను ఆదాయం 9-10 శాతం నుండి 18–20 శాతానికి పైగా పెరిగింది. వీటిలో ఏదీ కూడా రాష్ట్రాలకు పంపిణీ చేయబడడం లేదు. ఫలితంగా, పంపిణీ చేసే నిధులు 41 శాతంగా స్థిరంగా ఉన్నప్పటికీ, ఆ నిధుల పునాది తగ్గిపోయింది. ఇది కేంద్రం మొత్తం పన్ను రాబడిపై రాష్ట్రాల వాస్తవ హక్కును తగ్గిస్తోంది.**




ఈ నిర్మాణాత్మక మార్పు చాలా ముఖ్యం. ఎందుకంటే, రాజకీయంగా ముఖ్యమైన, ఆర్థికంగా డిమాండ్ ఉన్న రంగాలలో వ్యయ బాధ్యతలను నేడు రాష్ట్రాలే ఎక్కువగా తమ భుజాలపై మోస్తున్నాయి. ఆరోగ్యంపై మొత్తం ప్రభుత్వవ్యయంలో దాదాపు 60 శాతం, విద్యపై 55 శాతానికి పైగా, పట్టణ మౌలిక సదుపాయాలు, రవాణా, విద్యుత్ పంపిణీల మూలధన వ్యయంలో అత్యధిక భాగం రాష్ట్రాలే భరిస్తున్నాయి. కానీ వాటి స్వంత పన్ను ఆదాయాలు జిఎస్‌డిపిలో సగటున 7–8 శాతం మాత్రమే ఉన్నాయి. దీనికి భిన్నంగా కేంద్రం అధిక ఆదాయ వృద్ధిని, రుణాలను తీసుకునే వెసులుబాటును కలిగి ఉంది.

ఈ అసమానతను పదహారవ ఆర్థిక సంఘం ద్రవ్య క్రమశిక్షణ చట్రం మరింత కఠినతరం చేస్తుంది. రాష్ట్రాల ద్రవ్య లోటును జిఎస్‌డిపిలో 3 శాతానికి లోబడి ఉండాలని, బడ్జెట్ వెలుపల అప్పులను కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్‌కు మరింత బహిర్గతం చేయాలని ఆదేశించడం ద్వారా స్పష్టంగా నిరుత్సాహపరుస్తోంది.

ఉపజాతీయ(రాష్ట్రాల) స్వయంప్రతిపత్తిని నియంత్రించే పాలనను 16వ ఆర్థిక కమిషన్ బలోపేతం చేస్తోంది. మూలధన పెట్టుబడి కోసం రాష్ట్రాలకు ఇచ్చే వడ్డీలేని ఆన్‌లెండింగ్ ప్రత్యే క సహాయ పథకాల లోటు పరిమితి పరిధికి వెలుపల ఉన్నప్పటికీ, ఇవి కేంద్రం అభీష్టానుసారం, షరతులతో కూడి ఉంటాయి. ఇది నియమబద్ధ బదిలీలకు బదులుగా, చర్చలపై ఆధారపడటాన్ని ప్రోత్సహిస్తుంది.

ఇటీవలి కాలంలో లోటును పూడ్చుకోవడానికి రాష్ట్రాలు ఎక్కువగా మార్కెట్ రుణాలపై ఆధారపడుతున్నాయని కమిషన్ స్వయంగా అంగీకరించింది. ప్రస్తుతం రాష్ట్రాల మొత్తం అప్పులు జిఎస్‌డిపిలో 28–30 శాతం వరకు ఉన్నాయి. కానీ ఆర్థిక ఒడిదుడుకుల సమయంలో రాష్ట్రాలకు అవసరమైన వెసులుబాటును కమిషన్ పెద్దగా కల్పించలేదు. ఆచరణలో దీని అర్థం ఏమిటంటే, కేంద్రానికి ఎక్కువ ఆదాయాన్ని ఇచ్చే ఆర్థికంగా బలమైన రాష్ట్రాలే, స్థానిక ఆర్థిక సంక్షోభాలకు లేదా అభివృద్ధి ప్రాధాన్యతలకు ప్రతిస్పందించడానికి తమ స్వంత ఆర్థిక వనరులను వినియోగించుకోవడంలో కూడా అత్యంత పరిమితులను ఎదుర్కొంటున్నాయి.

మొత్తంగా చూస్తే, ఈ గణాంకాలు భారత సమాఖ్య వ్యవస్థలో ఒక లోతైన పునర్వ్యవస్థీకరణను సూచిస్తున్నాయి. 16వ ఆర్థిక సంఘం సమతుల్యతను పునరుద్ధరించకుండానే సహకారాన్ని ప్రోత్సహిస్తోంది. స్వయంప్రతిపత్తిని విస్తరించకుండానే సామర్థ్యాన్ని ప్రోత్సహిస్తోంది. పన్నుల వ్యవస్థపై పెరుగుతున్న కేంద్రం ఆధిపత్యాన్ని పరిష్కరించకుండానే ఆర్థిక క్రమశిక్షణను కఠినతరం చేస్తోంది. పంపిణీ చేయని లెవీల ద్వారా కేంద్రం ఆదాయాలలో పెరుగుతున్న భాగాన్ని తన నియంత్రణలో ఉంచుకుంటున్నప్పటికీ, సహకారం అందించే రాష్ట్రాలకు పరిమితులలో కూడిన పంపిణీ నిధి (డివిజబుల్ పూల్) నుంచి స్వల్పంగా అధిక వాటాలను అందిస్తున్నారు.

ఆ కోణంలో, కర్ణాటక అతిపెద్ద 'లబ్ధిదారు'గా ఎదగడం అనేది వ్యవస్థ దాతృత్వాన్ని కాకుండా, దాని పరిమితులను వెల్లడిస్తోంది. జాతీయ ఉత్పత్తిలో దాదాపు పదో వంతు సహకారం అందిస్తూ, పన్నుల రూపంలో అంతకంటే ఎక్కువ అందిస్తున్న ఒక రాష్ట్రం, ఐదేళ్ల కాలంలో అదనంగా కొన్ని వేల కోట్ల రూపాయలను తిరిగి పొందడం గొప్పగా చెప్పుకుంటున్నాము. అంటే, దీని ద్వారా సమాఖ్య సమానత్వం ప్రమాణాలు ఎంత తక్కువగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

భవిష్యత్తు ఆర్థిక సంఘాలు ఆదాయాన్ని ఎవరు వసూలు చేస్తున్నారు, వ్యయ బాధ్యతలను ఎవరు మోస్తున్నారు అనే అంశాల మధ్య ఉన్న లోతైన అసమతుల్యతను పరిష్కరించకపోతే, సెస్‌ల పెరుగుదలను అరికట్టడం, పంపిణీ నిధి(డివిజబుల్ పూల్)ని విస్తరించడం లేదా ఉమ్మడి పన్నుల నిర్మాణాన్ని పునరాలోచించడం చేయకపోతే, భారతదేశం ఒక వింతైన సమాఖ్య నమూనాలో చిక్కుకుపోయే ప్రమాదం ఉంది. అందులో రాష్ట్రాలు పనితీరు ద్వారా నిర్ణయాలు చేయబడతాయి, నిబంధనల ద్వారా నియంత్రించబడతాయి, స్వల్పంగా మాత్రమే ప్రోత్సాహం పొందుతాయి. అదే సమయంలో కేంద్రం స్థిరంగా ఆర్థిక శక్తిని కూడగట్టుకుంటుంది. అటువంటి పరిస్థితుల్లో, ఏ రాష్ట్రం ఎక్కువ లాభం పొందింది అనేది ప్రశ్న కాదు, ఎక్కువ చెల్లించి, తక్కువ తిరిగి పొందే వ్యవస్థలో 'సహకార సమాఖ్య స్ఫూర్తి' అనే రాజ్యాంగ వాగ్దానం నిలబడుతుందా లేదా అనేదే అసలు ప్రశ్న.

(ఐపిఎ సర్వీస్)

# ఉరితాళ్ళవుతున్న... చదువులు



యాసాని కరుణాకర్ రెడ్డి
రాష్ట్ర స్థానిక కార్యదర్శి
తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్ (STUTS)
986610320

రైతు తన వ్యవసాయ పొలంలో కుటుంబంతో సహా ఆరుకాలం పండించిన పంటను నష్టధరకు మార్కెట్లో అమ్మినప్పుడు లేక ప్రకృతి వైపరీత్యాల వలన వ్యవసాయంలో నష్టం వచ్చినప్పుడు కొంతమంది రైతులు తమ మనోధైర్యాన్ని కోల్పోవడం వలన ఆత్మహత్యలకు పాల్పడుతున్న సందర్భాలు అక్కడక్కడ చూస్తుంటాము. కానీ నెమలిలా ఆడుతూ పాడుతూ, లేగ దూడలా ఎగిరే వయసులో వారికి బరు వు, బాధ్యతలు ఏమీలేకున్నా కేవలం చదువు, ఆటలు మాత్రమే తెలిసిన వయసులో ఆ పసి మొగ్గలు ఉరితాళ్ళకు వేలాడుతున్న సందర్భాలు ఈ దేశంలో మాత్ర మే, ప్రత్యేకంగా ఈ రెండు తెలుగు రాష్ట్రాలలోనే ఎక్కువగా ఎందు కు జరుగుతున్నవి అనే ప్రశ్న ప్రతి మనిషి మెదడును తొలుస్తున్నది. కానీ ఆ ఆత్మహత్యలకు కారణం అన్వేషించ, విశ్లేషించే పనిని ఎవరూ చేయడం లేదు. విద్యార్థులకు ఉచిత విద్యను అందించవలసిన ప్రభుత్వాలు ఉచిత విద్యపై అనాసక్తి, అనాలోచిత నిర్ణయాల వలన విద్య కాస్త వికృత రూపం దాల్చి అది ప్రైవేటీకరణ, కార్పోరేటికరణ, ప్రపంచీకరణ, గ్లోబలైజేషన్‌ల చేతుల్లోకి చేరి చదువు చివరకు ఒక వ్యాపార వస్తువుగా మారడం వలన, ఆ చదువు వనరులు, వసతులు, నిధు లు, నియామకాలు లేక నిర్వీర్యమవుతున్న ప్రభుత్వ విద్యాసంస్థలలో దొరక్క పోవడం వల్ల బీద, బిక్క, పేద, మధ్యతరగతి, ధనికులు అందరూ ఎవరి స్థాయిని బట్టి ఆయా ప్రైవేట్ విద్యా సంస్థలలో విద్యను కొంటున్నారు. ఆ కొనే చదువులో కూడా విద్యాసంస్థల విపరీతమైన వ్యాపా ర పోకడల వల్ల అది తల్లిదండ్రులకు గుదిబండగా మారి, విద్యార్థుల మధ్య పోటీతత్వాన్ని పెంచి చదువు లేనిదే జీవితం వ్యర్థం అనే విధంగా భవిష్యత్తును భయంకరంగా విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు చూపెడుతున్నారు. చదువులో ఆ గమ్యాన్ని చేరుకోలేని విద్యార్థులు ఇటు విద్యాసంస్థల ఒత్తిడి, అటు తల్లిదండ్రులు కూడా లక్షల రూపాయలు వారిపై ఖర్చుపెట్టి పిల్లల విద్యాస్థాయిని కూడా చూడకుండా ఒత్తిడి చేయడం వల్ల ప్రతి సంవత్సరం వందల కొద్ది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ ఆత్మహత్యలు కూడా కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు విశ్వవిద్యాలయా లు వచ్చిన తరువాతనే జరుగుతున్నాయి అనేది అక్షర సత్యం. ప్రపంచంలోని అనేక ధనిక దేశాలు ఉచిత విద్య, వైద్యాన్ని అందిస్తున్న సందర్భంలో భారతదేశం లో 99 శాతం పేదవారు, 1 శాతం ధనికులు ఉన్న ఈ దేశంలో 99 శాతం ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే పేద విద్యార్థుల యొక్క విద్యా సంస్థలను మూసివేస్తూ ఒక శాతం ధనికులు చదివే ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల వైపు మొగ్గుచూపడం బాధాకరం, అందుకే అన్ని వర్గాలవారి పిల్లలకు ఒకే విధమైన ఉచితమైన సమానమైన 'కామన్ స్కూల్ విద్యా విధానాన్ని' ప్రవేశపెట్టాలి. అప్పుడే విద్యార్థుల మధ్య స్నేహపూర్వక పోటీ ఏర్పడి ఒత్తిడి తగ్గుతుంది. అదేవిధంగా ప్రభుత్వాలు ఉద్యోగ నియామకాల కోసం ప్రభుత్వరంగ సంస్థలు, వ్యాపార సంస్థలు ఏర్పాటు చేసి వారి భవిష్యత్తుకు భరోసా ఇవ్వవలసిన బాధ్యత ప్రభుత్వా లపై ఉంది. సమాజంలో ఉమ్మడి కుటుంబాల ఊసే లేదు, బంధువులు తెలియరు, వరుసలు తెలియ వు కేవలం చదువే ధ్యేయమంటూ తల్లిదండ్రులు పిల్లలను శాసించడం వందకు వంద మార్కులు వచ్చినా కూడా తల్లిదండ్రులలో ఏదో వెలితి, ఏ డిగ్రీ చదివి న్యూటన్ గమన నియమాలను కనుగొన్నాడు, ఏ విద్య నేర్చి అరిస్టాటిల్ భూమ్యాకర్షణ సిద్ధాంతం రూపొందించాడు, ఏ కార్పొరేట్ కళాశాలలో చదివి ఐన్ స్టీన్ వెలిగే బల్బును కనుగొన్నాడు. ఇటువంటి శాస్త్రజ్ఞుల చరిత్రలు, స్వాతంత్ర్యం కోసం ఉద్యమించిన చరిత్రకారుల పుస్తకాలు, మహనీయుల పుస్తకాలను విద్యార్థులచే చదివించాలి.

# శ్రీలంక కోలుకోవడం సాధ్యమేనా?

హిందూ మహాసముద్రం, బంగాళాఖాతం సముద్రాల సరిహద్దులతో ఏర్పడిన ద్వీప దేశంగా భారత దేశ తీరానికి 50 కిమీ దూరంలో ఉన్న శ్రీలంక 04 ఫిబ్రవరిన స్వాతం త్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి భారీ ఏర్పాట్లలో మునిగి ఉన్నది. ప్రస్తుతం 23.5 మిలియన్ల శ్రీలంక జనాభాలో 75 శాతం సింహలీస్, 11 శాతం శ్రీలంక తమిళులు, 9 శాతం వరకు ముస్లిమ్ మూర్‌లు 4 శాతం భారత తమిళుల జనాభా ఉన్నది. అత్యధిక సింహలీలు బుద్ధిస్టులుగా, తమిళులు హిందువులుగా రెండు గ్రూపుల మధ్య విభేదాలతో రెండున్నర దశాబ్దాల పాటు ఎల్‌టిటిఇ, అధిక జనాభా ఉన్న సింహలీస్ (ప్రభుత్వ సహకారంతో) మధ్య వర్గ పోరు (1976–2002)కూడా జరగడం, అనేక హింసాత్మక ఘటనలు చేటు చేసుకోవడం, చివరికి ఎల్‌టిటిఈ పోరాటాలను అడ్డుకోవడం, అంతం చేయడంచూసాం. శ్రీలంక ప్రభుత్వాలు, ఆర్థిక సంక్షోభాల నడుమ కొనసాగుతున్న శ్రీలంక ప్రయాణంలో ఆహార, ఇంధన, ఔషధాల కొరతలు కూడా తోడుకావడంతో పలు ప్రజా ఉద్యమాగ్నులు ఎగిసి పడడం చూసాం.




**చరిత్ర పుటల్లో శ్రీలంక .. సిలోన్:** 16వ శతాబ్దం లో శ్రీలంక తీరప్రాంతాలు పోర్చుగీస్ అధీనంలో, 17వ శతాబ్దంలో డచ్‌ల అధీనంలో పాలన కొనసాగింది. 1796 నుంచి ఈ ద్వీప ప్రాంతం బ్రిటీష్ అధీనంలోకి క్రమంగా మారడం, 1833లో పూర్తిగా బ్రిటీష్ పాలన పగ్గాలు పట్టి ఈ ద్వీపానికి 'సిలోన్'గా నామకరణం చేసి వలస పాలన కొనసాగించడం, వలస పాలన 1948 వరకు కొనసాగడం చూసాం. సిలోన్ ప్రాంతం 1972లో శ్రీలంక రిపబ్లిక్‌గా పేరు మారడం, 04 ఫిబ్రవరి 1948న పూర్ణ స్వతంత్ర పొందిన తనదైన రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్య సామ్యవాద గణతంత్ర శ్రీలంకగా రూపాంతరం చెందడం జరిగింది. శ్రీలంక రాజధానిగా 'శ్రీ జయవర్ధనేపుర కొట్టె (కొలంబో)' పాలన కేంద్రంగా పనిచేస్తున్నది. అనేక సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న శ్రీలంక రానున్న రోజుల్లో శాంతియుతంగా ప్రగతి పథాన స్థిరంగా అడుగులు వేయాలని కోరుకుందాం, మన పొరుగు దేశవాసులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేద్దాం.

(ఫిబ్రవరి 4న శ్రీలంక స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా)

## చోరీలకు పాల్పడుతున్న ఆరుగురు అరెస్టు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరు చోరీలకు పాల్పడుతున్న ఆరుగురు నిందితులను రఘునాథపాలెం పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి 80 కిలోల కాపర్ వైరు, 66 కిలోల అల్యూమినియం వైరును స్వాధీనం చేసుకున్నారు. సిఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం... ఏసిపి ఎస్‌వి రమణమూర్తి ఆదేశాల మేరకు రఘునాథపాలెం సిఐ ఎండి ఉస్మాన్ షరీఫ్ సారధ్యంలో ఎస్ఐ జి. నరేష్ తన సిబ్బందితో కలిసి రఘునాథపాలెం ఆపిల్ సెంటర్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా టిఎస్04యుఏ1808 నెంబరు గల ఆటోలో అల్యూమినియం వైరు పెట్టుకుని ఖమ్మం వైపు వెళ్తుండగా అందులో ఉన్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ఖమ్మం అర్బన్ కైకొండాయిగూడెంకు చెందిన పిట్టల గోపి, అంగోతు ఉమాశంకర్, శీలం నాగేశ్వరరావు, మందా ఛత్రపతి, వైఎస్ఆర్ కాలనీకి చెందిన ఆకుల నాని, రమణగుట్టకు చెందిన బజ్జా కృష్ణలుగా గుర్తించారు. ఈ ఆరుగురు కలిసి ఖమ్మం పోలీస్ కమిషనరేట్ ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరును చోరీకి పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందన్నారు. చోరీ చేసిన కాపర్ వైర్లను బజ్జా కృష్ణ పాత ఇనప కొట్టుకు అమ్మి వచ్చిన డబ్బులతో జల్సా చేసే వారని సిఐ తెలిపారు. వీరిపై రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌తో పాటు కమిషనరేట్ పరిధిలో 18 కేసులు నమోదయ్యాయని సిఐ తెలిపారు. నిందితుల వద్ద నుంచి 80 కేజీల కాపర్ వైరు, 66 కేజీల అల్యూమినియం వైరు చుట్టలను, రెండు సెల్‌ఫోన్స్, రవాణాకు ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకొని, నిందితులను. రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు. ఈ తనిఖీల్లో సిబ్బంది రాజు, బి. శ్రీనివాసులు, ఎండి అహ్మద్ అలీ, వి. నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## స్ట్రాంగ్ రూమ్ పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌ను జిల్లా కలెక్టర్ జితేష్‌విపాటిల్ మంగళవారం పరిశీలించారు. నూతనంగా ఏర్పడిన అశ్వారావుపేట మున్సిపాలిటీ ఎన్నికలు సందర్భంగా వ్యవసాయ కళాశాలలో ఉన్న స్ట్రాంగ్ రూమ్ కటింగ్ హాల్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు ఎన్నికల అబ్జర్వర్ అనిల్‌కుమార్, మున్సిపాలిటీ కమిషనర్ నాగరాజు, తహసీల్దార్, ఎంపిడిఓ తదితరులు ఉన్నారు.


## సిపిఐ అభ్యర్థి ప్రచారం ముమ్మరం



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట మున్సిపాలిటీగా అవతరించిన తర్వాత మొట్టమొదటిసారిగా జరగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో 19వ వార్డులో సిపిఐ పార్టీ అభ్యర్థి తిర్నాటి సంజయ్ సిపిఐ అశ్వారావుపేట నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ సలీం ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించడం జరిగింది. అభ్యర్థి, సిపిఐ నాయకులు, కార్యకర్తలు 19వ వార్డులో గడపగడపుకు తిరుగుతూ, ప్రజలను కలుస్తూ ప్రచారం కొనసాగించారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేసేది ఒక్క సిపిఐ పార్టీనేనని, సిపిఐ అభ్యర్థిని ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. 19వ వార్డులో ఎర్రజెండాను ఎగరవేస్తామని సిపిఐ పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేశారు.

## తీర్థాల జాతరకు విస్తృత ఏర్పాట్లు చేయాలి

-మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం రూరల్ మండలంలోని తీర్థాల సంగమేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా జాతర నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేయాలని, ప్రణాళిక ప్రకారం నిర్దేశించుకున్న పనులను జాతర సమయానికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మంగళవారం తీర్థాల మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈనెల 14 నుంచి 15 వరకు ఐదు రోజుల పాటు మహాశివరాత్రి జాతర వేడుకలను అత్యంత వైభవోపేతంగా తీర్థాలలో నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. నిర్దేశించుకున్న పనులను జాతర సమయానికి సన్నద్ధమయ్యే విధంగా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా నాలుగు లక్షల మంది భక్తులు తీర్థాల గ్రామంలో ఉన్న సంగమేశ్వర స్వామి ఆలయంలో స్వామిని దర్శించుకునే అవకాశం ఉంది. గతం కంటే మెరుగైన వసతులు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన మేర పారిశుధ్య కార్మికులను నియమించి ఆలయ ప్రాంగణం, జాతర పరిసరాలను నిరంతరాయంగా శుభ్రం చేస్తూ పరిశుభ్రంగా ఉంచాలని, కార్మికులకు డ్రెస్ కోడ్ ఉండాలన్నారు. 30 టాయిలెట్స్ బ్లాక్‌లను రన్నింగ్ వాటర్‌తో సహా అందుబాటులో ఉంచాలన్నారు. భక్తులకు త్రాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

## ధర్నా పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎఐజెసిటివో, ఆలిండియా జాక్ ఆధ్వర్యంలో ఈనెల 5న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరిగే ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. మంగళవారం ఖమ్మంలోని పిఆర్‌టియు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎఐఎఫ్‌టివో జాతీయ ఉపాధ్యక్షులు చిత్తలూరు ప్రసాద్ ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్ రావు, మాజీ అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు (వైవి), నాయకులు రాయల నర్సింహారావు, తాళ్లూరు చంద్రశేఖర్, లింగం సతీష్, గుర్రం కేశవరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే బాధ్యత నాది

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/ ఖమ్మం రూరల్ :** అధికారంలో ఉన్న పదేళ్లు నిరుపేదల ఇండ్ల స్థలాల గురించి పట్టించుకోకుండా వ్యవహరించిన వారు నేడు ఎన్నికలు రాగానే ఓట్ల కోసం ఆరాటపడుతున్నారని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బిఆర్‌ఎస్ పార్టీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 7, 8, 9, 12, 13 వార్డుల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార రోడ్డు షోలో మంత్రి పాల్గొని విపక్షాల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పాలకులు పేదల సొంతింటి కలను నిర్లక్ష్యం చేశారన్నారు. ఆనాడు అర్హులైన వారికి స్థలాలు ఇవ్వకుండా వంచించారన్నారు. పేదల సొంతింటి కలను నెరవేరుస్తామని భరోసా ఇచ్చారు. ఇండ్ల స్థలాలు ఇచ్చే మంత్రిని కూడా నేనేనని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అర్హులైన ప్రతి నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చి వాటిలో ఇందిరమ్మ ఇండ్లు కూడా కట్టించి ఇచ్చే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని ఏప్రిల్ నుంచి వరుస విడతల్లో ప్రతి పేదవానికి పక్కా ఇండ్లు నిర్మించి ఇచ్చే వరకు విశ్రమించనని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇప్పటికే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం వంటి పథకాలతో పేదలకు అండగా నిలుస్తుందన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీని ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని, వార్డుల్లో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైన్ల పనులను వేసవి లోపే పూర్తి చేస్తామన్నారు. తనను అసెంబ్లీ ఎన్నికల్లో దీవించినట్టే ఏదులాపురం మున్సిపాలిటీ బరిలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాల్సిందిగా మంత్రి పొంగులేటి కోరారు.

## ముగిసిన ఉపసంహరణలు

గుర్తులు కేటాయించిన అధికారులు

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** నూతనంగా ఏర్పడ్డ అశ్వారావుపేట మున్సిపాలిటీ తొలి కౌన్సిలర్ అభ్యర్థులుగా 146 నామినేషన్లు దాఖలయ్యాయి. ఉపసంహరణ ముగుస్తుండటంతో 68 మంది వారి నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. ప్రధాన పార్టీలకు చెందిన కాంగ్రెస్ సిపిఐ పొత్తులో భాగంగా 22బి ఫారాలను 21 కాంగ్రెస్, ఒకటి సిపిఐ, బిఆర్ఎస్, తెలుగుదేశం పొత్తులో భాగంగా 22 బిఫారాలు 21 బిఆర్ఎస్, ఒకటి టిడిపి అభ్యర్థులు నామినేషన్ అధికారులకు సమర్పించారు. సిపిఐ పార్టీ నుండి 19వ వార్డు సభ్యులుగా తిర్నాటి సంజయ్ బరిలో నిలిచారు. పెద్ద మొత్తంలో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థులను బుజ్జగించి కొంతమేరకు ఉపసంహరణ చేయించారు. ఇంకా ఒకటి రెండు వార్డులు మినహా మిగిలిన అన్ని వార్డుల్లో కాంగ్రెస్ పార్టీకి రెబల్ అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు. దీంతో పాటు బిజెపి ఆధార్ పార్టీ ఆర్పీల్ పార్టీలు కూడా కొన్ని వార్డుల్లో పోటీలో నిలిచారు. మొత్తం 22 వార్డుల్లో 68మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు ఎన్నికల అధికారులు ధృవీకరించారు. పోటీలో ఉన్న కాంగ్రెస్ బిఆర్ఎస్, సిపిఐ, సిపిఐ ఒంటరిగా పోటీలో ఉన్న జనసేన పార్టీ గుర్తులు కేటాయించగా ఆధార్ ఆర్డీఎల్ పార్టీలతో పాటు మిగిలిన కాంగ్రెస్ రెబల్ స్వతంత్ర అభ్యర్థులకు సైతం గుర్తులను కేటాయించారు.

# అధికారులు ఎన్నికల విధులపై అవగాహన కలిగి ఉండాలి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/వైరా :** ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని, నిబంధనల ప్రకారం ఎన్నికల విధులు కట్టుదిట్టంగా నిర్వహించేలా సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం వైరా తహసీల్దార్ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన వైరా మున్సిపాలిటీ వార్డు అభ్యర్థుల బిఫామ్ పరిశీలన, స్వతంత్ర అభ్యర్థుల ఎన్నికల గుర్తుల కేటాయింపు ప్రక్రియను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. అభ్యర్థులు సమర్పించిన నామినేషన్ పత్రాలు, బిఫామ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించుటకు నోడల్ అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికలకు కేటాయించిన ఇతర అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. అధికారులు జిల్లాలో ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికలకు కేటాయించిన అధికారులందరూ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో నామినేషన్ల తర్వాత ఉపసంహరణ, రాజకీయ పార్టీల బిఫామ్ పరిశీలన చాలా ముఖ్యమైన అంశమని వివరించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి అంశం నిబంధనల ప్రకారం జరిగేలా చూడాలని, నామినేషన్ల అప్పీళ్ల పరిష్కారం, బిఫామ్ లేని అభ్యర్థులు స్వతంత్ర అభ్యర్థులుగా ప్రకటన, గుర్తుల కేటాయింపు పారదర్శకంగా కేటాయించాలని సూచించారు. ఎన్నికల ప్రచార నిమిత్తం ర్యాలీ, సమావేశాల నిర్వహణకు ముందస్తు అనుమతి తీసుకోవాలని, సౌండ్ సెట్, వాహనానికి ప్రత్యేకంగా అనుమతి తీసుకోవాలని, ఎక్కడ కూడా పోటీదారులకు ఒకే రూట్‌లో సమావేశాలు, ర్యాలీల నిర్వహణకు అనుమతి జారీ చేయవద్దని అన్నారు. ఎన్నికల్లో ప్రలోభాలకు గురిచేసేందుకు అక్రమంగా నగదు, మద్యం తరలిస్తే పట్టుకొని సీజ్ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైరా తహసీల్దార్ సురేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ గురులింగం, ఎంపిడివో తేజావత్ సక్రియ, ఎంఈవో వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

# గెలుపే లక్ష్యంగా పోరాడాలి

వందశాతం ఫలితాలు సాధించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి

సాబీర్‌పాషా పిలుపు



**ప్రజాపక్షం/పాల్వంచ :** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో నాయకులు, కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పోరాడాలని, వందశాతం ఫలితాలను సాధించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా అన్నారు. కార్పొరేషన్ పరిధి పాల్వంచ డివిజన్ నుండి పోటీలో నిలిచిన అభ్యర్థుల బి ఫారాలను పార్టీ కార్యాలయం చంద్రా రాజేశ్వరరావు భవన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధంకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా సాబీర్‌పాషా మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ఇంటింటింకి వెళ్లి ఓట్లు అభ్యర్థించాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకొని ముందుకు సాగాలన్నారు. ఆయా డివిజన్ పరిధిలో ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలన్నారు. నాయకులు, కార్యకర్తల సహాయ సహకారాలను తీసుకొంటూ ప్రచారాన్ని పరుగులు పెట్టించాలని చెప్పారు. ప్రణాళికా ప్రకారం ప్రచారం చేస్తే విజయం దక్కుతుందని, ఏ చిన్న అవకాశాన్ని జారవిడుచుకోవద్దన్నారు. ఏ మాత్రం విశ్రమించినా ఫలితాలు తారుమారయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రత్యర్థి పార్టీల అంచనాలను తెలుసుకొంటూ ప్రచారాన్ని కొనసాగించి గెలుపు సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ, మండల కార్యదర్శులు అడుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, పట్టణ సహాయ కార్యదర్శి ఉప్పుశెట్టి రాహుల్, నాయకులు దుగ్గిరాల సుధాకర్, శనగారపు శ్రీనివాస్, వైఎస్. గిరి, వీసంశెట్టి విశ్వేశ్వర్‌రావు, అన్నారపు వెంకటేశ్వర్లు, వల్లపు యాకయ్య, చెరుకూరి శేఖర్ బాబు, మొగులూరి క్రిష్ణ, మహమ్మద్ అస్లాం, కంటెస్టెడ్ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధ ప్రాతిపదికన వెంగళరావు సాగర్ ప్రాజెక్ట్

రూ 33.50 కోట్లతో పనులు



**ప్రజాపక్షం/చంద్రుగొండ :** మండల పరిధిలోని వెంగళరావు సాగర్ ప్రాజెక్టు అలుగు నిర్మాణానికి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. భారీ వర్షాలకుల అలుగు పూర్తిగా కొట్టుకుపోవడంతో గత బిఆర్ఎస్ ప్రభుత్వం అలుగు నిర్మాణ పనులకి ఎంఎల్ఏ, మంత్రులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా పెడచెవిని చేట్టారు. మాజీ మంత్రి జలగం ప్రసాదరావు చొరవతో జాతీయ ఎస్టి కమిషన్ జోక్యంతో అలుగునిర్మాణానికి అశ్వారావుపేట ఎంఎల్ఏ జారే ఆదినారాయణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రూ 33.55 కోట్లు నిధులు మంజూరు చేయించారు. దీంతో సదర్ కాంట్రాక్టర్ అలుగు నిర్మాణాలను గత 15 రోజుల నుండి ముమ్మరంగా చేపట్టారు. ఈ ప్రాజెక్ట్ కింద సుమారు 2,200 ఎకరాలు ఆయకట్టు ఉంది. ఈ ఆయకట్టు గ్రామాలైన దామరచర్ల, సీతయ్యగూడెం, చంద్రుగొండ, తిప్పనపల్లి, మహమ్మద్‌నగర్ గ్రామాలకు భూములు ఉన్నాయి. వచ్చే ఖరీఫ్ నాటికి పనులు పూర్తి చేసేలా ఇరిగేషన్ అధికారులు పర్యవేక్షణ చేస్తూ వేగవంతం చేశారు. పూర్తయితే మరో ఎనిమిది వందల ఎకరాలు సాగు చేసే అవకాశం ఉంటుంది. అలుగు నిర్మాణం పనులు చేపట్టడంతో రైతులు, అదే విధంగా మత్స్యకారులు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# లండన్‌లో జాబ్ వదిలి..సిపిఐ అభ్యర్థిగా బరిలో

యువతకు దక్కిన 'ఎర్రని' గౌరవం

సిపిఐ పార్టీ ఖ్యాతిని పెంచిన నిర్ణయం

32వ డివిజన్‌లో శ్రీనాథ్‌రెడ్డి విస్తృత ప్రచారం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** యువత రాజకీయాలలోకి రావాలనే మాటను వింటూనే ఉంటాం...రాజకీయ ఉపన్యాసాలు చూస్తునే ఉంటాం..చివరికి అది ఆచరణకు మాత్రం ఆమడ దూరంలో ఉంటుంది. కానీ ఏదులాపురం ఎర్రతోటలో యువతకు పెద్ద పీట వేశారు. లండన్‌లో ఉద్యోగం వదిలి సిపిఐ పార్టీ తరపున ప్రజా సేవ చేస్తున్న మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డికి పట్టం కట్టారు. ఇది యువతకే కాకుండా సిపిఐ పార్టీలో నాలుగు తరాలుగా కొనసాగుతున్న కుటుంబానికి దక్కిన సముచిత గౌరవంగా లిఖించబనుంది. ఈ నిర్ణయంతో సిపిఐ పార్టీ ఖ్యాతిని మరింత ఇనుమడింప చేసింది. అలాగే అభ్యర్థిత్వంపై ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుండటం నిర్ణయానికి నిలువుటద్దంగా నిలిచింది. ఈ నేపథ్యంలో 32వ వార్డులో జోరుగా సాగుతున్న ప్రచారం సాక్షిగా ఎర్ర జెండా రెపరెపలను ప్రస్ఫుటితం చేస్తుంది. మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి , తండ్రి నిరంజన్‌రెడ్డి మొదలుకొని, తాత ముత్తాతలు సిపిఐ పార్టీలోనే కొనసాగారు. ఈ నేపథ్యంలో ప్రత్యర్థుల దాడులలో నలిగిపోయారు. సిపిఐ పార్టీకి ఈ కుటుంబమే బలంగా ఉందని, తలచి లూటీలు చేసి భయకంపితులను చేసేవారు. ఇలా ఆస్తి నష్టం చేయడంతో పాటు పంటలను సైతం ధ్వంసం చేసేవారు. అంతటితో ఆగకుండా ఆ కుటుంబాన్ని ప్రజల నుంచి వేరు చేసి ఇంటిని ఒంటరి చేశారు. అయినప్పటికీ వీటికి వెరవెకుండా ఆ కుటుంబం నాటి నుంచి సిపిఐ పార్టీలోనే కొనసాగుతూ ఉంది.

**ఊరి ప్రజల సేవకే...**


మంచి ఆస్తిపాస్తులు, కోరుకున్న కుటుంబం, లండన్ లాంటి దేశంలో మంచి ఉద్యోగం. అయినప్పటికీ వీటన్నింటినీ వదిలేసి తన సొంత ఊరికే వచ్చాడు. ఇక్కడ సిపిఐ పార్టీ తరపున (ఎఐవైఎఫ్) అఖిల భారత యువజన సమాఖ్యలో క్రియాశీలకంగా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఊరిలో ప్రజలకు సేవలను అందిస్తూ చురుకుగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేవాడు. యువత సమస్యలపై ఇచ్చిన పిలుపులోను బాధ్యతగా వహించేవాడు. అలా తనకుంటూ సిపిఐ పార్టీ ద్వారా ఓ గుర్తింపును సొంతం చేసుకున్నాడు. ఇలా తనకు అందివచ్చిన 32వ డివిజన్లో సిపిఐ పార్టీ అభ్యర్థిగా బరిలో దిగి ముమ్మర ప్రచారంలో ముందుకు సాగుతున్నాడు.

**ఆ సీనే రిపీట్ కానుందా...?**

ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికలవేళ ఆసీనే రిపీట్ కానుందా? అనే చర్చ జోరుగా సాగుతుంది. సిపిఎం నుంచి వెంపటి రామకోటయ్య, సిపిఐ నుంచి నిరంజన్‌రెడ్డి సొసైటీ ఎన్నికల్లో పోటీపడ్డారు. ఈ నేపథ్యంలో నిరంజన్‌రెడ్డి గెలుపొందారు. ఇప్పుడు తాజాగా జరుగుతున్న ఎన్నికలలో ఓటమిపాలైన రాంకోటయ్య కుమారుడు బరిలో నిలవగా...అతనికి ఎదురుగా నిరంజన్‌రెడ్డి కుమారుడు మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి నిలబడ్డాడు. ఈ నేపథ్యంలో గత సీన్ రిపీట్ అయి పార్టీ గెలుస్తుందనే ధీమా ఆ శిబిరం నుంచి వ్యక్తమవుతోంది.

## మేడారం జాతర ఆదాయం రూ.3.28 కోట్లు

ఆర్‌టిసి ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరామ్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఖమ్మం రీజియన్ పరిధిలో 214 బస్సు సర్వీసులను నడపడం ద్వారా రూ.3,28,39,181 ఆదాయం వచ్చిందని, 20,38,063 మంది ప్రయాణికులు బస్సులో ప్రయాణించినట్లు ఆయన తెలిపారు. ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 25 నుండి 31 వరకు ప్రత్యేక బస్సులను జాతరకు నడిపినట్లు తెలిపారు. ఖమ్మం డిపో పరిధిలో ఖమ్మం, ఇల్లందు పాయింట్ల నుంచి 41 బస్సులను నడిపినట్లు ఆయన తెలిపారు. రూ.60,66,398 ఆదాయం వచ్చిందన్నారు. సత్తుపల్లి డిపో పరిధిలో ఏటూరునాగారం, చర్ల, వెంకటాపురం పాయింట్ల ద్వారా 26 బస్సులను నడిపినట్లు ఆయన తెలిపారు. రూ. 74,44,937ఆదాయం వచ్చినట్లు తెలిపారు. భద్రాచలం డిపో పరిధిలో భద్రాచలం, పాల్వంచ పాయింట్ల ద్వారా 36 బస్సులు నడిపినట్లు తెలిపారు. రూ. 46,91,726 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కొత్తగూడెం డిపో పరిధిలో కొత్తగూడెం పాయింట్ నుంచి 90 బస్సులను నడిపినట్లు తెలిపారు. రూ. 10,70,294 ఆదాయం వచ్చిందని ఆర్ఎం తెలిపారు. మణుగూరు డిపో పరిధిలో మణుగూరు, మంగపేట పాయింట్ల నుంచి 21 బస్సు సర్వీసులను మేడారం జాతరకు నడిపినట్లు తెలిపారు. రూ.39,33,179 ఆదాయం వచ్చిందని తెలిపారు. ఖమ్మం రీజియన్ పరిధిలో 214 బస్సుల ద్వారా మేడారం జాతరకు 2,040 ట్రిప్పులు నడిపినట్లు ఆర్ఎం తెలిపారు. వీటి ద్వారా రూ. 3,28,39,181 ఆదాయం వచ్చిందని తెలిపారు. మొత్తం 20,03,863 మంది ప్రయాణికులు ఆర్టిసి బస్సులో జాతరకు వెళ్లినట్లు తెలిపారు. ఆక్యూపెన్సీ రేటు 85 శాతం నమోదైందని తెలిపారు. జాతరకు ఆర్టిసి బస్సులను సద్వినియోగం చేసుకున్న భక్తులకు ఆర్ఎం ధన్యవాదాలు తెలిపారు. జాతర సందర్భంగా విధి నిర్వహణలో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా కృషి చేసిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ఆర్ఎం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికల్లో 'నిబద్ధత'కే పట్టం..

పార్టీ కోసం పనిచేసిన వారికే గౌరవం

- కష్టపడ్డ వారికి అవకాశం

డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క రాజకీయ చతురత






**ప్రజాపక్షం/ మధిర :** మధిర మున్సిపాల్టీ ఎన్నికల్లో భాగంగా అధికార కాంగ్రెస్ పార్టీ నుండి అభ్యర్థుల ఎంపికలో మరోసారి డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క తన రాజకీయ చతురతను చాటారు. కాంగ్రెస్ పార్టీ నమ్ముకుని కష్టపడే వారికే అభ్యర్థులుగా ఎంపిక చేసి పార్టీ కోసం పనిచేసిన వారికి గౌరవం, కష్టపడే వారికి అవకాశం ఇచ్చినట్లు కన్పిస్తుంది. మున్సిపల్ ఎన్నికల నామినేషన్లలో పార్టీపై అచంచల విశ్వాసంతో నిలబడిన వారికి పార్టీలో దీర్ఘకాలంగా అంకితభావంతో సేవలందించిన సీనియర్ కార్యకర్తలకు, అలాగే నిజాయితీగా ప్రజాసేవలో ముందుడిన నేతలకు పార్టీ అధిష్ఠానం అత్యంత ప్రాధాన్యత కల్పించింది. పార్టీ కోసం ఎన్ని కష్టాలు ఎదురైనా వెనుకడుగు వేయకుండా పనిచేసిన వారిని గుర్తించి వారికి టికెట్లు, కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా నిబద్ధతకు పట్టం కట్టినట్లు పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా డబ్బు ఉంటేనే మున్సిపల్ ఎన్నికల్లో సీటు వస్తుందని అనుకునే వారికి భిన్నంగా సామాన్యులకు కూడా మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయడానికి అవకాశం కల్పించారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై తీసుకున్న నిర్ణయం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహన్ని నింపింది. పురపోరులో కాంగ్రెస్, టిడిపి కూటమి అభ్యర్థులు గెలవటం ఖాయమని పలువురు తెలుపుతున్నారు.

## నామినేషన్లు ఉపసంహరించుకున్న అభ్యర్థులు

**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** కొత్తగూడెం మున్సిపల్ ర్పొరేషన్, ఇల్లెందు, అశ్వారావుపేట మున్సిపాలిటీలకు సంబంధించిన నామినేషన్లు వేసిన అభ్యర్థుల్లో పలువురు మంగళవారం ఉపసంహరించుకున్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ 60 డివిజన్ల వ్యాప్తంగా మొత్తం 592 మంది నామినేషన్లు వేయగా, 234 ఉపసంహరించుకోవడంతో 358 మంది బరిలో ఉన్నారు. అశ్వారావుపేట మున్సిపాల్టీ పరిధిలోని 22 వార్డుల్లో 146 మంది నామినేషన్లు సమర్పించగా, 78 మంది పోటీ నుండి తప్పుకోవడంతో 68 మంది అభ్యర్థులు నిలిచారు. ఇల్లందు మున్సిపాల్టీ 24 వార్డుల్లో 178 మంది నామినేషన్లు వేశారు. ఇందులో 71 మంది అభ్యర్థులు వారివారి నామినేషన్లను వెనక్కు తీసుకోవడంతో 107 మంది పోటీ చేస్తున్నారు.

# ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే ధ్యేయం

## అభ్యర్థుల చేతికి 'బీ-ఫామ్' అందజేసిన వరంగల్ ఎంపి కడియం కావ్య

ప్రజాపక్షం/స్టేషన్ ఘనపూర్ : స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మంగళవారం స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో అభ్యర్థుల చేతికి బీఫామ్ లు అందజేశారు. బీఫామ్‌లు అందుకున్న అభ్యర్థులు వెంటనే ఎన్నికల అధికారులకు బిఫామ్ సమర్పించాలని ఎంపీ సూచించారు. అధికారికంగా పార్టీ తరపున బీఫామ్‌లు అందాయని పేర్కొన్న ఎంపీ, ప్రభుత్వ ప్రజారంజక పాలన, అమలవుతున్న గ్యారంటీలను ఇంటింటికీ తీసుకెళ్లి ఓటర్ల ఆశీస్సులు పొందాలని పిలుపునిచ్చారు. వార్డుల వారీగా కార్యకర్తలను సమన్వయం చేసుకుని ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయాలని, ప్రత్యర్థుల వ్యూహాలను సమర్థంగా ఎదుర్కోవాలని దిశానిర్దేశం చేశారు. స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీలోని 18 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులే గెలుపు సాధిస్తారని ఎంపీ డాక్టర్ కడియం కావ్య ధీమా వ్యక్తం చేశారు.అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ మున్సిపాలిటీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన గ్యారంటీ పథకాలు ప్రజల్లో విశేష ఆదరణ పొందుతున్నాయని పేర్కొన్నారు. పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు తమ పార్టీ కట్టుబడి ఉందని, మున్సిపాలిటీ ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఎంపీ కోరారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా వచ్చిన తర్వాతే స్టేషన్ ఘనపూర్‌ను మున్సిపాలిటీగా ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు.స్టేషన్ ఘనపూర్ లో జరుగుతున్న అభివృద్ధిని చూసే ప్రజలు ఓటు వేయాలని పిలుపునిచ్చారు.ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీలో ఇప్పటికే రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించారని చెప్పారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచిన తర్వాత మరో రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపడతామని ప్రకటించారు.



స్టేషన్ ఘనపూర్‌ను ఒక మోడల్ మున్సిపాలిటీగా తీర్చిద్దుదామని అన్నారు. శివునిపల్లి చాగల్, ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా చేసుకొని పని చేయాలని కార్యకర్తలకు సూచించారు. మున్సిపాలిటీలోని 18కి 18 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.
స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో సాగునీరు, విద్య, వైద్య, వ్యవసాయం, విద్యుత్ రంగాల అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి నిరంతరం కృషి చేస్తున్నారని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తెలిపారు. దాదాపు రూ.400 కోట్ల వ్యయంతో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేలా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలోని గురుకుల పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని చెప్పారు. ఇటీవల యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించినట్లు తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలో రూ.45.50 కోట్లతో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం జరుగుతోందన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తూ గ్రామాలలో అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణంతో పాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించడం జరిగిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పలు దఫాలుగా నిర్వహించిన సర్వేలు, టిపిసిసిసర్వేల నివేదికల ఆధారంగానే అభ్యర్థులను ఎంపిక చేశామని తెలిపారు.పార్టీ తీసుకున్న నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని, అభ్యర్థుల గెలుపు కోసం సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. టికెట్ ఆశించి అవకాశం దక్కని ఆశావాహులు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో పార్టీ వారికి మరిన్ని అవకాశాలు కల్పిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ పేరుతో నకిలీ వాట్సప్ అకౌంట్

ప్రజాపక్షం/జనగామ:జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ పేరుతో సైబర్ క్రైం కేటుగాళ్ల నలికి అకౌంట్ సృష్టించారు. ఆ అకౌంట్‌కు హాయ్ సార్, బాగున్నారా అంటు మెసేజ్‌లు చేస్తూ డబ్బులు దండుకునేందుకు వాట్సప్ అకౌంట్ క్రియేట్ చేసినట్లు తెలుస్తుంది. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే ఫిర్యాదు చేశారు. అధికారులు ఎవరు నకిలి వాట్సప్ అకౌంట్ మెసెజ్‌లకు స్పందించవద్దని కోరారు. సైబర్ క్రైమ్ మోసగాళ్లు వివిధ రూపాల్లో డబ్బులు దండుకునేందుకు ప్రయత్నిస్తారని, ఎవరు వారి మోసాలకు గురికావొద్దన్నారు. సైబర్ క్రైమ్ కేటుగాళ్లు ఏకంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ పేరు, ఫోటోతోనే నకిలీ వాట్సప్ అకౌంట్ క్రియేట్ చేశారు.

# జనగామలో పులి సంచారం

ప్రజాపక్షం/జనగామ:యాదాద్రి భువనగిరి జిల్లాను భయపెడుతున్న పులి జనగామ వరకు వచ్చినట్లు తెలుస్తుంది. జనగామ మండలం సిద్దెంకి సమీపంలోని శ్రీనివాసపురం ప్రాంతంలో పులి సంచరించినట్లు రైతులు చెబుతున్నారు. పులి కాళ్ల కనిపించడంతో వారు అటవి శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. జనగామ మండలంలోని సిద్దెంకి, ఎల్లంల, పెద్దరాంచర్ల గ్రామాల ప్రజల్ని అప్రమత్తం చేశారు. రైతులు ఎవరు ఒంటిరిగా పొలాల వద్దకు వెళ్లొద్దని, ఇద్దరు ముగ్గురు కలిసి వెళ్లాలని సూచించారు. రాత్రి వేళల్లో పశువులు, లేగ దూడల్ని ఇంటి వద్దకే తోలుకు రావాలన్నారు. జనగామ ప్రాంతంలో పులి సంచరిస్తుందన్న వార్త దావాలంగా వ్యాపించడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గత వారం రోజులుగా యాదాద్రి భువనగిరి జిల్లాతో పాటు పక్క ప్రాంతాలను బయపెడుతున్న పులి చివరకు జనగామ ప్రాంతంలో తిరుగుతున్నట్లు ఆనవాళ్లు ఉండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న అయోమయానికి గురవుతున్నారు.

# భార్యపై కోపంతో అత్త, బావమరిదిపై దాడి



ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : హన్మకొండ నగరంలోని న్యూశాయంపేట ప్రాంతంలో మంగళవారం ఉదయం కలకలం రేగింది. భార్యతో ఉన్న విభేదాల నేపథ్యంలో ఓ వ్యక్తి అత్త, బావమరిది పై కత్తితో దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. న్యూశాయంపేటకు చెందిన దంపతుల మధ్య గత కొన్ని రోజులుగా తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భార్యపై తీవ్ర కోపంతో ఉన్న భర్త, ఆమె ఇంట్లో లేని సమయంలో అత్త నివాసానికి వెళ్లి అక్కడ ఉన్న అత్త, బావమరిది పై అకస్మాత్తుగా కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో అత్త, బావమరిది తీవ్రంగా గాయపడ్డారు. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. ఇఎంటి మమత, పైలెట్ వేణు క్షతగాత్రులను హన్మకొండలోని రోహిణి ఆస్పత్రికి తరలించారు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఫర్టిలైజర్ యాప్ ద్వారా రైతులు యూరియా బుకింగ్



ప్రజా పక్షం/హసన్ పర్తి : రైతుల ఇబ్బందులను తగ్గించేందుకు ప్రభుత్వం యూరియా యాప్ నుసోమవారం నుండి ప్రారంభించినట్లు మండల వ్యవసాయ అధికారి ఎ.అనురాధ తెలిపారు. యూరియా కొనుగోలు తప్పనిసరిగా ఫర్టిలైజర్ యాప్ ద్వారా బుకింగ్ చేసుకొని మాత్రమే కొనుగోలు చేయాలని రైతులకు తెలిపారు.సోమవారం మండల కేంద్రం లోని లక్ష్మీ ఫర్టిలైజర్ దుకాణంలో రైతులకు యూరియా విక్రయాలను ఆండ్రాయిడ్ సెల్ ఫోన్లను ఉపయోగించి ప్రతి రైతు ఎరువుల యాప్ ను ఇన్ స్టాల్ చేసుకొని యూరియా బుక్ చేసుకోవాలని ఆండ్రాయిడ్ సెల్ ఫోన్ అందుబాటులో లేని రైతులు ఫ్యాక్స్ కుగాని, ప్రైవేట్ షాప్ కుగాని రైతు పట్టా పాస్ బుక్ తీసుకొని వెళితే అక్కడ ఉన్న ఎఇఒ గాని,వాలంటరీ గాని యూరియా బుక్ చేసుకోవడంలో సహాయం చేస్తారని రైతులకు తెలిపారు. మండలంలో సరిపడా యూరియా అందుబాటులో ఉందని రైతులు ఎటువంటి ఆందోళన చెందకుండా నిశ్చితంగా యాప్ ద్వారా బుక్ చేసుకుని యూరియా పొందాలని, ఇంతకు ముందులాగా డైరెక్ట్ గా దుకాణానికి వెళ్ళినట్లయితే యూరియా ఇవ్వడం జరగదని మండల వ్యవసాయ అధికారి ఎ. అనురాధ తెలిపారు.కార్యక్రమంలో లక్ష్మి ఫర్టిలైజర్ యజమాని, రైతులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో 63 మంది పోటీ

ప్రజాపక్షం/తొర్రూరు : అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి చెందుతున్న తొర్రూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో 16 వార్డులకు గాను వార్డు కౌన్సిలర్లుగా పోటీ చేసేందుకు పలు పార్టీలకు చెందిన 103 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉపసంహరణ చివరి రోజు కావడంతో 103మంది నామినేషన్లు వేయగా 40మంది అభ్యర్థులు ఉపసంహరించుకున్నట్లు చెప్పారు. 63మంది కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, సిపిఎం, జనసేన, బిఎస్‌పి, పార్టీలతో పాటు ఇండిపెండెంట్‌గా అభ్యర్థులు వార్డు కౌన్సిలర్లుగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు.

# 'ఫైట్ ఫర్' బచ్చన్నపేట ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో, ధర్నా



ప్రజాపక్షం/బచ్చన్నపేట: బచ్చన్నపేటలో రహదారి వెంటనే మరమ్మత్తు చేయాలని డిమాండ్ చేస్తూ ఫైట్ ఫర్ బచ్చన్నపేట ఆధ్వర్యంలో ప్రధాన చౌరస్తాలో మంగళవారం భారీ రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. బచ్చన్నపేట మండలంలోని కొడవటూర్ కమాన్ క్రాస్ నుంచి బచ్చన్నపేట ఎస్ఆర్ పెట్రోల్ బంక్ వరకు గుంతలమయంగా అధ్వానంగా మారిన జనగామ సిద్దిపేట రహదారిని వెంటనే మరమ్మత్తు చేయాలని డిమాండ్ చేస్తూ ఫైట్ ఫర్ బచ్చన్నపేట ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైట్ ఫర్ బచ్చన్నపేట వ్యవస్థాపకులు పైస రాజశేఖర్ మాట్లాడుతూ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం మూలంగా ప్రతి రోజు ఎంతో మంది ఈ గుంతలలో పడి గాయాలపాలవుతున్నారన్నారు. రోడ్డుపై ఉన్న గుంతలు మృత్యు గుంతలుగా మారాయని బైక్‌లపై వెళ్లిన పలువురు యువకులు మృతి చెందిన సంఘటనలు ఎన్నో జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నా విరమించాలని ఎస్ఐ కోరినా వారు వినలేదు, తహసీల్దార్ హుస్సేన్ కలెక్టర్‌తో మాట్లాడి పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. ఫైట్ ఫర్ బచ్చన్నపేట వ్యవస్థాపక సభ్యులు అఖిల్, రాజు, మురళి, శ్రీను, యాకంరెడ్డి, అష్రఫ్, మహేష్, సందీప్, నాగరాజు, స్టాలిన్, రసూల్, సత్యనారాయణ, విజయ్, సమ్మేశ్వర్, శ్రీకాంత్, సతీష్, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

# 'ఆర్ఐ' నా...మజాకా?

## రిజిస్ట్రేషన్ కావాలంటే డబ్బులు ఇవ్వాల్సిందే... రెవెన్యూ కార్యాలయంలో ఆర్ఐ ఇష్టారాజ్యం

ప్రజాపక్షం/ములుగు:ముడుపులు ముడితేనే భూమి రిజిస్ట్రేషన్ అవుతుంది అని రైతుల వాపోతున్న సంఘటన మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో చోటు చేసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతిని ఏర్పాటు చేసి భూమి ఉన్న వారికి రెవెన్యూ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని అలాగే అర్హత కలిగి ఉన్న భూములకు భూమి పట్టాలు ఇచ్చే విధంగా కాంగ్రెస్ తెలంగాణ ప్రభుత్వం అధికారులకు ఆదేశాల జారీ చేసి అప్పటి నుండి ఇప్పటి వరకు రెవెన్యూ సిబ్బంది నుండి కలెక్టర్ వరకు ప్రతి భూమికి ఉన్న పేపర్లను పరిశీలన చేసి అలాగే పట్టా బుక్ ఉండి ఉన్న రైతు అమ్ముకున్న ఇబ్బందులు ఉండి భూమి అమ్ముకున్న సమయంలో భూమి కొన్న వారికి అలాగే వారసత్వం భూములకు రెవెన్యూ వెంకటాపూర్ మండల కేంద్రంలో తహసీల్దారు కార్యాలయం వద్ద భూమి రిజిస్ట్రేషన్ భూమి బుక్కులను పరిశీలన చేసి రిజిస్ట్రేషన్ చేస్తారు. కానీ తహసీల్దారుకు తెలువకుండానే ఆర్ఐ భూమి రిజిస్ట్రేషన్ చేయాలంటే డబ్బులు ఇవ్వాల్సిందేనని రైతులను డిమాండ్ చేస్తూ రైతుల వద్ద ఎకరాకు రూ.5వేల నుండి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ కాలంలో కొంత మంది రైతులు భూమి రిజిస్ట్రేషన్ కొరకు పోగా వారి వద్ద రూ.2వేల నుండి రూ.5వేల వరకు డిమాండ్ చేసి డబ్బులు తీసుకున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబ్బులు ఇచ్చిన వారికి భూమి పరిశీలన లేకుండా కాగితాలు చూడకుండానే రిజిస్ట్రేషన్ డబ్బులు ఇవ్వని వారికి రోజులు గడుపుతూ ఇబ్బందులు చేస్తున్నట్లు రైతులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆర్ఐపై చర్యలు తీసుకోవాలని రైతులంటున్నారు.

**తప్పు చేస్తే చర్యలు తప్పవు..తహసీల్దారు గిరిబాబు**

భూమి రిజిస్ట్రేషన్ విషయంలో ఆర్ఐ రైతుల వద్ద డబ్బులు తీసుకున్నట్లు మాకు సాక్షాలు ఉంటే అతనిపై చర్యలు తీసుకుంటాం. రైతుల వద్ద రిజిస్ట్రేషన్ విషయంలో భూమి వద్దకు వెళ్లి సర్వే చేయాలని రైతులను ఇబ్బంది పెడుతూ రైతుల వద్ద రిజిస్ట్రేషన్ చేసిన వారికి డబ్బులు ఇవ్వాలని మా దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటాం.

# ఎరుపు స్టిక్కర్ల రాజ్యం.. చట్టం ఎవరికోసం?




ప్రజాపక్షం/నెక్కొండ:వ్యక్తిగత వాహనాల వెనుక భాగంలో ఎరుపు రంగు స్టిక్కర్లతో హోదాలు రాసుకుని తిరగడం ఇప్పుడు గ్రామాలు...పట్టణాల్లో ఓ ఫ్యాషన్‌లా మారింది. సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు మాత్రమే కాకుండా మాజీ హోదాదారులు సైతం ప్రభుత్వ వాహనాల మాదిరిగా తమ వాహనాలను ముస్తాబు చేస్తున్నారు. మోటార్ వాహన చట్టం ప్రకారం అధికారిక విధుల్లో ఉన్న ప్రభుత్వ వాహనాలకు మాత్రమే ప్రత్యేక గుర్తులు అనుమతించబడ్డాయి. అయినా ఈ నిబంధనలు సాధారణ ప్రజలకు మాత్రమే వర్తిస్తున్నాయా? ప్రజా ప్రతినిధులు, మాజీ నాయకుల విషయంలో చట్టం అందమైపోయిందా? అన్న అనుమానాలు బలపడతున్నాయి.కేంద్ర ప్రభుత్వం మంత్రులు, ఐఎఎస్, ఐపిఎస్ అధికారుల వాహనాలపై నీలి బీకన్ లైట్లను పూర్తిగా తొలగించింది. అలాంటి సందర్భంలో హోదా లేని వ్యక్తులు లేదా మాజీ ప్రజా ప్రతినిధులు ఎరుపు స్టిక్కర్లతో రోడ్డుపై హడావుడి చేయడం ఎంత వరకు న్యాయమన్న ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన ఆర్‌టిఎ అధికారులు ప్రభుత్వానిదే. ఈ వ్యవహారంపై ఇప్పటికైనా ప్రభుత్వం, రవాణా శాఖ, పోలీసు అధికారులు స్పందించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా స్టిక్కర్లు వాడుతున్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# వర్ధన్నపేట ప్రజలే గుణపాఠం చెపుతారు


## వర్ధన్నపేట ఎమ్మెల్యే, కె.ఆర్. నాగరాజు



ప్రజాపక్షం/వర్ధన్నపేట : అబద్ధాల పునాదులపై రాజకీయాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యేకు వర్ధన్నపేట ప్రజలే గుణపాఠం చెప్తారని ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు అన్నారు. వర్ధన్నపేట టౌన్ లోని మున్సిపల్ ఎన్నికల కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన 12మంది వార్డు సభ్యులను ప్రకటించిన అనంతరం వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపిఎస్ అధికారి కెఆర్ నాగరాజు మీడియాతో మాట్లాడారు.వర్ధన్నపేట మున్సిపాలిటీ 12వ వార్డులో కాంగ్రెస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజల నుంచి వెల్లువెత్తుతున్న మద్దతును చూసి ప్రత్యర్థులు ఓర్వలేక అసత్యాలు, అవాస్తవాలు, దుష్ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారంలో ముందుకు దూసుకెళ్తుండగా, ప్రజలు కాంగ్రెస్‌కి బ్రహ్మరథం పడుతున్నారు. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్, 100 పడకల ఆసుపత్రి, మినీ స్టేడియం, మున్సిఫ్ కోర్టు, సబ్ జైలు, బంజారా భవన్ వంటి అభివృద్ధి పనులు మంజూరు చేయించామని స్పష్టం చేశారు. ప్రజల అభిప్రాయం మేరకే వర్ధన్నపేట పట్టణంలోనే 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన జరిగిందని తెలిపారు. కోనారెడ్డిపేట చెరువు ఆక్రమణలపై మాట్లాడే నైతిక హక్కు పదేళ్లు పాలించిన వారికి లేదని అన్నారు. ఇటీవల వర్షాకాలంలో తమ స్వంత నిధులతో ఫీడర్ ఛానల్ మరమ్మతులు చేయించి రైతులకు నీళ్లు అందించామని గుర్తు చేశారు.కాంగ్రెస్ట్ అమలు చేస్తున్న 6 గ్యారంటీలతో బడుగు, బలహీన వర్గాలకు నిజమైన న్యాయం జరుగుతోందని చెప్పారు. మీరు చేసిన అభివృద్ధి చెప్పి ఓట్లు అడగండి – మేము చేసిన అభివృద్ధి, సంక్షేమం చెప్పి ఓట్లు అడుగుతామని సవాల్ విసిరారు.వర్ధన్నపేట చెరువు కింద ఉన్న రైతులు, పట్టణ ప్రజలు ఈ తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 12 మంది అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి, వర్ధన్నపేట అభివృద్ధికి బహుమతిగా ఇవ్వాలని పట్టణ ప్రజలను కోరారు.ఈ సమావేశంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వరద రాజేశ్వర రావు, అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు, మైనారిటీ నాయకులు మహమ్మద్ చోటే, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అందుబాటులో లేని వైద్యులు.. రోగుల అవస్థలు

## పేరుకే ఇద్దరు డాక్టర్లు విధుల్లో ఒక్కరూ ఉండరు



ప్రజాపక్షం/వాజేడు:మారుమూల ఏజెన్సీ ప్రాంతంలో వైద్యులు అందుబాటులో లేక రోగులు అవస్థలు పడుతున్నారు. నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షలా మారింది. ఏజెన్సీలో ప్రభుత్వ వైద్యం మీద ఆధారపడి ఉన్న పేద కుటుంబాల చెంతకు చేరడం లేదు. ములుగు జిల్లా వాజేడు మండలంలోని వాజేడు ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు అందుబాటులో లేక రోగులు అవస్థలు పడుతూ పడిగాపులు కాస్తున్నారు. ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వైద్యశాలలో పేరుకే ఇద్దరు డాక్టర్లు ఒకరు కూడా విధులలో ఉండరు. మంగళవారం సమయం 12 అవుతున్న ఒక వైద్యాధికారి కూడా విధులకు హాజరు కాకపోవడం గమనార్హం. ఆశాడే కార్యక్రమానికి వైద్యులు విధుల్లో ఉండి ఆశా కార్యకర్తలకు తగు సూచనలు సలహాలు అందించాల్సిన వైద్యాధికారులు రాకపోవడంతో నిర్లక్ష్యం అద్దం పడుతుంది. అలాగే గర్భిణీ స్త్రీలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించాల్సిన వైద్యులు అధికారులు అందుబాటులో లేకపోవడంతో గర్భిణీ స్త్రీలు నిరాశకు లోనవుతున్నారు. ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు లేకపోవడంతో ప్రైవేటు వైద్యశాలను ఆశ్రయిస్తున్నారు. ప్రవేట్ అస్పత్రులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నామని నిరుపేద కుటుంబాలు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ వైద్యులు ప్రతి రోజు అందుబాటులో ఉండి ప్రజలకు వైద్య సేవలు అందించాల్సింది ఉండగా విధులకు దుమ్మా కొడుతూ నిర్లక్ష్యం చేస్తున్న వైద్యులపై అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# మరింత మెరుగ్గా విద్యా ప్రమాణాలు



ప్రజాపక్షం/ధర్మసాగర్ : పదో తరగతి విద్యార్థులు విద్యా ప్రగతిలో మరింత మెరుగ్గా ఉండేవిధంగా ఉన్నత విద్యా ప్రమాణాలతో విద్యాబోధన సాగాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం మల్లక్ పల్లి, నారాయణగిరి లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా మల్లక్ పల్లి లోని ఉన్నత పాఠశాలలోని పదో తరగతిని కలెక్టర్ సందర్శించారు. డిజిటల్ విధానంలో కొనసాగుతున్న తరగతిలో పాఠ్యాంశాల బోధన గురించి కలెక్టర్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాల పరిసరాలు, పరిశుభ్రతను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు నిర్వహించిన స్లిప్ టెస్ట్ ల గురించి ఆరా తీశారు. ప్రాథమిక పాఠశాలకు చెందిన నాలుగు, ఐదు తరగతులను నిర్వహిస్తున్న తరగతి గదిని కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. వంటగదిని కలెక్టర్ పరిశీలించారు. అదేవిధంగా ఇదే మండలంలోని నారాయణగిరి లో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. పదో తరగతి బాలికలు, బాలుర సెక్షన్లను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఉపాధ్యాయుల డైరీని పరిశీలించారు. పాఠశాల పరిసరాలు బాగుండటంతో పాటు , పదో తరగతి బాలికలు విద్యా ప్రగతి పై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. చదువుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగాడిఇఒగిరిరాజ్ గౌడ్, ఎంఇఒ డాక్టర్ బి.రాంధన్ , తహసీల్దార్ గుత్తికొండ సదానందం, ఎంపిడిఒకమటం అనిల్ కుమార్, మల్లకపల్లి, నారాయణగిరి గ్రామాల సర్పంచులు గిన్నారపు లత, పుట్ట రేణుక, తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతో అభ్యర్థుల గెలుపునకు కృషి

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

## కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ (ఎం) కౌన్సిలర్ అభ్యర్థుల ప్రకటన సర్వేల ఆధారంగా నిబద్ధత కలిగిన నాయకుల ఎంపిక

ప్రజాపక్షం/భూపాలపల్లి :భూపాలపల్లి మున్సిపాలిటీలోని 30 వార్డుల కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ (ఎం)కౌన్సిలర్ అభ్యర్థులను ప్రకటించినట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్, సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, సిపిఐ (యం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు సంయుక్తంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుండి మీడియాకు ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ అధిష్టానం, సర్వేల ఆధారంగా, ప్రజల్లో మంచి పేరు మరియు పార్టీ పట్ల నిబద్ధత కలిగిన నాయకులను ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నాయకులు, కార్యకర్తలందరూ సమన్వయంతో అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. ప్రకటించిన అభ్యర్థులందరూ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి, మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేసే సామర్థ్యం కలిగిన వారని తెలిపారు. 30 వార్డులకు 30 వార్డులు గెలుచుకొని ఉమ్మడి సిపిఐ కమ్యూనిస్టుల బలంతో మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకోవాలని వారు సూచించారు.



**30 వార్డుల అభ్యర్థులు వీరే**


1వ వార్డు బొౌతు శోభ రాజేష్, 2వ వార్డు బుర్ర కొమురయ్య గౌడ్, 3వ వార్డు ఎరవెల్లి జగపతి (అరున్)రావు, 4వ వార్డు ముంజాల రవీందర్ గౌడ్,5వ వార్డు గంగసరం శ్రీనివాస్ (సిపిఐ), 6వ వార్డు ఉడుత సరోజన రాయమల్లు, 7వ వార్డు నూకల భూలక్ష్మి చంద్రమౌళి (పిపిఐ), 8వ వార్డు సోతుకు రమ సమ్మయ్య, 9వ వార్డు అప్పం కిషన్ యాదవ్, 10వ వార్డు పుల్లూరి మంజుల మాధవ రావు, 11వ వార్డు గురిజాల రవి, 12వ వార్డు ముత్యాల శ్యాం గౌడ్,13వ వార్డు బడితెల వెంకటస్వామి, 14వ వార్డు మాకోటి శ్వేత ప్రభాకర్, 15వ వార్డు అంబాల శ్రీనివాస్,16వ వార్డు దాట్ల విజయ శ్రీనివాస్,17వ వార్డు బీర్తి కమల మధునయ్య, 18వ వార్డు మూత సహదేవ్, 19వ వార్డు కురిమిల్ల శ్రీనివాస్, 20వ వార్డు ఇస్లావత్ రాజు నాయక్, 21వ వార్డు ధరావత్ శారద సమ్మయ్య, 22వ వార్డు నమునూరి ప్రేమలత రాజబాబు,23వ వార్డు శిరుప స్వప్న అనిల్, 24వ వార్డు వేముల జ్యోతి శ్రీకాంత్ (సిపిఐ), 25వ వార్డు పొనకంటి మేఘన శ్రీనివాస్, 26వ వార్డు ఓరుగంటి రాధా అయిలయ్య, 27వ వార్డు ఎర్రం అనుష సతీష్ (సిపిఐ(ఎం),28వ వార్డు సోతుకు ప్రవీణ్ కుమార్(సిపిఐ), 29వ వార్డు పుల్ల మహేష్, 30వ వార్డు బొడ్డు అశోక్ లకు కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి కమ్యూనిస్టుల అభ్యర్థులను ప్రకటించారు.

**భూపాలపల్లి గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం**

పంచాయతీ ఫలితాలే.. మున్సిపల్ ఎన్నికల్లోనూ రిపీట్

ఈ నెల11న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో భూపాలపల్లి మున్సిపాలిటీ పై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమని, పంచాయతీ ఎన్నికల ఫలితాలే, మున్సిపల్ ఎన్నికల్లోనూ రిపీట్ అవుతాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ధీమా వ్యక్తం చేశారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 16 వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి దాట్ల విజయ శ్రీనివాస్, 17 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి బీర్తి కమల మధునయ్య 29 వార్డు కౌన్సిలర్ అభ్యర్థి పుల్ల మహేష్ గెలుపును కోరుతూ రాంనగర్, సుభాష్ కాలనీ న్యూ సుభాష్ కాలనీ లల్లో సిపిఐ, సిపిఐ (యం) పార్టీలు బలపరిచిన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థుల గెలుపు కొరకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజుకుమార్, సిపిఐ (యం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు, పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, ముఖ్య నాయకులు, ఆయా వార్డుల ఎన్నికల ఇంచార్జీ లతో కలిసి ఎన్నికల ప్రచారంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డులల్లో నిర్వహించిన పబ్లిక్ కార్నర్ మీటింగ్ లలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. ప్రజల మద్దతుతో మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు ఇంఛార్జి లు చార్జీలు, అధ్యక్షులు పాల్గొన్నారు.

# ఆర్‌సిబితో తలపడేది ఎవరు?



మహిళల ప్రీమియర్ లీగ్‌లో ఆసక్తికర పోరుకు మరికాసే పట్లో తెరలేవనుంది. గత మూడు సీజన్లలో రన్నరప్‌తోనే సరిపెట్టుకున్న ఢిల్లీ క్యాపిటల్స్, తొలిసారి నాకౌట్‌కు దూసుకొచ్చిన గుజరాత్ జెయింట్స్ మధ్య బిగ్ ఫైట్ జరుగనుంది. లీగ్ దశలో రెండుకు రెండు మ్యాచుల్లో ఢిల్లీపై గుజరాత్‌దే పైచేయి. కానీ, ఆఖరి మ్యాచ్‌లో యూపీ వారియర్స్‌ను చిత్తు చేసిన జెమీమా రోడ్రిగ్స్ బృందం ఈసారి ప్రతీకార విజయంతో ఫైనల్లో అడుగుపెట్టాలనుకుంటోంది. మరోవైపు అష్లీ గార్డ్నర్ జట్టు మాత్రం తగ్గేదేలే అంటోంది. సో.. ఎలిమినేటర్లో గెలిచి.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడేది ఎవరు? అనేది ఉత్కంఠ రేపుతోంది. గత సీజన్లలో ఏకపక్ష మ్యాచ్‌కు భిన్నంగా జరుగుతున్న నాలుగో సీజన్లో రెండే రెండు మ్యాచ్‌లు మిగిలాయి. లీగ్ దశలో నువ్వానేనా అన్నట్టు తలపడిన గుజరాత్ జెయింట్స్, ఢిల్లీ క్యాపిటల్స్ ఎలిమినేటర్ పోరుకు సిద్ధమయ్యాయి. ఆఖరి ఓవర్ వరకూ పోరాడి.. రెండుసార్లు స్వల్ప తేడాతో గుజరాత్ చేతిలో ఓడిన ఢిల్లీ.. ఈసారి ప్రతీకారం తీర్చుకోవాలనే కసితో ఉంది. గత మూడు సీజన్లలో ఒక్కసారి కూడా ఫైనల్ ఆడని గుజరాత్ జట్టు ఈసారి విదేశీ స్టార్ల మెరుపులతో నాకౌట్ వరకూ వచ్చింది. ఢిల్లీని ఓడించిందంటే తొలిసారి టైటిల్ పోరులో తలపడుతుంది. నాలుగో సీజన్‌ను ఘనంగా ఆరంభించిన గుజరాత్ జెయింట్స్ వరుసగా రెండు విజయాలతో ప్రత్యర్థులను భయపెట్టింది. కానీ, ఆ తర్వాత వరుస ఓటములతో ప్లేఆఫ్‌లో వెనకబడింది. అనంతరం ఢిల్లీపై, యూపీ, ముంబై ఇండియన్స్‌ను ఓడించిన గుజరాత్ రేసులోకి వచ్చింది. హ్యాట్రిక్ ఓటముల నుంచి తేరుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ అదిరే ఆటతో ప్లేఆఫ్స్ బరిలో నిలిచింది. లీగ్‌దశలో రెండు పర్యాయాలు ఛేదనలోనే ఢిల్లీపై గుజరాత్ నెగ్గింది. తొలి మ్యాచ్లో 205 పరుగులు చేసిన గార్డ్నర్ సేన ప్రత్యర్థిని 201కే కట్టడి చేసింది. ఇక రెండో గేమ్లోనూ అంతే. 174 పరుగుల ఛేదనలో నిక్కీ ప్రసాద్, స్నేహ్ రానా మెరుపులతో గెలిచినంత పనిచేసిన ఢిల్లీ అనూహ్యంగా 3 పరుగులతో మ్యాచ్ చేజార్చుకుంది.

**ఇరుజట్లకు కీలకం వీళ్లే..** గుజరాత్ జెయింట్స్ బలంసోఫీ డెవినె. ఈ ఆల్రౌండర్ బ్యాటుతో, బంతితో విశేషంగా రాణిస్తోంది. 8 మ్యాచుల్లో 237 రన్స్ చేసిన డెవినె 17 వికెట్లతో పర్పుల్ క్యాప్ రేసులో ఉంది. మిడిల్, డెత్ ఓవర్లలో పరుగులను నియంత్రిస్తూ గుజరాత్‌ను గెలిపిస్తోందీ వెటరన్. అనుష్క శర్మ, బేత్ మూనీ, భారతి ఫుల్మాలి, తనూజ కన్వర్ బ్యాటింగ్‌లో కీలకం కానున్నారు. బౌలింగ్ విషయానికొస్తే రేణుకాసింగ్, స్పిన్నర్లు రాజేశ్వరీ గైక్వాడ్, వరేహం మ్యాచ్‌ను మలుపు తిప్పగలరు. ఢిల్లీ జట్టును మాత్రం నిలకడ లేమి వేధిస్తోంది. ప్రధాన పేసర్ మరిజానే కాప్ వరుసగా విఫలమైనా చివరి లీగ్ మ్యాచ్‌లో యూపీ వారియర్స్‌పై సంచలన బౌలింగ్ చేసింది. ఓపెనర్లు షఫాలీ వర్మ, లీజెల్లీ లీలు శుభారంభాలు ఇస్తుండడం, డేంజరస్ లారా వొల్వార్డ్ట్ గత మ్యాచ్‌ల్లో 47తో ఫామ్లోకి రావడం ఆ జట్టుకు ప్లస్ అవుతోంది. కెప్టెన్ జెమీమా రోడ్రిగ్స్, నిక్కీ ప్రసాద్, స్నేహ్ రానాలు ఆఖర్లో దంచేశారంటే.. గుజరాత్‌తో హ్యాట్రిక్ తీసిన నందినిశర్మ(14 వికెట్లు), శ్రీచరణి (14 వికెట్లు) ఈసారి చెలరేగితే ఢిల్లీని ఆపడం కష్టమే.

# రీ ఎంట్రీలో అదరగొట్టిన తెలుగోడు..

## టి-20 వరల్డ్ కప్ వార్మప్ మ్యాచ్‌లో భారత్-ఏ ఘనవిజయం



టీమిండియా యువ మిడిల్ ఆర్డర్ బ్యాటర్ తిలక్ వర్మ రీ ఎంట్రీలోనే తన ప్రతిభను చాటుకున్నాడు. శస్త్రచికిత్స కారణంగా ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన టి-20 సిరీస్‌కు దూరమైన ఈ ఎడమచేతి బ్యాట్‌మెన్ ఇప్పుడు పూర్తిస్థాయి మ్యాచ్ ఫిట్నెస్ సాధించి మైదానంలోకి అడుగుపెట్టాడు. టి20 వరల్డ్‌కప్ 2026కు +ముందు జరుగుతున్న వార్మప్ మ్యాచ్‌ల్లో భాగంగా భారత్‌ఏ జట్టు తరఫున యూఎస్‌ఏపై బరిలోకి దిగిన తిలక్ వర్మ చురుకైన ఇన్నింగ్‌తో ఆకట్టుకున్నాడు. అతని ప్రదర్శన భారత జట్టుకు మంచి సంకేతంగా మారింది. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో వన్‌డౌన్ బ్యాటింగ్‌కు వచ్చిన తిలక్‌వర్మ ఆరంభం నుంచే దూకుడుగా ఆడాడు. కేవలం 24 బంతుల్లోనే 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 38 పరుగులు సాధించాడు. ముఖ్యంగా షాట్ల ఎంపిక, స్ట్రైక్ రొటేషన్లో అతని నైపుణ్యం స్పష్టంగా కనిపించింది. గాయానంతరం ఎలాంటి అసౌకర్యం లేకుండా బ్యాటింగ్ చేయడంతో పాటు ఫీల్డింగ్‌లోనూ చురుకుగా కదిలి తన ఫిట్‌నెస్ నెసందేహాలకు చెక్ పెట్టాడు. మ్యాచ్ విషయానికి వస్తే భారత్‌ఏ జట్టు 38 పరుగుల తేడాతో యూఎస్‌ఏపై ఘన విజయం సాధించింది. తిలక్ వర్మ రీ ఎంట్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలవడం భారత అభిమానులకు ఉత్సాహాన్ని కలిగించింది.

# ఇండియాతో మ్యాచ్ బాయ్‌కాట్‌పై మాజీ క్రికెటర్లు ఏమంటున్నారంటే



**న్యూఢిల్లీ:** టి-20 వరల్డ్‌కప్‌తో ఇండియాతో జరగాల్సిన మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేస్తున్నట్లు పాకిస్థాన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పలువురు క్రికెటర్లు స్పందించారు. పాకిస్థాన్ క్రికెటర్లు షాహిద్ అఫ్రిది, మొహమ్మద్ యూసుఫ్లు పశ్చాతాపాన్ని వ్యక్తం చేశారు. కానీ తమ దేశం తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉండనున్నట్లు చెప్పారు. భారత మాజీ ప్లేయర్ సునీల్ గవాస్కర్ భిన్నంగా స్పందించారు. పాకిస్థాన్ నిర్ణయాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదన్నారు. ఎందుకంటే మెగా టోర్నీల్లో పాక్ ఇలాగే యూ టర్న్ తీసుకుంటుందన్నారు. రాజకీయాల వల్ల మూతపడ్డ దారులు.. క్రికెట్‌తో తెరుచుకుంటాయని విశ్వసిస్తాని షాహిద్ అఫ్రిదీ అన్నారు. వరల్డ్‌కప్‌లో ఇండియాతో పాక్ ఆడడం లేదని, కానీ ప్రభుత్వ నిర్ణయానికి బాసటగా ఉన్నామని, ఇలాంటి సందర్భాల్లో ఐసిసి నిష్పక్షపాత నిర్ణయాన్ని తీసుకోవాలన్నారు. ప్రతి సభ్యుడికి న్యాయం జరగాలన్నారు. యూసుఫ్ స్పందిస్తూ ఇది చాలా కఠినమైన నిర్ణయం అని, ప్రభుత్వానికి కట్టుబడి ఉన్నామని, కమర్షియల్ ప్రయోజనాల కన్నా ముందు విలువలు ముఖ్యమని, క్రికెట్లో ఉన్న పక్షపాతం ముగిసిపోవాలని యూసుఫ్ పేర్కొన్నారు. రానున్న నాలుగైదు రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా రియాక్షన్లు వస్తాయని, మాజీ ఆటగాళ్లు కూడా స్పందిస్తారని, పాకిస్థాన్ తన నిర్ణయాన్ని మార్చుకుంటదని భావిస్తున్నానని సునీల్ గవాస్కర్ అన్నారు. ఐసీసీ న్యాయం చేసేంత వరకు వేచి ఉండాలని, బహుశా ఆంక్షలు, జరిమానాలు పడే అవకాశం ఉందని, మళ్లీ ఐసీసీ టోర్నీ నిర్వహించే అవకాశం ఆ దేశానికి దక్కదని హర్భజన్ సింగ్ అన్నారు. పాకిస్థాన్ తమ స్వంత క్రికెట్ను నాశనం చేసుకుంటోందని మదన్ లాల్ అన్నారు.


# మహిళ

# అమాయకత్వమా... అవగాహనా లోపమా?

దేశంలో బాలికలపై జరుగుతున్న అరాచకాలకు అంతులేకుండా పోతున్నది. ఉత్తరప్రదేశ్‌లోని బల్లియా జిల్లాలో పెళ్లి పేరుతో ఒక మైనర్‌ను ఆరు నెలలుగా బంధించి, కామవాంఛ తీర్చుకుంటున్న 45ఏళ్ల ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు మంగళవారం (ఫిబ్రవరి3) పోలీసులు ప్రకటించారు. ఇది చూడడానికి ఒక నేర ఘటనగా కనిపించవచ్చు. కానీ దీనిలో దాగి ఉన్న సామాజిక సంక్షోభం చాలా లోతైనది. ఇది పేదరికం, సామాజిక అసమానతలు, సోషల్ మీడియా ప్రభావం, తల్లిదండ్రుల మార్గనిర్దేశం లోపం, విద్యావ్యవస్థ వైఫల్యం, సమాజం చూపుతున్న నిర్లక్ష్యం వంటి ఎన్నో అంశాలను ఈ ఘటన ప్రతిబింబిస్తున్నది. ప్రతిరోజూ... ప్రతి చోటా ఇలాంటి ఘటనలు జరుగుతునే ఉన్నాయి. భయం, పరువు, భవిష్యత్తు నాశనం అవుతుందన్న ఆందోళనల వల్ల చాలా వరకూ ఈ అమానుషాలు బయటకు రావడంలేదు. మైనర్ బాలికపై లైంగిక దాడులకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టుతో కథ ముగియలేదు... నిజానికి అక్కడి నుంచే మొదలైంది. బాధితురాలు చట్టపరంగా, మానసికంగా, భావోద్వేగంగా ఇంకా అపరిపక్వంగానే ఉన్న తొమ్మిదో తరగతి చదువుతున్న ఒక బాలిక. మొబైల్ ఫోన్ ద్వారా బిహార్‌కు చెందిన ఓవ్యక్తితో పరిచయం. ఆ పరిచయం ప్రేమగా మారడం. తల్లి మందలించిందని, కొట్టిందని ఇంటి నుంచి పారిపోవడం... తనను తల్లిదండ్రులు అర్థం చేసుకోలేదన్న కోపం, వారికి నిజం తెలిసిందన్న అవమానం నేపథ్యంలో ఆ బాలిక తీసుకున్న తొందరపాటు నిర్ణయం ఆమె జీవితాన్ని ఆరు నెలల పాటు నరకంగా మార్చింది. భవిష్యత్తుపై బలమైన దెబ్బవేసింది. ఈ ఘటన ఒక కుటుంబ వైఫల్యమా? ఒక తల్లి తప్పా? ఒక బాలిక అమాయకత్వమా? లేదా ఒక నేరస్తుడి క్రూరత్వమా? నిజానికి ఇది ఇవన్నీ కలిసిన సమాజ వైఫల్యం. చాలా వరకూ ఇలాంటి ఘటనకు పేదరికమే ప్రధాన కారణం. డబ్బు లేకపోవడాన్ని మాత్రమే పేదరికంగా చూడడానికి వీల్లేదు. అవకాశాలు లభించకపోవడం.. ఆదరణ లేకపోవడం.. భద్రత ఉండకపోవడం వంటివి కూడా పేదరికంలో భాగాలే. పేద కుటుంబాల్లో పిల్లలకు మొబైల్ ఒక వినోద సాధనం.. అదే వారికి ఒక ప్రపంచం. తల్లిదండ్రులు ఇద్దరూ కష్టపడకపోతే కుటుంబం గడవడం కష్టం. వారు ఇంట్లో లేనప్పుడు పిల్లలదే రాజ్యం. ఫోన్‌ను భద్రతగా తల్లిదండ్రులు భావిస్తే, దానిని ఒక వినోద సాధనంగా, కొత్త పరిచయాలకు మార్గంగా పిల్లలు అనుకోవడం సహజ పరిణామాలు. పేదరికం పిల్లల కలలను చిన్నచేస్తుంది. ఆ చిన్న కలల్ని ప్రేమ,పెళ్లి హామీలతో నేరస్తులు నిలువునా ముంచేస్తారు. బిహార్ ఘటనలో మొబైల్ ఫోన్ కీలక పాత్ర పోషించింది. సోషల్ మీడియా లేదా ఫోన్ పరిచయం. ఇది ఒక్క బాలిక కథ కాదు. ప్రతిరోజూ వేలాది పిల్లలు అన్యుల ప్రపంచంలోకి అడుగుపెడుతున్నారు. ఇక్కడ పూర్తిగా సోషల్ మీడియాను లేదా అందుబాటులోకి వచ్చిన అధునాతన సాంకేతికతను తప్పుపట్టడానికి వీలు లేదు. ఎందుకంటే, సరైన మార్గనిర్దేశం ఉంటే అవకాశాలకు సోషల్ మీడియా ఒక వంతెన. నేరస్తులకు బిగించే ఉచ్చు. కానీ, సక్రమంగా వినియోగించుకోకపోతే, ఆ నేరగాళ్లే నకిలీ ప్రొఫైల్స్, తప్పుడు పేర్లు, తప్పుడు వయసులు, తప్పుడు భావోద్వేగాలతో పిల్లల మనసుల్ని ప్రభావితం చేస్తారు. కలుషితపరుస్తారు. బాధిత బాలికను సదరు వ్యక్తి బిహార్ నుంచి గుజరాత్‌లోని వల్సాద్‌కు తీసుకెళ్లాడు. ఆరు నెలలు అక్కడే ఉంచాడు. ఈ ఆరు నెలలు ఆమె ఎక్కడ ఉంది? ఎవరి మధ్య ఉంది? ఎన్ని ఇళ్లు, ఎన్ని వీధులు, ఎన్ని చూపులు ఆమె మీద పడ్డాయి? ఎవరూ ప్రశ్నించలేదా? ఈ అమ్మాయి ఎవరు? ఇంత చిన్న వయసులో పెళ్లా? ఇక్కడ ఎందుకు ఉంది? అన్న ప్రశ్నలు ఎవరికీ రాలేదా? సమాజం చేసిన... నిరంతరం చేస్తున్న అతిపెద్ద నేరం ఇదే. అనుమానం వచ్చినా, మనం మౌనంగానే ఉండిపోతాం. మన పని కాదు అంటాం. అదే మౌనం నేరస్తుడికి రక్షణ కవచం.

ఆ బాలిక తల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడం వల్లే ఈ ఘటన బయటకు వచ్చింది. పోలీసులు విచారణ జరిపారు. బాలికను రక్షించారు. కానీ ఇలాంటి కథలు ఏన్నో...బయటకు వస్తున్నవి మాత్రం చాలా కొన్ని.. అందుకు కారణం నేరస్తుల బెదిరింపులు, భయం.. సమాజం ఏమనుకుంటుందో-నన్న ఆందోళన, పరువు సమస్య, బయటపడితే బాధితురాలికి పెళ్లి అవుతుందా అనే ప్రశ్న. అన్ని-టినీ మించి బాధితురాలినే నిందించే దుర్మార్గపు సంస్కృతి. అన్నీ కలిసి బాధితురాలిని మౌనంగా మార్చేస్తాయి. ఆ మౌనమే నేరానికి పునాది.





మహిళలు, బాలికల రక్షణకు దేశంలో చట్టాలు లేకపోలేదు. బిహార్ కేసులో బిఎన్ఎస్ సెక్షన్లు, పాస్కో చట్టం వర్తిస్తాయి. ఇక్కడ చట్టాల లోటులేదు. కానీ, వాటి గురించిన అవగాహన చాలా మంది తల్లిదండ్రులకు లేదు. పిల్లల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ చట్టాల అర్థం ఏమిటో, ఎవరికీ వర్తిస్తాయో, ఎవరికి, ఎలా ఫిర్యాదు ఎలా చేయాలో తెలియని దుస్థితి. గ్రామీణం, పట్టన ప్రాంతం అనే తేడా లేకుండా, ఎక్కడైనా సరే పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలంటే ప్రజలు భయపడే పరిస్థితులు ఉన్నాయి. అందుకే, 'చట్టం, పోలీస్ వ్యవస్థ అనేవి భయపెట్టడానికి కాదు.. రక్షించడానికి' అనే భావనను సమాజంలో నాటాల్సిన అవసరం ఉంది. పాఠశాలలు, విద్యా సంస్థల్లోనూ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలి. ముందుగా తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు అవసరం. అదే సమయంలో, పిల్లలతో సంభాషణను ప్రోత్సహించాలి. స్కూళ్లల్లో జీవన నైపుణ్యాల బోధన తప్పనిసరి చేయాలి. సోషల్ మీడియా వినియోగంపై స్పష్టమైన మార్గదర్శకాలు ఉండాలి. 'చూసీ చూడనట్టు, మౌనంగా ఉండకూడదు' అనే సంస్కృతి సమాజంలో రావాలి. బాధితులకు న్యాయంతో పాటు మానసిక మద్దతు ఇవ్వాలి. బిహార్ బాలిక కథ మనందరికీ ఒక హెచ్చరిక. ఇది ఒక చిన్న వార్త కాదు. 'నువ్వు ఒంటరిగా లేవు' అనే భరోసాను ప్రతి బాలికకూ ఇవ్వగలిగితే, మార్పుకు పునాదులు వేసినవాళ్లమవుతాం. ఈ కథ బాధిత బాలికతో ముగియకూడదు. మార్పు అక్కడి నుంచే మొదలుకావాలి.

# కొత్తగూడెం కార్పొరేషన్‌పై ఎర్రజెండా ఎగరాలి

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

## అభ్యర్థులకు బి ఫారాలు అందజేత





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం కార్పొరేషన్‌పై ఎర్రజెండా ఎగరాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి బరిలో ఉన్న అభ్యర్థులకు స్థానిక శేషగిరి భవన్ సిపిఐ కార్యాలయంలో ఆయన మంగళవారం బి ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఈనెల 11న జరగనున్న కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా సిపిఐ తన అభ్యర్థులను ప్రకటించిందని, టిడిపి, ప్రజా సంఘాల మద్దతుతో భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) ప్రజాక్షేత్రంలోకి వెళుతుందని తెలిపారు. జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా ఆధ్వర్యంలో సిపిఐ బలపరిచిన అభ్యర్థుల విజయానికి ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని, విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పూర్తిగా పార్టీ కార్యకర్తల ఆకాంక్షలకు అనుగుణంగానే కొత్తగూడెం కార్పొరేషన్ వ్యాప్తంగా పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయం వల్ల ముఖ్యమంత్రి, మంత్రులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నామనే భావన వద్దని, స్థానిక పరిస్థితులు, రాజకీయ సమీకరణాల్లో భాగంగానే ఈ నిర్ణయానికి వచ్చామన్నారు. గత రెండేళ్లలో కొత్తగూడెం నియోజకవర్గ వ్యాప్తంగా పలు సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు జరిగిందని, మారుమూల ప్రాంతాల్లో సైతం మౌలిక సదుపాయాల కల్పనకు శక్తివంచన లేని కృషి చేశామని, ఎన్నడూ జరగని అభివృద్ధి కొత్తగూడెం నియోజకవర్గంలో జరిగిందని, అనుక్షణం ప్రజాసంక్షేమం కోసం పాటుపడుతున్నామని తెలిపారు. కార్పొరేషన్ ఏర్పాటుతో పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో 25సంవత్సరాల తర్వాత ఎన్నికలు జరుగుతున్నాయని, దీంతో ఆ ప్రాంత అభివృద్ధి శరవేగం కానుందన్నారు. కార్పోరేషన్ కాకుండా ఆనే శక్తులు కుట్రలు పన్నాయని, వారి కుట్రలు, కుతంత్రాలను పటాపంచలు చేస్తూ తామిచ్చిన నివేదిక ప్రకారం ప్రభుత్వం అనతికాలంలోనే కొత్తగూడెం కార్పొరేషన్‌ను ప్రకటించిందన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధిని చూసి ఓటు వేయాలని, సిపిఐ అభ్యర్థులు గెలవడం ద్వారా కొత్తగూడెం కార్పొరేషన్ మరింత అభివృద్ధి పథంలో ముందుకు దూసుపోనుందన్నారు. కార్పొరేషన్‌పై ఎర్రజెండా ఎగిరేందుకు ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని ఈ సందర్భంగా కూనంనేని పిలుపునిచ్చారు.

# ఇంటింటి ప్రచారంలో సిపిఐ

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ 20వ వార్డు మెంబర్ కపిలవాయి మానస గోపి చారి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. మంగళవారం పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించి మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేసేది ఒక్క సిపిఐ పార్టీనేనని, తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. 20వవార్డు అభివృద్ధికి అన్నివిధాలుగా కృషిచేస్తానని, వీధిలైట్లు, అండర్ డ్రైనేజి, స్థానిక యువతకు ఉద్యోగాల కోసం కార్పొరేషన్ల ద్వారా రుణాలు ఇచ్చేవిధంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఇంటింటి తిరుగుతూ కంకికొడవలి గుర్తుకు ఓటేయాలని కోరారు. ఎన్నో పార్టీలకు అవకాశాలు ఇచ్చారు సిపిఐ పార్టీకి ఒకసారి అవకాశం ఇవ్వండని కోరుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు శివశంకర్, నాగర్‌కర్నూల్ టౌన్ సిపిఐ పట్టణ కార్యదర్శి హుస్సేన్, సత్యం, చంద్రకళ, రేణుక తదితరులు పాల్గొన్నారు.



# గెలుపే లక్ష్యంగా పోరాడాలి



## నూరుశాతం ఫలితాలు సాధించాలి

## సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్‌పాషా పిలుపు

**ప్రజాపక్షం/పాల్వంచ :** కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో నాయకులు, కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పోరాడాలని, నూరు శాతం ఫలితాలను సాధించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా అన్నారు. కార్పొరేషన్ పరిధి పాల్వంచ డివిజన్ నుండి పోటీలో నిలిచిన అభ్యర్థుల బి.ఫారాలను పార్టీ కార్యాలయం చంద్రా రాజేశ్వరరావు భవన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథంకు మంగళవారం అందజేశారు. ఈ సంధర్భంగా సాబీర్‌పాషా మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ఇంటింటికి వెళ్ళి ఓట్లు అభ్యర్థించాలని సూచించారు. తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకొని ముందుకు సాగాలన్నారు. ఆయా డివిజన్ పరిధిలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలన్నారు. నాయకులు, కార్యకర్తల సహాయ సహకారాలను తీసుకొంటూ ప్రచారాన్ని పరుగులు పెట్టించాలని, ప్రణాళికా ప్రకారం ప్రచారం చేస్తే విజయం దక్కుతుందని, ఏచిన్న అవకాశాన్ని జారవిడుచుకోవద్దన్నారు. ఏమాత్రం విశ్రమించినా ఫలితాలు తారుమారయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రత్యర్థి పార్టీల అంచనాలను తెలుసుకొంటూ ప్రచారాన్ని కొనసాగించి గెలుపు సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ, మండల కార్యదర్శులు అడుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, పట్టణ సహాయ కార్యదర్శి ఉప్పుశెట్టి రాహుల్, నాయకులు దుగ్గిరాల సుధాకర్, శనగారపు శ్రీనివాస్, వైఎస్. గిరి, వీసంశెట్టి విశ్వేశ్వర్‌రావు, అన్నారపు వెంకటేశ్వర్లు, వల్లపు యాకయ్య, చెరుకూరి శేఖర్ బాబు, మొగులూరి క్రిష్ణ, మహమ్మద్ అస్లాం, కంటెస్టెడ్ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు సేవ చేసే వారిని ఆదరించండి

## సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/చండూరు :** నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజాసేవచేసే వారిని మున్సిపల్ ఎన్నికల్లో ఆదరించి గెలిపించాలని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలునిచ్చారు. మంగళవారం నల్లగొండ జిల్లా చండూరులోని సిపిఐ కార్యాలయం మాదగోని నర్సింహ్మ భవనంలో మండల సిపిఐ కార్యవర్గ సమావేశం పార్టీ మండల సహాయ కార్యదర్శి బొడ్డు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హాజరై మాట్లాడుతూ ఈనెల 11న జరగనున్న చండూరు మున్సిపల్ ఎన్నికల్లో నాల్గవ వార్డు అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సిపిఐ అభ్యర్థి జెల్ల ధనమ్మశ్రీనివాస్ కంకి కొడవలి గుర్తుపై అత్యధిక ఓట్లు వేసి భారీ మెజార్టితో గెలిపించుకోవాలన్నారు. సిపిఐ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మునిసిపాలిటీ ఎన్నికలో కలిసికట్టుడా పనిచేసి మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య, సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు తిప్పర్తి రాములు, మండల కార్యవర్గ సభ్యులు బరిగెల వెంకటేశ్, దోటి వెంకన్న, జెల్ల శ్రీను, సిహెచ్ ఊషయ్య, గంట రమేష్, ఇరిగి సంజీవ తదితరులు పాల్గొన్నారు. కాగా మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా చండూరు మున్సిపాలిటీలో సిపిఐ, కాంగ్రెస్ పార్టీ కలిసి ఎన్నికల్లో పోటీ చేయడం జరుగుతుందని తెలిపారు. చండూరు మున్సిపాలిటీలో ఉన్న మొత్తం 10 వార్డులలో సిపిఐ, కాంగ్రెస్ కలిసి పోటీ చేస్తాయని ప్రకటించారు. మున్సిపాలిటీలోని నాలుగో వార్డులో సిపిఐ పోటీ చేస్తుందని, మిగిలిన తొమ్మిది వార్డులలో కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తుందని ప్రకటించారు. సిపిఐ కాంగ్రెస్ కలిసి పోటీ చేస్తే ప్రత్యర్థుల డిపాజిట్ గల్లంతుకావాలని, సిపిఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా ప్రచారం చేసి మున్సిపాలిటీలో ఉన్న 10కి 10 వార్డులు గెలిపించుకోవాలని చండూరు మున్సిపాలిటీపై మరోసారి కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

## సిపిఐ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

**చౌటుప్పల్ :** మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థులకు సిపిఐ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రకటించారు. మంగళవారం నల్లగొండ జిల్లా చౌటుప్పల్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో జరిగిన మిత్రపక్షాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చౌటుప్పల్ మున్సిపాలిటీలో ఎన్నికల పొత్తు ధర్మం పాటించినందున సిపిఐ పార్టీకి మున్సిపాలిటీ కోఆప్షన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇచ్చేందుకు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అంగీకరించారని తెలిపారు. మున్సిపాలిటీలో సిపిఐ కార్యకర్తలు సంపూర్ణంగా కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, మాజీకౌన్సిలర్ కాసర్ల మంజుల శ్రీనివాస్‌రెడ్డి, సిపిఐ మున్సిపాలిటీ కార్యదర్శి పగిళ్ల మోహన్‌రెడ్డి, ఉడత రామలింగం, కొండూరు విప్లవ్, కేతరాజు నరసింహ, బోయమ మంకులు, బద్దుల సుధాకర్, నీళ్ల బిక్షపతి, టంగుటూరి రాములు, దాసరి కృష్ణ, దాసరి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



## అక్షర ఆయుధం 'ప్రజాపక్షం'



**ప్రజాపక్షం/ముధోల్ :** ప్రజల సమస్యలను వెలికితీసి పరిష్కారమయ్యేలా అక్షరంతో ఆయుధంలా ప్రజాపక్షం ముందుకెళ్తోందని ము'ధోల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రావుల గంగారెడ్డి కొనియాడారు.మంగళవారం మండలంలోని ఎడ్ బిడ్ గ్రామంలో మల్లన్న దేవుని గుడి వద్ద మండల పాత్రికేయులు సునీల్‌తో కలిసి ప్రజాపక్షం 2026 వ నూతన సంవత్సరపు క్యాలెండర్ ను ఆవిష్కరించారు.అదేవిధంగా ముధోల్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈఓ అన్వర్ అలీ సైతం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ప్రజలకు ప్ర భుత్వ సమాచారం అందించడమే కాకుండా ప్రజల సమస్యలపై నిరంతరం కథనాలు రా స్తూ ప్రజల ప్రతికగా నిలుస్తోందన్నారు.అదేవిధంగా తాము ప్రజలకు చేస్తున్న సేవలను గుర్తించి ప్రజాపక్షం పత్రికలో ప్రచురిస్తున్నందుకు పత్రికకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.బైంసా మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాంనాథ్ రాథోడ్, నాయకులు దత్తారెడ్డి,కురెల్లి లస్మారెడ్డి,మహేందర్ యాదవ్, ప్రభాకర్ రెడ్డి,కానిస్టేబుల్ గంగాధర్,సతీష్ రెడ్డి,కె. ముత్యన్న గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంతి భవన పనులు ప్రారంభించాలి

### ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్



**ప్రజాపక్షం / కాసిపేట :** మందమరి ఏరియాలోని కాసిపేట 1వ గనిపై విశ్రాంతి భవన నిర్మాణ పనులను వెంటనే పునఃప్రారంభించాలని ఎఐటియుసి ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు.గతంలో జనరల్ మేనేజర్ విశ్రాంతి భవనాన్ని మంజూరు చేసినప్పటికీ, ప్రస్తుత జనరల్ మేనేజర్ రాధాకృష్ణ వాస్తు కారణాలు చెబుతూ పనులను నిలిపివేయడం సరికాదన్నారు. భవనం లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్పత్తిలో ముందుండే యాజమాన్యం, కార్మికుల సమస్యల పరిష్కారంలోనూ అదే శ్రద్ధ చూపాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను జాతీయ సంఘాలన్నింటినీ కలుపుకొని తిప్పికొడతామని స్పష్టం చేశారు. అనంతరం కార్మికుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని గని మేనేజర్ సతీష్‌కు అందజేశారు.ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, టిబిజికెఎస్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

### జిల్లా విద్యాధికారి విజయలక్ష్మి



**ప్రజాపక్షం/పాపన్నపేట:** విద్యార్థులు పట్టుదలతో చదివి పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాధికారి విజయలక్ష్మి సూచించారు. మం గళ వారం మండల పరిధిలోని కొత్తపల్లి ఉన్నత పాఠశాలలోని భవిత సె ంటర్ ను సందర్శించిన అనంతరం పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడా రు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూ చించారు. శతశాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని ఉపాధ్యాయులకు ది శా నిర్దేశం చేశారు. మండల విద్యాధికారి ప్రతాప్ రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

## రహదారి పనుల్లో నాణ్యత పాటించాలి




**ప్రజాపక్షం / తిర్యాణి :** త్రి ఇంక్లైన్ నుండి అరటిపల్లి స్టేజ్ వరకు జరుగుతున్న ప్రధాన రహదారి ప్యాచ్‌వర్క్ పనులను కాంగ్రెస్ నాయకులు మంగళవారం పరిశీలించారు. నాయకులు పెరుమాండ్ల వెంకటేశం గౌడ్, బొల్లం శంకర్ పలువురు సర్పంచులతో కలిసి పనుల తీరును పర్యవేక్షించారు.రహదారి మరమ్మతు పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత తగ్గకుండా చూడాలని కాంట్రాక్టరుకు, అధికారులకు సూచించారు. నిబంధనల మేరకు పనులు చేపట్టాలని, నాణ్యత విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. తిర్యాణి సర్పంచ్ మడవి రాజేష్, కన్నెపల్లి సర్పంచ్ తుమ్రం మాన్కు, నాయకపుగూడ ఉప సర్పంచ్ కుదురుపాక పవన్, నాయకులు జుగ్నాక మారుతి, పడాల శేఖర్, సతీష్, కుమార్ పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ రైతులకు అవగాహన

**ప్రజాపక్షం/మోర్తాడ్:** మోర్తాడ్ మండలంలోని దొన్‌పాల్ గ్రామంలో హార్టికల్చర్ వారి ఆధ్వర్యంలో ప్రియునిక్యూ, కంపెనీ వారు మంగళవారం ఆయిల్ పామ్ రైతులకు నిర్వహణ పద్ధతులపై అవగాహన సదస్సును ముత్యాల రాకేష్ తోటలో నిర్వహించారు.మోర్తాడ్ మండలంలో ఇప్పటికే 50టన్నుల పైగా ఆయిల్ ఫామ్ గెలలు కొన్నారని దీనికి గాను రుసుములు రైతుల బ్యాంకు ఖాతాల్లోకి చెల్లించామని తెలిపారు. ప్రస్తుతం ఆయిల్ ఫామ్ గెలలు టన్నుకు సుమారు రూ. 20,500 ల ధర పలుకుతున్నందుకు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, తోటి రైతులు ఆయిల్ ఫామ్ సాగులో ఉన్న లాభాలను గ్రహించాలని, తమకు ఉన్న భూమిలో ప్రతి రైతు కూడా కొంత భాగం ఆయిల్ ఫామ్ సాగు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా ఆయిల్ ఫామ్ వేసిన రైతులు అంతర పంటలకు దున్నుకునే విధానాన్ని, ఎరువు, మందులు వేసే విధానాన్ని, నీటి పారుదల విధానం గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ నుంచి హార్టికల్చర్ ఆఫీసర్ రాజు, ప్రియునిక్యూ, ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, కంపెనీ తరపున ఏరియా మేనేజర్ జి. సాయి కిరణ్, క్లస్టర్ అధికారులు చరణ్, ప్రేమ్‌సింగ్, నాగేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ కౌన్సిలర్ దంపతుల సస్పెండ్

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ మున్సిపల్ పరిధిలోని 5వ వార్డు మాజీ కౌన్సిలర్ పరిమి లత సురేష్ దంపతులను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దొనికెని దయానంద్ తెలిపారు.మంగళవారం ఖానాపూర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ ఇతర పార్టీ భీఫామ్ పై పరిమి సురేష్ ఎన్నికలలో పోటీ చేసేందుకు ప్రయత్నిస్తున్నందున డీసీసీ అధ్యక్షుడు,స్థానిక ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ అబ్దుల్ మాజీద్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కావాలి సంతోష్,వెంకటప్పయ్య, మాధవ్, శంకర్,బొడ్డు గంగన్న,గోవింద్,అర్జున్ తదితరులున్నారు.



## కోటి మంది మహిళలను కోటీశ్వర్లుగా చేయడమే

# కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం

### ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** కోటి మంది మహిళలను కోటీశ్వర్లుగా చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం మోపాల్ మండల కేంద్రంలోని రైతువేదికలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై 104 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు పంపిణీ చేసి మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో పేదలకు తోడుగా వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం అప్పులు చేసి తెలంగాణను దివాళా తీసిందని విమర్శించారు. వృద్ధులకు త్వరలోనే పెన్షన్ ఇవ్వనున్నట్లు సిఎం వెల్లడించారని గుర్తు చేశారు. బస్సు ప్రయాణం, వడ్డీ లేని రుణాలు, రైతు బీమా, రైతుభరోసా, రుణమాఫీ, ఇం దిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత కరెంట్ వంటి పథకాల ద్వారా పేదలు ప్రయోజనం పొందు తు న్నారని తెలిపారు. మహిళల ఆర్థిక శక్తివ ంతతకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వ లక్ష్యం కోటి మంది మహిళలను కోటీశ్వర్లుగా తీర్చి దిద్దడ మేన్నారు. ఇందిరా మహిళా శక్తి కింద డ్వాక్రా గ్రూప్‌లు సిండికేట్‌గా ఏర్పడి బస్సులు కొను గోలు చేసి ఆర్టీసీకి అద్దెకిస్తే నెలకు రూ. 70 వేల ఆదాయం వచ్చే అవకాశమున్నట్లు వివరిం చారు. రైతును రాజును చేసిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని, రైతులకు ఉచిత కరెంట్, రైతు భరోసా, రుణమాఫీ వంటి పథకాలు కొన సాగుతున్నాయన్నారు. బీజేపీ పాలిస్తున్న రాష్ట్రాల్లో సంక్షేమ పథకాలు లేకపోవటం ప్రజలు గమనించాలని సూచించారు. ఎన్నికల సమయంలో రాముడి పేరు తెరపైకి తెచ్చి ఓట్లు అడు గుతున్నారని ఎద్దేవా చేశారు. ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, మండల కాంగ్రెస్ నాయ కులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

### జిల్లా కలెక్టర్ హరిత



**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ :** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత ఆదేశించారు. మం గళ వారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆమె ఆకస్మికంగా సంద ర్శించారు. ఆసుపత్రిలోని వివిధ వార్డులు, విభాగాలను పరిశీలించిన కలెక్టర్ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రక్త నిల్వ గదిని పరిశీలించి వైద్యులు, సిబ్బందితో సమా వేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే సామాన్యులు, గిరిజనుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వార్డులు, పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో పాటు రోగులకు నాణ్యమైన భోజనం, శుద్ధమైన తాగునీరు అందించాలని ఆదేశించారు. రోగుల ఆరోగ్య స్థితిగతులను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఆసుపత్రి పర్యవేక్షకులు ప్రవీణ్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ సుబోద్ కుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సిఎం పర్యటనకు ఏర్పాట్ల పరిశీలన కలెక్టర్, సిపి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** సిఎం రేవంత్‌రెడ్డి 6న జిల్లా పర్యటనకు హాజరు కానున్న నేపథ్యంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, సీపీ సాయిచైతన్య జిల్లా అధికారులతో కలిసి మంగళవారం సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని బైపాస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న ప్రాంతాన్ని సిఎం సభాస్థలిగా ఖరారు చేసిన నేపథ్యంలో కలెక్టర్, సీపీ క్షేత్రస్థాయిలో ఆ ప్రాంతాన్ని సందర్శించి ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. సిఎం పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాటుల చేయాలని కలెక్టర ఆదేశించారు. హెలిప్యాడ్ వేదిక తదితర వాటి ఏర్పాట్లను నిర్ణీత గడువు కంటే ముందుగానే పూర్తి చేయాలన్నారు. బహిరంగ సభకు వచ్చేవారు వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. సిఎం భద్రతకు పకడ్బంధీ బందోబస్తును ఏర్పాటు చేయాలని, సిఎం పర్యటన నేపథ్యంలో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బ ందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థులకు 'భీపామ్'లు అందజేత



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** నగర కార్పోరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులకు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి బిపామ్‌లు అందజేశారు. రూరల్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు విస్తృతంగా వివరించి, పార్టీ అభ్యర్థులందరూ సమిష్టిగా పని చేసి విజయం సాధించాలని సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ తరపున 1వ డివిజన్ అగ్గు భోజన్న, 3వ సంధ్యారాణి, 4వ తరుణ్, 5వఈర్ల రమేష్, 13హరిచంద్‌నాయక్, 18వహన్మాండ్లు బి పామ్‌లు అందజేశామన్నారు.

## 'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించేలా సన్నద్ధం

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్





**ప్రజాపక్షం/నిర్మల్ కలెక్టరేట్ :** పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో,పదవ తరగతి పరీక్షలపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ, పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయ ని,అన్ని ప్రభుత్వద బడుల్లో ప్రతిరోజు విద్యార్థు లు,ఉపాధ్యాయుల వంద శాతం హాజరు ఉండాలని అన్నారు.తరచూ బడికి రాని పిల్లల ఇండ్లకు వెళ్లి,వారి పోషకులతో మాట్లాడి తరగతులకు హాజరయ్యేలా చూడాలని చెప్పారు.ఎప్పటికప్పుడు పో షకులతో సమావేశం నిర్వహిస్తూ,వారి పిల్లల ప్రతిభకు సంబంధించి వివరాలను వారిలో పంచుకోవాలని అన్నారు.ప్రతి విద్యార్థి బోర్డు పరీక్షలు రాసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఎప్పటికప్పుడు ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తూ,చదువులో వెనకబడిన పిల్లలు ముందుకు వెళ్లాలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు.ఏ విద్యార్థి,ఏ సబ్జెక్టులో వెనకబడ్డారో తెలుసుకొని,వారి కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని వివరించారు.పరీక్షల ఫలితాలు,హాజరు శాతం వివరాలు విద్యార్థుల ఫలితాలు,హాజరు శాతం తమకు అందజేస్తూ ఉండాలని చెప్పారు.అన్ని పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు.ఎక్కువ మార్కులు వచ్చే ముఖ్యమైన పాఠాలు ఎక్కువగా చదివిపించాలని సూచించారు.విద్యార్థులను ప్రోత్సహిస్తూ,పరీక్షలపై భయం,ఒత్తిడి దూరం చేస్తూ వారిని ప్రశాంతంగా పరీక్షలకు హాజరయ్యేలా చూడాలని తెలిపారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్,డిఈఓ భోజన్న,విద్యా శాఖ అధికారులు ప్రధానోపాధ్యాయులు సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందాం

### గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి




**ప్రజాపక్షం/గజ్వేల్ :** గజ్వేల్ మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా శ్రమిద్దామని మాజీ ఎమ్మెల్యే తూం కుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అభ్యర్థులకు మద్దతుగా వివిధ వార్డులో ఆయన ప్రచారం చేసిన సందర్భంగా మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వగా, గ్రూపులకతీతంగా కష్టించి పని చేద్దామని స్పష్టం చేశా రు. కులాలు, మతాలకు అతీతంగా అభ్యర్థులను బరిలో దింపగా, 20 వార్డుల్లో స్థానిక అంశాలపై అవగాహన ఉన్న వారికి అవకాశం కల్పించిన ట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, గజ్వేల్ అభివృద్ధికి అవసరమైన నిధులను సీఎం రేవంత్ రెడ్డి మంజూరి చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలను ప్రజల ముందు ఉంచాలని సూచించారు. అంతేగాకుండా గత రెండేళ్లుగా కెసిఆర్ స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండకపోవడంతో పాటు ప్రభుంత్వ కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకుంటున్నట్లు విమర్శించారు. సర్వం కోల్పోయిన ముంపు బాధితుల సమస్యల పరిష్కారానికి ఆయన హామీ ఇచ్చారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరి, రేషన్ కార్డులు వర్తింపజేయనుండగా, పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉండాలని ఆకాంక్షించారు.

## ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మెరుగైన విద్య

### ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్



**ప్రజాపక్షం /లక్సెట్టిపేట/ మంచిర్యాల :** ఆశ్రమ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పా టు మెరుగైన వసతులు కల్పించాలని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటిడిఎ) ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, లక్సెట్టిపేట, జన్నారం బాలుర ఆశ్రమ పాఠశాలలను సందర్శించారు.తరగతి గదుల్లో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని పరీక్షించడంతో పాటు వండిన ఆహారాన్ని స్వయంగా రుచి చూశారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని, సబ్జెక్టుల వారీగా అర్థమయ్యే రీతిలో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని, మరుగుదొడ్లను నిత్యం శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

## మల్లన్నను దర్శించుకోవడానికి పోటెత్తిన జనం



**ప్రజాపక్షం/ముధోల్ :** ముధోల్ మండలం ఎడ్బిడ్ గ్రామంలోని మల్లన్న దేవుని జాతర మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది.బస్తీమే సవాల్ కుస్తీమే కమాల్ అనే విధంగా మల్ల యోధులు పోరాడిన తీరు విశేషంగా అకట్టుకుంది. నిర్మల్ జిల్లా నుండి కాకుండా అదిలాబాద్,మంచిర్యాల,మహారాష్ట్ర నుండి సైతం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి మల్లన్న దేవుని దర్శించుకున్నారు.కోరిన కోరికలను తీర్చాలని నిలువెత్తు బంగారాన్ని(బెల్లం) సమర్పించారు.భక్తులకు ఎ లాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.గ్రామస్తుల ఆధ్వర్యంలో సుమారు లక్ష రూపాయలతో కుస్తీపోటీలు నిర్వహించారు.మల్లయోధులు తరలివచ్చి కుస్తీ పో టీలో పాల్గొన్నారు.మ ధ్యాహ్నం నుండి సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగాయి.అదేవిధంగా ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.సీఐ రవీందర్ నాయక్ ముధోల్ ఎస్.ఐ పెర్సిస్,లోకేశ్వరం ఎస్సై అశోక్ గట్టి బందోబస్తు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు,గ్రామస్తులు, పాల్గొన్నారు.

# గల్లీల్లో మొదలైన నైట్ పాలి'ట్రిక్స్'

### ఇంటింటికి వెళ్తూ హామీలను గుప్పిస్తున్న అభ్యర్థులు

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** మంచిర్యాల మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికలు సమీపిస్తుండటంతో నామినేషన్లు వేసిన రోజునుండే పార్టీల నుండి బరిలో ఉండే కార్పోరేట్ అభ్యర్థులు గల్లీలలో రాత్రి రాజకీయాలకు ఉత్సాహం చూపుతున్నారు. గతంలో మున్సిపాలిటీ ఉన్న సమయంలో ఉన్న వార్డులను ఇప్పుడు కార్పోరేషన్ డివిజన్‌ల విభజనలో ఒక్కో వార్డులో ఓట్లు రెండు, మూడు డివిజన్‌ల పరిధిలోకి వెళ్ళడంతో ప్రతీ డివిజన్‌కు ఇతర వార్డుల నుండి 800 నుండి 1200 ఓట్లు కలవడంతో అభ్యర్థులు ఆ ఓట్ల కోసం చోటా మోటా ఆ పార్టీ ననాయకులను, కాస్తో కూస్తో వార్డులో పలుబడి ఉన్న నేతలతో పడరాని పాట్లు పడుతున్నారు. ఇలాంటి నేతల డిమాండ్లకు తలొగ్గి వారికి వారితో పాటు కొంత మంది ఓటర్లకు ఇప్పటి నుండే రాత్రి పూట మందు , విందు దావత్‌లను మొదలుపెట్టే పరిస్థితి ఎదురవుతుంది. రోజు రాత్రి పూట గల్లీల్లోని చోట మోటా నాయకులతో అన్ని పార్టీల నాయకులు పడరాని పాట్లు పడుతునే ఇప్పటి నుండే డబ్బు పంపిణీ కూడా గుట్టుగా మొదలుపెట్టేసినట్లు సమాచారం. ఉదయం పూట కాంగ్రెస్, బిజెపి, భారాస అభ్యర్థులుతో పాటు వివిధ పార్టీల నుండి టిక్కెట్ ఆశించి భంగపడ్డ వారు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలచే అభ్యర్థులు కూడా ఇంటింటికి వెళ్తు తమ ప్రచారాన్ని వేగవంతం చేసుకుంటున్నారు. ఆరా తీస్తు అందుకు అనుగుణంగా తమకు ఎన్ని ఓట్లు వస్తాయో అంచనాలు వేసుకుంటున్నారు. ఈ అంచనాలకు అనుగుణంగా ఇంటింటి కి వెళ్తు ఏ ఇంట్లో ఎన్ని ఓట్లు ఉన్నాయో ముందుగానే తెలుసుకుని వారి ఇంటి చుట్టు, వారి గల్లీలో ఉన్న చిన్న చిన్న సమస్యలను అడిగి తెలుసుకుంటు, ఓటర్లు చెప్పే సమస్యలను పరిష్కరిస్తామని హామీలు ఇస్తున్నారు. ప్రధానంగా ఎక్కువ మంది అభ్యర్థులకు చిన్న చిన్న రోడ్లు, చెడిపోయిన డ్రైనేజీలతో పాటు ఇందిరమ్మ ఇండ్ల సమస్య అధికంగా ఓటర్ల నుండి వినిపిస్తున్నాయి. వీటితో పాటు అభ్యర్థులు తమ అనుచరలతో ఎప్పటికప్పుడు సమస్యలతో పాటు ఓట్లు పడే ప్రాంతాలపై ఎ ప్పటికప్పుడు దృష్టి పెడుతున్నారు.

### టిక్కెట్ ఆశించి భంగపడ్డ వారితో అభ్యర్థులకు తప్పని తిప్పలు

ఈ సారి రంగంలో ఉన్న వివిధ పార్టీల అభ్యర్థులను కొత్తగా కలిసిన వార్డులలోని చోటా మోటా నాయకులతో సమస్యలను ఎదుర్కొంటునే ప్రధానంగా ఆ వార్డులో టిక్కెట్ ఆశించి భంగపడ్డ నేతలు మాత్రం ఈ సారి టిక్కెట్ సాధించి డివిజన్‌లో కార్పోరేటర్‌గా బరిలో ఉన్న వారికి చుక్కలు చూపిస్తున్నారు. తమకు దక్కక పోవడంతో నామినేషన్ల సమయంలోనే పార్టీ రెబల్ అభ్యర్థిగా నామినేషన్లు వేద్దామని మనుసులో ఉన్నప్పటికి ఎ మ్మెల్యే కు భయపడి నామినేషన్లు వేయలేకపోయామని కానీ తమ వార్డులో ఇతర వార్డుల నుండి వచ్చిన నేతలు గెలిస్తే ఎలా? తమ ప్రాభల్యం వార్డులో కోల్పోతామని మదనపడుతూ పార్టీ అభ్యర్థులకు బదులు ఇతర పార్టీల అభ్యర్థులతో లాలూచి పడి కొంత మంది ఓటర్లకు ఇప్పటి నుండే తమ పార్టీ అభ్యర్థికి కాకుండా వేరే పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని చెప్తున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనప్పటికి సొంత మంది నుండి టిక్కెట్ ఆశించి భంగపడ్డ నాయకుల నుండి అన్ని పార్టీల నాయకులను వారి వెంట ప్రచారంలో తిప్పుకోవడానికే భయపడుతున్నారు.

## మెదక్ మున్సిపల్ బిఆర్ఎస్ అభ్యర్థుల జాబితా

**ప్రజాపక్షం మెదక్:** మెదక్ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు 31 వార్డులకు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ఖరారు చేసింది. మంగళవారం మున్సిపల్ ఎన్నికల ఇంచార్జి, మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుసేన్ పార్టీ అభ్యర్థుల తరపున భీఫాంలను మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కులాలకు ప్రాధాన్యతనిస్తూ టిక్కెట్లు కేటాయిచినట్లు వివరించారు.

మున్నూరు కాపు, బస్లింలకు 4, ముదిరాజ్, ఎస్సీ(మాదిగ) లకు 3, లింగాయత్, గౌడ్స్, వంజరి కులస్తులకు 2, చొ ప్పున టికెట్లు కేటాయించినట్లు తెలిపారు. వీరితోపాటు ఎస్సి(మాల), పూసల, యాదవ్, బుడగ జ ంగం, ఎరుకల, ఆర్యక్షత్రియ, కుంచెఎరుకల, క్రిస్టియన్, చాకలి, పద్మశాలి, మేర కులస్తులకు ఒ కటి చొప్పున టిక్కెట్లు బిఫాంలు అందజేసినట్లు పే ర్కొన్నారు. ఆయన వెంట మెదక్ మున్సిపల్ మా జీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మాజీ మార్కెట్ కమి టీ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ జడ్పి వైస్ చైర్మన్ లావణ్య రెడ్డి తదితరులు ఉన్నారు.



## గ్రామపంచాయతీలకు నిధులు విడుదల చేయండి

కలెక్టర్‌కు సర్పంచ్‌ల విజ్ఞప్తి

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్ :** గత రెండుసంవత్సరాలుగా నిధులు విడుదల చేయక గ్రామపంచాయితీలలో సమస్యలు అపరిష్కృతంగా ఉన్నందున పంచాయితీలకు రావాల్సిన నిధులు విడుదల చేయాలని జగదేవ్‌పూర్ సర్పంచ్ పనగట్ల శ్రీనివాస్‌గౌడ్ జిల్లా కలెక్టర్ హైమావతికి విన్నవించారు. మంగళవారం కలెక్టర్ జగదేవ్‌పూర్ వచ్చిన సందర్భంగా ఆయన కలెక్టర్‌ను కలిసి పంచాయితీలకు నిధులు విడుదల కాక నిలిచిపోయిన అభివృద్ధిపనుల వివరాలను వివరించారు. ముఖ్యంగా మండల కేంద్రంలో అంతరత్గ రోడ్ల నిర్మాణం, మురికి కాలువలనిర్మాణ, తాగు నీరు తదితర మౌలికవసతుల కల్పనకు నిధులు విడుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే జగదేవ్‌పూర్‌లో నిర్మాణం పూర్తైన ఐఒసి భవన సముదాయాన్ని ప్రారంభించాలని, ప్రస్థుతం కొనసాగుతున్న ఇంటిగ్రేటెడ్ భవనాలను ప్రభుత్వ విద్యాసంస్థలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో బస్వాపూర్ సర్పంచ్ కవిత లోలకర్‌రెడ్డి, జంగంరెడ్డిపల్లి సర్పంచ్ అశోక్ తదితర గ్రామాల సర్పంచ్‌ల పాల్గొన్నారు.

## హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో నాలుగు స్థానాల్లో సిపిఐ పోటీ

**ప్రజాపక్షం/హుస్నాబాద్ :** హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ నాలుగు స్థానాల్లో పోటీ చేస్తుందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్ తెలిపారు. మంగళవారం నామినేషన్ల ఉపసంహారణ అనంతరం అయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలోని సిపిఐ పార్టీకి పట్టు ఉన్న నాలుగు స్థానాల్లో 9 వార్డు నుండి ఎనగందల లక్ష్మీనారయణ, 16 వార్డు నుండి కొయ్యడ కొంరయ్య, 17 వార్డు నుండి గడిపె మల్లెశ్, 18 వార్డు నుండి సిరిగిరి కనకవ్వలను పోటిలో నిలుపుతున్నట్లు మల్లేశ్ తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పెదల కోసం నిరంతరం పని చేసే పార్టీ కేవలం ఒక్క సిపిఐ మాత్రమేనని అన్నారు. అమూల్యమైన ఓటును డబ్బుకు అమ్ముకుని మీకు కష్టాలు వచ్చినప్పుడు వారి దగ్గరికి పోతే వారు రారని మీకు ఎల్లా వేళలా అండగా ఉండే పార్టీ ఎర్ర జెండా పార్టీ అందుకే నిరంతరం పేదల కోసం పనిచేసే పార్టీ సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సిపిఐ పార్టీ గుర్తు కంకి కొడవలి గుర్తుపై ఓట్లు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లును కోరారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు జాగీరు సత్యనారయణ, కొయ్యడ కొమురయ్య, లక్ష్మీ నాయరణ, సిరిగిరి కనకవ్వలు పాల్గొన్నారు.

## దుబ్బాక మున్సిపల్‌లో 105మంది..

**ప్రజాపక్షం/దుబ్బాక :** దుబ్బాక మున్సిపాలిటీ ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టం ముగిసింది. అభ్యర్థులు తమ నామినేషన్‌లను ఉపసంహరించుకునేందుకు మంగళవారం మధ్యాహ్నంతో గడువు ముసింది. దుబ్బాక మున్సిపల్‌లో 22 మంది నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. దుబ్బాక మున్సిపాలిటీ ఎన్నికలలో 105 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు. బుధవారం దుబ్బాకలో ఎన్నికల వ్యయ నిర్వహణ వంటిఅంశాలపై అభ్యర్థులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్న కమిషనర్ రమేష్‌కుమార్ తెలిపారు.

## నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలి

ఎఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎ.గౌస్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** దేశ వ్యాప్తంగా ఫిబ్రవరి 12 న జరిగే సార్వత్రిక సమ్మె ను సింగరేణి లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రామగుండం రీజియన్ ఉపాధ్యక్షులు ఎం ఎ గౌస్ కోరారు. మంగళవారం సింగరేణి ఆర్జీ టూ ఏరియాలోని ఓసిపి త్రీలో ఉన్న ఆర్వీ ఆర్ కంపెనీ లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల చే ఏఐటియుసి నూతన క్యాలెండర్ ల ఆవిష్కరణ అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల కార్మిక వర్గానికి తీవ్ర నష్టం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యానికి పూర్వం దేశంలో ఉన్న కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని, ఇట్టి లేబర్ కోడులను ఏప్రిల్ ఒకటి నుంచి అమలు చేయడం కోసం పరిశ్రమల యాజమాన్యాలు ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికులు సమ్మె లో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.ఇంకా ఈ కార్యక్రమంలో అబ్దుల్ ఘని తదితరులు పాల్గొన్నారు.

## పక్కా ప్రణాళికతో ఓదెల దేవస్థానం అభివృద్ధి

పెద్దపల్లి శాసనసభ్యుడు
చింతకుంట విజయ రమణారావు

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** పక్కా ప్రణాళికతో ఓదెల దేవస్థానం అభివృద్ధి చేయడం జరుగుతుందని పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు అన్నారు. మంగళవారం ఓదెల శ్రీ.మల్లికార్జున స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 12 నుండి నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు,13న స్వామి వారి కళ్యాణం,15 న మహాశివరాత్రి కి సంబంధించిన వాల్ పోస్టర్లను మంగళవారం రోజున ఎలిగేడు మండలం శివపల్లి గ్రామంలోని తమ స్వగృహంలో దేవస్థాన కమిటీ సభ్యులతో కలిసి పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణా రావు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణా రావు మాట్లాడుతూ ఓదెల దేవస్థానం అభివృద్ధికి పక్క ప్రణాళికతో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. తెలంగాణలోని అతి పెద్ద శైవ క్షేత్రాలు ఒకటైన ఓదెల బ్రహ్మోత్సవాలకు పెద్ద ఎత్తున భక్తురులు తరలివచ్చి తమ మొక్కులు తీర్చుకోవాలని భక్తులను ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ చీకట్ల మొండయ్య, ఈవో సదయ్య, డైరెక్టర్లు జంగం కొమురయ్య, కోదాటి మనోహర్ రావు, జీలుక రవీందర్, కట్కూరి సమ్మిరెడ్డి, కొండ శ్రీనివాస్ గౌడ్, తాళ్లపల్లి శ్రీనివాస్, తీర్థాల రాజారాం, ఈరవేన రవికుమార్, ఉప్పుల శ్రావణ్ కుమార్, గంట రమేష్, సామల యమున, ప్రధాన అర్చకులు, ఎక్స్ అఫీషియో మెంబర్ ధూపం వీరభద్రయ్య, అర్చకులు అభిషేక్, జూనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, భక్త బృందం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రయోగాలు

# ప్రజల వినియోగం వరకూ వెళ్లాలి

వినూత్నంగా ఆవిష్కరించాలి
జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్ :** విద్యార్థులు రూపొందించే ప్రాజెక్టులు కేవలం సైన్స్ ఫెయిర్లకే పరిమితం కాకుండా, సమాజానికి ఉపయోగపడే వస్తువుల్లాగా మారడం ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డ్ కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశా(కుమార్వాడి)లో అటల్ టింకరింగ్ ల్యాబ్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. కరీంనగర్ జిల్లాలోని 17, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 8 అటల్ టింకరింగ్ ల్యాబ్ సౌకర్యం ఉన్న వివిధ పాఠశాల విద్యార్థులు తమ ప్రదర్శనలను ఇక్కడ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రారంభించి మాట్లాడారు. పాఠశాల స్థాయి ఎగ్జిబిషన్ ఎక్కడ జరిగినా అటల్ టింకరింగ్ ల్యాబ్ సౌకర్యం ఉన్న పాఠశాల విద్యార్థులు పాల్గొనడం మంచి విషయమని అన్నారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్, కోతుల సమపరిష్కారం వంటి ఎన్నో ఆవిష్కరణలను ఈ విద్యార్థులు తమ ప్రాజెక్టుల ద్వారా రూపొందించారని తెలిపారు. జిల్లాలోని 35 పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల ప్రయోగాలను ప్రదర్శించేందుకు, మరిన్ని సైన్స్ ఆవిష్కరణలు రూపొందించేందుకు కరీంనగర్లో జిల్లా సైన్స్ మ్యూజియంను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, యూనిసెఫ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి గిరిజాశంకర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఆలిండియా ఓవరాల్ ఛాంపియన్'' సాధించిన బధిర విద్యార్థులకు అభినందన**

అంతర్జాతీయ స్థాయిలో వివిధ పోటీల్లో పాల్గొనేందుకు ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులను సిద్ధం చేయాలని, అందుకు గల అవకాశాలను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గత నెల 29 నుండి ఈనెల 1 వరకు రౌండ్ టేబ్ల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ది సైలెంట్ ఒలంపియాడ్ 2026 పేరుతో ముంబైలో నిర్వహించిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కరీంనగర్ ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పాల్గొని ఆల్ ఇండియా ఓవరాల్ ఛాంపియన్ గా నిలిచారు. మొత్తం 28 మంది బంగారు, వెండి, రజత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, బదిరుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ జి.కమల ఉదయ కుమారి, ఉపాధ్యాయులు జే.తులసీరామ్, కె.శ్రీనివాస్ ఎన్.సుజాత, బి.అఖిల్, ఎం.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ జెండా మోసిన వ్యక్తే నిజమైన అభ్యర్థి

జగిత్యాల సమస్యను ఢిల్లీకి వివరిస్తా
మాజీ మంత్రి జీవన్ రెడ్డి



**ప్రజాపక్షం/జగిత్యాల :** కాంగ్రెస్ జెండా మోసిన వ్యక్తే నిజమైన అభ్యర్థి అని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో మంగళవారం జీవన్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. జగిత్యాల మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంబందించిన టికెట్ల కేటాయింపు, బీ ఫామ్‌ల జారీ విషయంలో జరిగిన పరిమాణాలపై జీవన్ రెడ్డి మరో సారి తన గళం విప్పారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌పై తన అసహనాన్ని వ్యక్తం చేశారు. ఇటీవల గాంధీ భవన్‌లో మున్సిపల్ ఎన్నికలపై చర్చించే అంతర్గత సమావేశంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ జరు కావడంపై నేను ప్రశ్నించడమే తప్పా అని అవేదన వ్యక్తం చేశారు. నాపై ఉన్న కోపాన్ని కార్యకర్తలపై చూపించడంతో పాటు ప్రతిపాదించిన జాబితాను మార్చడంపై మండిపడ్డారు. కాంగ్రెస పార్టీ ఆలోచన విధనాలను, సిద్దాంతాలను ఎవరు అతిక్రమిస్తున్నారో జగిత్యాలలో జరుగుతున్న పరిమాణాలే చెబుతున్నాయన్నారు. దేశంలో రాహుల్ గాంధీ జై బాపు..జై భీమ్..జై సంవిధాన్ అంటూ పని చేస్తుంటే జగిత్యాలలో మాత్రం ఫిరాయింపు ఎమ్మెల్యే పార్టీ ఆలోచన విధానాలను మంటకలుపుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన కార్యకర్తలకు టికెట్లు ఇవ్వకుండా ఎమ్మెల్యే చర్యలు చేపట్టడం క్రమ శిక్షణ చర్య కాదా అని ప్రశ్నించారు. పార్టీ కోసం పని చేసిన వార అవకాశాలను కాజేసి జీవితంలో ఒక్కసారి కూడా పార్టీ జెండా పట్టని వారికి బీ ఫారంలు ఇచ్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన వారికి అన్యాయం జరుగుతే ఊరుకోనని ఈ ఎన్నికల్లో అండగా నిలుస్తానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు బండ శంకర్, కొత్త మోహన్, దుర్గయ్య, అశోక్, రాజేందర్, రాధాకిషన్ రావు, చాంద్ పాష, సురేందర్ తదితరులు ఉన్నారు.

## గులాబీ జెండా ఎగుర వేయాలి

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



**ప్రజాపక్షం/జగిత్యాల :** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగుర వేసేలా ప్రతి కార్యకర్త అంకిత భావంతో పనిచేయాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో అనుసంచ్రిలాలిసిన విధానాలపై నాయకులు, బీఆర్ఎస్ అభ్యర్థులతో మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఈశ్వర్ ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామిని ప్రజలకు వివరించడంతో పాటు వారి వ్యతిరేఖ విధానాలను తెలియజేయాలన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేండ్ల పాలన ప్రగతిని ప్రతి ఓటరు వివరించాలన్నారు. అనంతరం జగిత్యాల పట్టణ నూతన అధ్యక్షుడిగా నియామకం అయిన అయిల్నేని వెంకటేశ్వర్ రావును ఈశ్వర్ అభినందించి షాలువాతో సన్మానించారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, నాయకులు వొళ్లెం మల్లేశం, దేవేందర్ నాయక్ తదితరులు ఉన్నారు.

## మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను అదనపు కలెక్టర్ పరిశీలన

భీమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/వేములవాడ :** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో రానున్న మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా భీమేశ్వర ప్రధాన ఆలయానికి వచ్చే భక్తులు, వృద్ధులు, దివ్యాంగులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు వీల్‌చైర్ సదుపాయంతో నూతనంగా ఏర్పాటు చేసే ర్యాంపును పరిశీలించారు. అలాగే లడ్డూ కౌంటర్, పార్కింగ్ ప్రాంతాలు, క్యూ లైన్లు, చలువ పందిళ్లు, టెంట్లు, వీఐపీ రోడ్డు, టాయిలెట్స్, శివార్చన స్టేజీ, నూతనంగా ఏర్పాటు చేయనున్న క్యూ లైన్లు, పార్వతీపురం ధర్మశాల రోడ్డుతో పాటు ఆలయ పరిసరాల్లోని వివిధ ప్రాంతాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పరిశీలించారు. భీమేశ్వర స్వామి వసతి గృహంలో ఏర్పాటు చేసిన ప్రోటోకాల్ కార్యాలయంలో వేయి రూపాయల వేద ఆశీర్వచనం, ఐదు వందల స్పెషల్ కోడె, మూడు వందల స్పెషల్ దర్శనం టికెట్స్ అందుబాటులో ఉన్నట్లు అధికారుల ద్వారా తెలుసుకున్నారు. అనంతరం శ్రీ భీమేశ్వర స్వామివారిని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మండపంలో ఆలయ ఈవో ఎల్ రమాదేవి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ డీఈలు శాంతయ్య, వరప్రసాద్, ఆలయ డీఈలు రఘునందన్, మైపాల్ రెడ్డి, ఏఈఓలు జయకుమారి, శ్రావణ్ కుమార్, బ్రహ్మం అన్న, శ్రీనివాస్, ఆలయ అర్చకులు, వేద పండితులు మరియు ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో పోటాపోటీగా...

# బిఆర్ఎస్ బాకీ, కాంగ్రెస్ దోఖా కార్డులు పంపిణీ

- 14వ వార్డులో ఎదురుపడిన కాంగ్రెస్, బిఆర్ఎస్ ర్యాలీలు
- పోటాపోటీగా నినాదాలు.. పోలీసు భారీ బందోబస్తు





**ప్రజాపక్షం/సిద్దిపేట :** సిద్దిపేట మున్సిపాల్టీ పరిధిలో ఎన్నికలు లేనప్పుడు కాంగ్రెస్, బిఆర్ఎస్ పోటా పోటీగా ర్యాలీలు, బాకీ, దోఖా కార్డుల పంపిణీ ఎన్నికల వాతావరణాన్ని తలపించింది. బిఆర్ఎస్ పక్షాన మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, బిఆర్ఎస్ ఇన్‌చార్జి ఎల్లు రవీందర్‌రెడ్డి, బిఆర్ఎస్ నేతలు ఎన్నికల ముందు కాంగ్రెస్ సర్కార్ హామీలిచ్చి విస్మరించిందని.. ప్రతి ఒక్కరికీ కాంగ్రెస్ ప్రభుత్వ బాకి పడ్డదని ఆరోపిస్తూ 14 వార్డులో ర్యాలీ నిర్వహించి బాకి కార్డుల పంపిణి చేశారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్, నాయకులు మహేందర్, బుచ్చిరెడ్డి,సాకి ఆనంద్. గయాసోద్దీన్ కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్ నాయకులు ప్రజలకు దోఖా చేశారని దోఖా కార్డులు ముద్రించి ఇంటింటికి పంపిణీ చేశారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతలు 14వ వార్డులో గల్లీలో ఇరువర్గాలు ఎదురుపడటంతో కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతలు హోరాహోరిగా నినాదాలు చేశారు. ఇరువర్గాలు ఒకరుపై మరోకరు సెటైర్లు వేసుకుంటూ నినాదాలు చేస్తు ముందుకు దూసుకవెళ్తుండటంతో ఉద్రిక్తతగా దారితీసింది. సిద్దిపేట వన్ టౌన్ సిఐ వాసుదేవరావు ఆధ్వర్యంలో పోలీసులు ఇరువర్గాలను సముదాయించి నచ్చచెప్పి అక్కడినుండి పంపించారు. బిఆర్ఎస్ నేతలు తెలంగాణ ప్రజలకు 60వేల రూపాయలు బాకి పడిందని ఆరోపించారు. గత 20 నెలుగా పింఛన్లు ఇవ్వటం లేదని, మహిళలకు 2500 రూపాయలు ఇవ్వటం లేదని, వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను భూస్థాపితం చేస్తామని బిఆర్ఎస్ నేతల వైస్ చైర్మన్ కనకరాజు, సంపత్‌రెడ్డిలు అన్నారు. బిఆర్ఎస్ పాలనలో ప్రజలను దోఖా చేసిందని. పదేండ్లలో బిఆర్ఎస్ ప్రజలను మోసం చేసిందని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఆరోపించారు. 10 ఏండ్లలో రేషన్‌కార్డులు, నిరుద్యోగ భృతి,దళితులకు మూడేకరాల భూమి పంపిణీ చేయలేదని వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదని హెచ్చరించారు.




## బాగా చదవండి.. బహుమతులు గెలవండి

మంత్రి లక్ష్మణ్ కుమార్

**ప్రజాపక్షం/ధర్మపురి :** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు చక్కగా చదివి అత్యధిక మార్కులు సాధించి నగదు బహుమతులు సాధించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ పక్షాన ప్రతిభావంతులైన విద్యార్థులకు అందించే నగదు బహుమతి పోస్టర్ ను మంగళవారం మంత్రి ఆవిష్కరించారు.10వ తరగతి విద్యార్థులను ప్రత్సాహిస్తూ రూ.2.2 కోట్ల నగదు బహుమతి అందిస్తున్న శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ ప్రతినిధులను మంత్రి అభినందించారు.

## మంథని మాజీ ఎమ్మెల్యే రాంరెడ్డి మృతి



**ప్రజాపక్షం/ముత్తారం :** గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం పెద్దపల్లి జిల్లా మంథని మాజీ ఎమ్మెల్యే, బిజెపి పార్టీ నాయకుడు చంద్రుపట్ల రాంరెడ్డి మృతి చెందారు. మంథని నియోజకవర్గంలోని పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామంలో రాంరెడ్డి జన్మించారు.1994 నుండి 1999వరకు తెలుగుదేశం పార్టీ తరపున మంథని శాసనసభ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించాడు.

తెలుగుదేశం పార్టీతో తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన రాంరెడ్డి, 1994లో జరిగిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున మంథని శాసనసభ నియోజకవర్గం నుండి పోటీ చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దుద్దిల్ల శ్రీపాదరావుపై 21,155 ఓట్ల మెజారిటీతో గెలుపొంది తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టాడు. శ్రీపాదరావు మరణానంతరం 1999లో జరిగిన ఎన్నికల్లో దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు చేతిలో 15,271 ఓట్ల తేడాతో ఓడిపోయాడు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీలో చేరాడు. టిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి 2021 ఏప్రిల్ 3న బిజెపిలో చేరాడు. రాంరెడ్డికి ఇద్దరు కుమారులు. ఆయన పెద్ద కుమారుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డికి ఇద్దరు కుమారులు, ఆయన పెద్ద కుమారుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి రాజకీయాల్లో కొనసాగుతున్నారు. మాజీ ఎమ్మెల్యే రాంరెడ్డి మృతి పట్ల మంథని నియోజకవర్గ ప్రజలు శోకసంద్రంలో మునిగిపోయారు.

**మాజీ ఎమ్మెల్యే మృతికి మంత్రి శ్రీధర్ బాబు సంతాపం**

పెద్దపల్లి జిల్లా మంథని మాజీ ఎమ్మెల్యే(1994–1999) చంద్రుపట్ల రాంరెడ్డి మరణం విచారకరమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సంతాపం వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచిగా, ఎంపిపిగా, శాసనసభ్యునిగా ఆయన మంథని నియోజకవర్గానికి ఎనలేని సేవ చేశారని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.



## ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**ప్రజాపక్షం/గంగాధర :** గంగాధరర మండలం బూరుగుపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్స్, లైబ్రరీని గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశంతో కలిసి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేయడానికి సిఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని బూరుగుపల్లి గ్రామ ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధి హామీ నిధులు రూ.8 లక్షలతో నిర్మించిన టాయిలెట్లను ప్రారంభించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం సహకారంతో పాఠశాలతో ఏర్పాటు చేసిన లైబ్రరీని ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, స్థానిక సర్పంచ్ దూలం కళ్యాణ్, తహసీల్దార్ అంబటి రజిత, ఎంపిడివో దమ్మని రాము, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ముద్దం నగేష్, ఉపసర్పంచ్ తిరుపతి, సాగి అజయ్ రావు, దూలం శ్రీనివాస్, దూలం అంజయ్య, బూరుగు గంగన్న, నాయకులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ లక్ష్యాల సాధనలో బ్యాంకర్ల తోడ్పాటు


జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ప్రభుత్వ లక్ష్యాల సాధనలో బ్యాంకర్లు తోడ్పాటు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బ్యాంకర్లను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో బ్యాంకర్లతో డీసీసీ ,డీ.ఎల్.ఆర్.సి సమావేశం ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద మహిళా సంఘాలకు ఋణాల పంపిణీ పెంచాలని అన్నారు.ఇందిరా మహిళా శక్తి క్రింద విజయవంతంగా నడుస్తున్న వ్యాపార యూనిట్లకు ప్రచారం కల్పించాలని అన్నారు.వి హబ్ త్వరలో అందుబాటులో వస్తుందని, మహిళలు మరింత వ్యాపార రంగంలో ఎదిగేందుకు బ్యాంకుల కూడా ముందుకు రావాలని అన్నారు.202526 లో జిల్లాలోని రైతులకు పంట ఋణాల క్రింద 1916 కోట్లు పంపిణీ లక్ష్యానికి గాను 1471 కోట్ల పంపిణీ చేశామని,వ్యవసాయ టర్మ్ ఋణాల క్రింద 651 కోట్ల పంపిణీ చేశామని కలెక్టర్ తెలిపారు.వ్యవసాయ టర్మ్ ఋణాల పంపిణీ పై దృష్టి సారించాలని అన్నారు. ఎం.ఎస్.ఎం.ఈ లకు. 202526 లో 1215 కోట్ల ఋణాల పంపిణీ లక్ష్యం కాగా 926 కోట్ల ఋణం పంపిణీ చేయడం జరిగిందని అన్నారు.5 వేల 111 స్వశక్తి సంఘాలకు 361 కోట్ల 60 లక్షలు బ్యాంకు ఋణాలు అందించామని అధికారులు తెలిపారు. మెప్మా క్రింద నిర్దేశించుకున్న లక్ష్యం కంటే అదనంగా 494 సంఘాలకు 63 కోట్ల 2 లక్షల రూపాయల ఋణం పంపిణీ చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేష్ , వివిధ శాఖల బ్యాంక్ మేనేజర్ లు,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

'అమరన్' నటి ఇప్పుడు తన కెరీర్‌లో కీలకమైన దశలో ఉంది, ఎందుకంటే ఆమె త్వరలో దేశవ్యాప్తంగా సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న రెండు పాన్-ఇండియా బిగ్గీలలో కనిపించనుంది. వాటిలో ఒకటి నితేష్ తివారీ ఇతిహాసం రామాయణం కాగా, మరొక చిత్రం ఆసక్తిగా ఎదురుచూస్తున్న సీక్వెల్ 'కల్కి2'.



## విష్ణు దేవాలయాల నేపథ్యంలో 'నాగబంధం'




విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వం వహించిన మోస్ట్ ఎవైటెడ్ మైథలాజికల్ యాక్షన్ డ్రామా 'నాగబంధం'. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్లు అద్భుతమైన రెస్పాన్ తో అంచనాలను పెంచాయి. ఈ చిత్రం టీజర్‌ను ఫిబ్రవరి 15 మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా విడుదల చేయనున్నారు.ఆకట్టుకునే టీజర్ పోస్టర్‌లో ఒక పురాతన ఆలయంలోని రహస్య నిధి చుట్టూ రక్షణగా చుట్టుకుని ఉన్న ఒక మహా నాగు పాము కనిపిస్తుంది. ఇది సినిమాలోని ఆధ్యాత్మిక దైవిక రహస్యాన్ని సూచిస్తుంది. భారతదేశంలోని చారిత్రాత్మక విష్ణు దేవాలయాల నేపథ్యంలో సాగే ఈ కథాంశం ప్రేక్షకులకు గొప్ప సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వనుంది.నభా నటేష్, ఐశ్వర్య మీనన్ కథానాయికలుగా నటిస్తుండగా, జగపతి బాబు, జయప్రకాష్, మురళి శర్మ, బి.ఎస్. అవినాష్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సౌందర్ రాజన్ ఎస్ సినిమాటోగ్రఫీ, ఆర్‌సి ప్రణవ్ ఎడిటింగ్, అశోక్ కుమార్ ప్రొడక్షన్ డిజైనర్ గా పని చేస్తున్నారు. కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మిస్తున్న 'నాగబంధం' చిత్రం తుది నిర్మాణ దశకు చేరుకుంది. ఈ వేసవిలో తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషలలో భారీ పాన్ ఇండియా విడుదలకు సిద్ధమవుతోంది.

## 'పళ్లిచట్టంబి' ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల



మలయాళ స్టార్ హీరో టొవినో థామస్ నటిస్తున్న భారీ బడ్జెట్ మూవీ 'పళ్లిచట్టంబి'. ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ ఫిలింస్, సి క్యూబ్ బ్రోస్ ఎంటర్ టైన్‌మెంట్స్ బ్యానర్స్ పై నౌఫల్, బ్రిజీష్, చాణక్య చైతన్య చరణ్ నిర్మిస్తున్నారు. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కయదు లోహర్ హీరోయిన్ గా నటిస్తోంది. ఈ నేపథ్యంలో హీరోయిన్ కయదు లోహర్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. డ్రాగన్ మూవీ సక్సెస్ తర్వాత ఆడియెన్స్ లో పెరిగిన ఆమె క్రేజ్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ కానుంది. ఇటీవలే ఐదు భాషల్లో రిలీజ్ చేసిన 'పళ్లిచట్టంబి' మోషన్ పోస్టర్ కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ ప్రెస్టీజియస్ మూవీ ఏప్రిల్ 9న హిందీ, తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ ఐదు భాషల్లో థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. 50, 60 దశకాల నేపథ్యంగా సాగే ఈ పీరియాడిక్ మూవీలో హీరో టొవినో థామస్ ఇప్పటిదాకా చూడని విధంగా సరికొత్తగా కనిపించనున్నారు. 'పళ్లి చట్టంబి' సినిమాపై పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు నెలకొంటున్నాయి. టొవినో థామస్, కయదు లోహర్, విజయరాఘవన్, సుధీర్ కరమన, బాబురాజ్, వినోద్ కేదమంగళం, ప్రశాంత్ అలెగ్జాండర్, తదితరులు నటిస్తున్నారు. ఏ చిత్రానికి ఎడిటింగ్ శ్రీజిత్ సరంగ్, సినిమాటోగ్రఫీ టిజో టోమీ, మ్యూజిక్ జేక్స్ బిజోయ్,స్క్రిప్ట్ ఎస్ సురేష్ బాబు,అసోసియేట్ ప్రొడ్యూసర్స్ మేఘశ్యామ్, తంజీర్.

## కపుల్ ఫ్రెండ్లీ' ట్రైలర్‌కు ప్రభాస్ ప్రశంసలు




సంతోష్ శోభన్, మానస వారణాసి హీ రో హీరోయిన్లుగా నటించిన 'కపుల్ ఫ్రెండ్లీ' మూవీ ట్రైలర్ రిలీజైంది. ఈ ట్రైలర్ బాగుంద ంటూ పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రభాస్ ప్రసంశించారు.అంతేకాదు 'కపుల్ ఫ్రెండ్లీ' ట్రైలర్ ను ప్రభాస్ ఇన్ స్టాగ్రామ్ లో పోస్ట్ చే శారు. ఇది నేరుగా హృదయాల్లోంచి చెప్పిన ప్రేమ కథ అంటూ అప్రిషియేట్ చేశారు. తమ మూవీ ట్రైలర్ కు ప్రభాస్ నుంచి వచ్చిన ప్ర శంసలతో 'కపుల్ ఫ్రెండ్లీ' మూవీ టీమ్ సంతోషాన్ని వ్యక్తం చేస్తోంది. యూవీ క్రి యేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్ గా నిర్మిస్తోంది. అజయ్ కుమార్ రాజు.పి కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యూజిక‌ల్ రొమాంటిక్ లవ్ స్టోరీ గా తెరకెక్కిన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా వాలెంటైన్స్ డే సందర్భంగా ఈ నెల 14న తెలుగు, తమిళంలో ప్రేక్షకుల ముందుకు రాబోతో ంది. 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాను ప్యాషనేట్ ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొ గిలినేని ఏపీ, తెలంగాణలో రిలీజ్ చేస్తున్నారు. ఆర్ట్ మైఖేల్ బీఎఫ్ ఏ, ఎడిటర్ గణేష్ శివ, డీవోపీ దినేష్ పురుషోత్తమన్,మ్యూజిక్ ఆదిత్య రవీంద్రన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎస్ఎస్ వర్మ,రచన, దర్శకత్వం అశ్విన్ చంద్రశేఖర్.

## ట్రైలర్ షాట్స్ 'భూత్ బంగ్లా' నుంచే కాపీ

### ఎర్రచీర దర్శకుడు సుమన్ బాబు



బేబి దమరి సమర్పణలో శ్రీ పద్మాయల ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రీ సుమన్ వెంకటాద్రి ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం ఎర్రచీర ది బిగినింగ్. మదర్ సెంటిమెంట్, హారర్, యాక్షన్ అంశాలతో రూపొందిన ఈ చిత్రం ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాలో ప్రముఖ నటుడు రాజేంద్రప్రసాద్ మనవరాలు బేబీ సాయి తేజస్విని కీలక పాత్రలో నటించగా, దర్శకుడు సుమన్ బాబు స్వీయ దర్శకత్వం వహిస్తూ ఒక ముఖ్య పాత్రను కూడా పోషించారు. ఈ సినిమా విడుదలకు సిద్ధమైన నేపథ్యంలో దర్శకుడు సుమన్ బాబు మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఎర్రచీర – ది బిగినింగ్ ఒక విలక్షణమైన కథాంశంతో రూపొందిన సినిమా. మదర్ సెంటిమెంట్‌కు హారర్, యాక్షన్ అంశాలు బలంగా మిళితమయ్యాయి అని తెలిపారు. ఇప్పటికే ఈ చిత్రాన్ని వీక్షించిన డిస్ట్రిబ్యూటర్లు ప్రశంసలు కురిపించారని ఆయన వెల్లడించారు. ఇది ఒక లేడీ ఓరియెంటెడ్ చిత్రం అయినప్పటికీ కుటుంబమంతా కలిసి చూసేలా రూపొందించామని అన్నారు. ఒక యదార్ధ సంఘటన ఆధారంగా ఈ కథను తీసుకున్నా. షూటింగ్ 37 రోజుల్లో పూర్తయినప్పటికీ, సీజీ వర్క్ కారణంగా సినిమా ఆలస్యమైంది. గ్రాఫిక్స్ అవుట్‌పుట్ సంతృప్తికరంగా రాకపోవడంతో మూడు చోట్ల చేయించాల్సి వచ్చింది. 'హనుమాన్' సినిమా రేంజ్ క్వాలిటీ కోసం ప్రయత్నించాం. అందుకే లేట్ అయింది. ఈ కథకు తెలుగు అమ్మాయి అయితేనే సరిగ్గా సరిపోతుందని భావించి, కారుణ్య చౌదరిని ఎంపిక చేశా. ఇందులో కేవలం ఇరవై శాతం మాత్రమే వాస్తవ కథ ఉంటుంది మిగిలినదంతా కల్పితం. ఇది రెగ్యులర్ హారర్ సినిమా కాదు. థియేటర్లలో ప్రతి షోకి లక్కీ డ్రా తీసి 10 మందికి చీరలను బహుమతిగా ఇవ్వబోతున్నాం. అక్షయ్ కుమార్ సినిమా 'భూత్ బంగ్లా'లో పాప పాలు తాగే షాట్‌ను మా సినిమా నుండే కాపీ కొట్టారు. యూత్ కోసం, కమర్షియల్ హంగుల కోసం 36 ముద్దుల కాన్సెప్ట్‌తో ఒక పాటను పెట్టాం. అది కథ డిమాండ్ మేరకే పెట్టాం. ఎర్రచీరకు సీక్వెల్‌గా అరకులో జరిగిన గిరిజన యదార్థ గాధతో 'అంబిక (ఎర్రచీర2)' సినిమాను కూడా ప్లాన్ చేస్తున్నా. అలాగే 'రాముడా? కృష్ణుడా?' అనే రొమాంటిక్ కామెడీ సినిమా చేస్తున్నా. ఇకపై ప్రతి ఆరు నెలలకు ఒక సినిమా రిలీజ్ చేసే ప్లాన్‌లో ఉన్నా అని తెలిపారు.

## యధార్థ సంఘటనలతో 'వింటర్'



క్రిసెంట్ సినిమా, టీఎస్ఆర్ మేకర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'వింటర్'. రామ్, ఆదిత్య సూరజ్ సింగ్, కుసుమ చందక, శశికళ, శ్రీజిత ఘోష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీని రియాజ్ అహ్మద్, టి. శ్రీనివాసరావు నిర్మిస్తున్నారు. 'రాచరికం' సినిమాతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న సురేష్ లంకలపల్లి ఈ మూవీకి కథ, కథనం, దర్శకత్వ బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నారు. ఈ సినిమాతో రిజ్వాన్ అలీ విలన్‌గా తెరకు పరిచయం కానున్నారు. ఇక ఈ మూవీని కశ్మీర్ లో జరిగిన యధార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. 'వింటర్' సినిమాకు సంబంధించిన పూ జా కార్యక్రమాల్ని హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. చిత్ర ప్రారంభోత్సవంలో టీం అంతా పాల్గొంది. సినిమా అద్భుతంగా రావాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకూడదని కోరుకుంటూ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రామ్, ఆదిత్య సూరజ్ సింగ్ , కుసుమ చందక, శశికళ, శ్రీజిత గోష్, రిజ్వాన్ అలీ నటిస్తున్నారు.

## అడవి శేష్ చేతుల మీదుగా 'క్యాట్' పోస్టర్ విడుదల



వి.ఆర్.జి.ఆర్ మూవీస్ బ్యానర్ పై వై. గంగాధర్ సమర్పణలో, రజని గొంగటి నిర్మాతగా నూతన దర్శకుడు జీవి నాయుడు దర్శకత్వం వహించిన చిత్రం క్యాట్ ఫస్ట్ కాపీ సిద్ధమయింది.ఈ సందర్భంగా ఈ చిత్రం కాన్సెప్ట్ పోస్టర్ ను హీరో అడివి శేష్ హైదరాబాద్ లోని అన్నపూర్ణ స్టూడియో లో విడుదల చేశారు. ఈ సందర్భంగా అడివి శేష్ మాట్లాడుతూ నటీనటులకు, సాంకేతిక నిపుణులకు శుభాకాంక్షలు చెప్పి క్యాట్ మూవీ ఘన విజయం సాధించాలి అని అన్నారు. డ్రామా, థ్రిల్లర్ జోనర్ లో తెరకెక్కిన ఈ చిత్రంలో నాయుడు, వీజే బాలు, లావణ్య, కళ్యాణి రాణి ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి ఫోటోగ్రఫీ పంకజ్ తొట్టాడ, ఎడిటింగ్ వెంకట్ ప్రభు, మ్యూజిక్ మారుతి రాజా, కథ, స్క్రీన్ ప్లే, మాటలు: వి సీహెచ్ శేఖర్ ముద్దు, దర్శకత్వం: జీవి నాయుడు (గొంగటి వీరాంజనేయులు)వీరాంజనేయులు.

## 'మెల్లకన్ను'తో చేయడం అంత ఈజీ కాదు



'చిట్ చాట్'లో దర్శకుడు వినయ్ రత్నం

చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీ చక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ మీద చింతా వినీష రెడ్డి, చింతా గోపాల కృష్ణా రెడ్డి నిర్మాతలుగా చింతా రాజశేఖర్ రెడ్డి సహ నిర్మాతగా రూపొందిన 'శ్రీ చిదంబరం'. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ట జంటగా నటించిన ఈ చిత్రం ద్వారా వినయ్ రత్నం దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఫిబ్రవరి 6న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈసందర్భంగా దర్శకుడు వినయ్ రత్నం మంగళవారం మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు.ప్రెజెంట్ జనరేషన్ ఇన్‌సెక్యూరిటీస్‌తో ఫీలవుతూ వాళ్ల లైఫ్‌ను కాన్ఫిడెంట్‌గా లీడ్ చేయాలేకపోతున్నారు. పక్కవాళ్లకు ఉన్నవి చూసి మనకు అవి లేవు కదా అని కంపేర్ చేసుకుంటున్నారు. ఈ టైమ్‌లో చెప్పాల్సిన కథ అనిపించింది. అందుకే ఇలాంటి కథను సున్నితమైన భావోద్వేగాలతో చెప్పాలని అనుకున్నాను. ఒక మనిషిని నువ్వు ప్రేమించగలగాలి అంటే మొదట నిన్ను నువ్వు ప్రేమించాలి అనేది ఈ కథ సారాంశం.ఇన్‌సెక్యూర్డ్‌గా ఫీలవుతున్న వాళ్లందరు ఈ సినిమా కథకు ఇన్‌స్పిరేషన్. ఇప్పటికీ నా స్నేహితుడు జయంత్. యూఎస్‌లో ఉంటాడు. వాడు ఎక్కడికి వెళ్లడు. ఎవ్వరిని ఇబ్బందిపెట్టడు. వాడ్ని చూసి ఈ కథ చెప్పాలని అనిపించింది. 25 షార్ట్ ఫిల్మ్ చేశాను. రాజమండ్రి మాది. నిహారిక కొణిదెల సమర్పణలో ఫిల్మ్ ఫెస్టివల్స్ కోసం ఓ షార్ట్ ఫిల్మ్‌చేశాను. థియేట్రికల్‌గా ఇది మొదటి సినిమా. మొదట ఈ సినిమా క్రౌడ్ ఫండింగ్‌తో స్టార్ట్ చేశాము. ఆ తరువాత నిర్మాత చింతా గోపాల కృష్టారెడ్డి ఈ కథ నచ్చి ప్రొడ్యూస్ చేశాడు.ఈ సినిమాలో చిదంబరం అనే పాత్రకు సింగిల్ ప్లే చేయాలి. ఈ కథ అనుకున్నప్పుడే వంశీని హీరోగా అనుకున్నాను. మెల్ల కన్నుతో ఈ పాత్ర చేయడం అంతా ఈజీ కాదు .దానికి చాలా ప్రాక్టిస్ కావాలి. ఇక మిగతా ఆర్టిస్టులందరిని ఈస్ట్ గోదావరిలోఆడిషన్ తీసుకుని, నేచురాలిటి కోసం రాజమండ్రిలో ఆడిషన్ తీసుకుని అక్కడి వాళ్లనే తీకున్నాను. అందర్ని వర్క్‌షాప్ ద్వారానే తీసుకున్నాను. సినిమా చూసిన వాళ్లందరూ చాలా ఫ్రెష్ సినిమా చూశామని అన్నారు. కేరాఫ్ కంచరపాలెం , పెళ్లి చూపులు సినిమాతో కంపేర్ చేస్తున్నారు. నేను ఈ సినిమాలు చూసి నేర్చుకున్నాను. ఆ సినిమాలతో నా సినిమాను పోల్చడం ఆనందంగా ఉంది.ఈ సినిమాలో అయిదు పాటలు ఉంటాయి. కీరవాణి పాడిన పాటతో పాటు అన్ని పాటలు బాగుంటాయి. షూటింగ్ లోకేషన్స్ 32 డేస్‌లో చేశాం. ట్రాన్స్‌పోర్ట్ సరిగ్గా లేని లోకేషన్స్‌లో చిత్రీకరణ చేశాం. మెల్ల కన్ను ఉన్నా వాళ్లను ఈస్ట్ గోదావరిలో చిదంబరం అని ఏడిపిస్తుంటారు. ఈ సినిమాలో కూడా హీరోని చిదంబరం అని పిలిచి పిలిచి అతన్ని వర్జినల్ పేరు కూడా మరిచిపోతాడు సినిమాలో. ఇక కథ విన్న తరువాత పాత్ర మీద రెస్పెక్ట్ పెరిగి శ్రీ చిదంబరం అన్నాం. ఫైనల్ కాపీ చూసుకున్న తరువాత మరింత మర్యాద పెరిగి శ్రీ చిదంబరం గారు అని పెట్టాం.

## విధానాలు అనుసరించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆదాయం సాధిస్తున్న జగిత్యాల జిల్లా పూడూరు గ్రామానికి చెందిన రైతు రామకృష్ణాను, ప్రకృతి వ్యవసాయం ద్వారా లాభాలు పొందుతున్న రంగారెడ్డి జిల్లాకు చెందిన రైతు శివని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమంలో రైతుల అవసరాల మేరకు అంశాలను ముందుగానే నిర్ణయించాలని, అందుకు అనుగుణంగానే రైతుల అనుభవాలు, విజయగాథలను క్షేత్రస్థాయిలో పొలాల నుంచే ప్రత్యక్షంగా ఇతర రైతులు చూసేలా ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి పాల్గొన్నారు.

## మృత్యువు (మొదటి పేజీ తరువాయి)

అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. స్థానికుల సాయంతో గాయపడిన వారిని చికిత్స కోసం దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను మెట్ పల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో సుమారు 10 మంది పైగా ఉన్నట్లు సమాచారం. పొద్దంతా కూలీ చేసుకొని ఇంటికి వెళ్తుండగా గ్రామానికి కొద్ది దూరంలోనే మృత్యువాత పడడం విషాద ఛాయాలను మిగిల్చింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

# మేడారం జాతర దిగ్విజయం

### 2.5 కోట్ల మంది భక్తుల రాక : మంత్రి ధనసరి అనసూయ సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మేడారం జాతర విజయవంతం కావడంపై రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క హర్షం వ్యక్తం చేశారు. మీడియా ప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన ఇష్టాగోష్టిలో ఆమె జాతర విశేషాలను, భవిష్యత్తు ప్రణాళికలను పంచుకున్నారు. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర 'మేడారం సమ్మక్కసారలమ్మ' మహా జాతర అత్యంత వైభవంగా, విజయవంతంగా ముగిసిందని మంత్రి సీతక్క తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తులు క్షేమంగా అమ్మవార్లను దర్శించుకోవడం సంతోషదాయకమని ఆనందం వ్యక్తం చేశారు.

**రికార్డు స్థాయిలో భక్తుల రాక..**

ఈ ఏడాది జాతరకు భక్తుల తాకిడి అనూహ్యంగా ఉందని మంత్రి తెలిపారు. 'క్లాస్, మాస్ అనే తేడా లేకుండా, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు, హైక్లాస్ పీపుల్ కూడా భారీ సంఖ్యలో తరలివచ్చారు. ప్రాథమిక అంచనాల ప్రకారం సుమారు రెండున్నర కోట్ల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు భావిస్తున్నాం' అని ఆమె వివరించారు. మరో ఒకటి రెండు రోజుల్లో తిరుగు జాతర ప్రక్రియ కూడా ముగుస్తుందన్నారు.

**కావాలనే విష ప్రచారం..**

జాతర ఏర్పాట్లపై కొంతమంది కావాలనే విష ప్రచారం చేశారని సీతక్క మండిపడ్డారు. ముఖ్యంగా ఒక చిన్న దొంగతనం ఘటనను భూతద్దంలో చూపి తప్పుడు వార్తలు వ్యాప్తి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను చూసి ప్రశంసించడం తమ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని ఆమె అన్నారు.

**ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం**

భక్తులకు ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వచ్చే జాతర నాటికి కీలక నిర్ణయాలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. మేడారం చుట్టుపక్కల ఉన్న రోడ్లను వెడల్పు చేసి, ట్రాఫిక్ జామ్ సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. రానున్న గోదావరి పుష్కరాల కోసం ములుగు జిల్లా పరిధిలో చేపట్టాల్సిన పనులపై త్వరలోనే అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ యంత్రాంగం, పోలీస్, ఇతర శాఖల సమన్వయంతో మేడారం జాతరను ఒక చారిత్రాత్మక ఘట్టంగా నిలిపామని మంత్రి సీతక్క చెప్పారు.



## టెండర్ల ముందు సైట్ విజిట్ దేశవ్యాప్త రూల్

### కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గనుల కేటాయింపులో టెండర్ల ముందు సైట్ విజిట్ చేయాలనేది దేశ వ్యాప్తంగా ఉన్న రూల్ అని, ఇది ప్రజలకు మేలు చేస్తుందని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. కానీ దీన్ని రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని విమర్శించారు. హైదరాబాద్ నాంపల్లి బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 17 కంపెనీలు విజిట్ చేస్తే, ఒక్కరికి కూడా సర్టిఫికేట్ ఇవ్వలేదన్నారు. నైనీ కోల్ బ్లాక్ విషయంలో మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయి, గొడవలు పెట్టుకుంటున్నారన్నారు. హైదరాబాద్ నగరం ఐటీ, ఎడ్యుకేషన్, డిజిటల్, సెమీకండక్టర్, మెడికల్ రంగాల్లో దూసుకుపోతూ 'హబ్ ఆఫ్ హబ్స్ హైదరాబాద్'గా అవతరించిందని కిషన్ రెడ్డి ప్రశంసించారు. వచ్చే ఐదేళ్లలో రూ.10 వేల కోట్లతో చేపట్టే ఈ పథకం ద్వారా హైదరాబాద్ ఫార్మా క్యాపిటల్‌గా మరింత బలోపేతం కానుందన్నారు. విదేశీ కంపెనీలు భారతీయ డేటా సెంటర్లను వాడితే 2047 వరకు 'టాక్స్ హాలిడే' ప్రకటించినట్లు తెలిపారు. సిడిఎఫ్‌డి ఎఐఎబి వంటి కేంద్ర సంస్థలకు రూ.3 వేల కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. తెలంగాణకు రైల్వే బడ్జెట్‌లో గతంతో పోలిస్తే 6 రెట్లు అధికంగా (రూ.5,454 కోట్లు) కేటాయింపులు జరిగాయన్నారు. దేశంలో ప్రకటించిన 7 కారిడార్లలో 3 హైదరాబాద్ నుంచే ప్రారంభమవుతాయన్నారు. యాదగిరిగుట్ట వరకు ఎంఎంటిఎస్ మూడో దశను విస్తరిస్తామని, త్వరలోనే ప్రధాని మోదీ దీనికి భూమిపూజ చేస్తారని తెలిపారు. తెలంగాణలో రూ.42 వేల కోట్లతో కొత్తగా జాతీయ రహదారుల నిర్మాణం చేపడుతున్నామని, ఇందులో హైదరాబాద్–విజయవాడ ఆరు లేన్‌ల రహదారి (రూ.10,297 కోట్లు) కీలకమని చెప్పారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్‌ను ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మార్చారని విమర్శించారు.

## డిఆర్‌డిఒ మరో ఘనత

(మొదటి పేజీ తరువాయి)

ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటిఆర్)లో ఈ ప్రయోగాన్ని నిర్వహించింది. పరీక్షల్లో భాగంగా నాజిల్ లెస్ బూస్టర్, సాలిడ్ ఫ్యూయల్ డక్టెడ రామ్ జెట్ మోటార్, ఫ్యూయల్ ఫ్లో కంట్రోలర్ వంటి అన్ని వ్యవస్థలు ఆశించిన రీతిలో అత్యుత్తమ పనితీరును కనబరిచాయి. ఐటిఆర్ ఏర్పాటు చేసిన వివిధ ట్రాకింగ్ పరికరాల ద్వారా సేకరించిన డేటా ఆధారంగా ఈ పరీక్ష విజయవంతమైనట్లు శాస్త్రవేత్తలు ధ్రువీకరించారు. ఎస్ఎఫ్‌డిఆర్ ప్రొపల్షన్ వ్యవస్థ పరీక్ష విజయవంతంతో శత్రు దేశాల లక్ష్యాలను అత్యంత దూరం నుంచే అడ్డుకోగల క్షిపణుల తయారీ దిశగా భారత్ ముందడుగు వేసినట్లయ్యింది. ఈ ప్రయోగాన్ని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లాబొరేటరీ, హై ఎనర్జీ మెటీరియల్స్ రీసెర్చ్ లాబొరేటరీ, రీసెర్చ్ సెంటర్ ఇమారత్, ఐటిఆర్ శాస్త్రవేత్తలు పర్యవేక్షించారు.

## ఖేమ్‌చంద్ సింగ్

(మొదటి పేజీ తరువాయి)

నాయకురాలు నెమ్చా కిప్గెన్ ఉపముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. బిజెపి ఇక్కడ చాలా వ్యూహాత్మకంగా మైతీ తెగ నుంచి సీఎంను, కుకీ తెగ నుంచి డిప్యూటీ సీఎంను ఎంపిక చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. కాగా మణిపుర్ ప్రస్తుత శాసనసభ పదవీకాలం 2027 వరకు మాత్రమే ఉంది. 2023లో జాతుల మధ్య ఘర్షణ చెలరేగడంతో మణిపుర్ అట్టుడికింది. ఈ హింసాత్మక ఘర్షణల వల్ల 250 మందికి పైగా మృతి చెందగా, వేలాది మంది పూర్తిగా నిరాశ్రయులు అయ్యారు. ఈ గొడవలు ఏమాత్రం చల్లారకపోవడంతో, గతేడాది ఫిబ్రవరిలో బీరెన్ సింగ్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. దీనితో అక్కడ రాష్ట్రపది పాలన విధించారు. ఇలా మణిపుర్‌లో 2025 ఫిబ్రవరి 13 నుంచి రాష్ట్రపతి పాలన కొనసాగుతోంది. దీనితో 60 మంది సభ్యుల అసెంబ్లీని అప్పటి నుంచి సుప్తచేతనావస్థలో ఉంచారు. తాజాగా ప్రభుత్వం ఏర్పాటు కానుండడంతో ఆ ఆంక్షలు తొలగిపోనున్నాయి. 60 స్థానాలు ఉన్న మణిపుర్ అసెంబ్లీలో, బిజెపికి 37 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. (వాస్తవానికి 2022 ఎన్నికల్లో మొదట బిజెపి 32 సీట్లు గెలుచుకోగా, తరువాత ఆరుగురు జేడీయూ ఎమ్మెల్యేల్లో ఐదుగురు బిజెపిలో చేరారు.) కాగా నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌సిపి) 6, నాగా పీపుల్ ఫ్రంట్ (ఎన్‌పిఎఫ్) 5, కాంగ్రెస్ 5, కుకీ పీపుల్స్ అలయన్స్ (కెపిఎ) 2, జనతాదళ్ (యునైటెడ్)కు 1 ఎమ్మెల్యే, ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు ఉన్నారు. ప్రస్తుతం ఒక సిట్టింగ్ ఎమ్మెల్యే మరణించడంతో ఆ అసెంబ్లీ స్థానం ఖాళీగా ఉంది.

## కేబినెట్ నిర్ణయం ఉంటే చాలు

(మొదటి పేజీ తరువాయి)

సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. ఎమ్మెల్సీల ఎంపికకు అడ్డంకిగా తమ ఉత్తర్వులు లేవని తేల్చి చెప్పింది. గత సంవత్సరం ఆగస్టు 13 నాటి మధ్యంతర ఉత్తర్వుల్లోనే స్పష్టంగా చెప్పామని జస్టిస్ విక్రంనాథ్ ధర్మాసనం తెలిపింది. కేబినెట్ నిర్ణయానికి అనుగుణంగా గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చని స్పష్టం చేసింది. తమ ఎన్నికపై జారీ చేసిన ఉత్తర్వులు ఎత్తివేయాలని అమిర్ అలీ సుప్రీంకోర్టులో వెకేట్ పిటిషన్ వేశారు. అమిర్ అలీ పిటిషన్‌ను దాసోజు శ్రవణ్ వేసిన ప్రధాన పిటిషన్‌తో జత చేస్తూ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ధర్మాసనం మార్చి 19కి వాయిదా వేసింది.

**కోదండరాం, అజారుద్దీన్ నియామకాలకు మార్గం సుగమం :** సుప్రీంకోర్టు ఇచ్చిన స్పష్టతతో కోదండరాం, అజారుద్దీన్ నియామకాలకు ఉన్న ప్రధాన అడ్డంకి దాదాపుగా తొలగినట్టే రాజకీయ నేతలు భావిస్తున్నారు. కోర్టు ఉత్తర్వుల కారణంగా నియామకాలు నిలిచిపోయాయన్న వాదనకు ఇక చెల్లుబాటు ఉండదని రాజకీయ వర్గాలు అంటున్నాయి. కేబినెట్ నిర్ణయం మేరకు గవర్నర్ ముందడుగు వేస్తే, ఎమ్మెల్సీల నియామక ప్రక్రియ వేగంగా పూర్తయ్యే అవకాశం ఉంటుందని అంటున్నారు.

**రాజకీయ ప్రభావాలు :** సుప్రీంకోర్టు స్పష్టత తెలంగాణ రాజకీయాల్లో కీలక ప్రభావం చూపే అవకాశం ఉంది. అధికార పార్టీకే కాకుండా ప్రతిపక్షాలకు కూడా ఇది ఒక స్పష్టమైన సంకేతంగా మారింది. గవర్నర్ పాత్రపై జరుగుతున్న రాజకీయ విమర్శలకు కొంత మేరకు ముగింపు పలికినట్టేనని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో, రాజ్యాంగ సంస్థల మధ్య సమతౌల్యం ఎంత కీలకమో ఈ కేసు మరోసారి గుర్తు చేసింది.

## విబి–జీ రామ్ జీ రద్దు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకువచ్చిందని విమర్శిస్తూ, 'సమాఖ్య వ్యవస్థ మౌలిక ఆలోచనలకు, గ్రామీణ ప్రజల జీవనోపాధి హక్కుకు తీవ్ర హానికర చర్య' అన్నారు. 'కర్ణాటకలోని గ్రామీణ ప్రజల జీవన హక్కులను సంరక్షించడంకోసం 'వికసిత్ భారత్–గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్(గ్రామీణ్) చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణం రద్దు చేయమని కర్ణాటక రాష్ట్ర శాసనసభ విజ్ఞప్తి చేస్తోంది, ఈ విధంగా ఎవరినీ సంప్రదించకుండా చట్టం చేయడం సమాఖ్య సూత్రానికి విరుద్ధం, రాష్ట్ర కోశాగారానికి అతిపెద్ద భారం, వికేంద్రీకరణ సూత్రానికి విరుద్ధం, గ్రామ పంచాయతీల అధికారాలను లాక్కుపోవడమే. అదే విధంగా గ్రామీణ ఆస్తులు సృష్టించేందుకు, గ్రామీణ పేదల స్వయం సమృద్ధికి దారితీసే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని దాని పూర్వపు వాస్తవిక రూపంలో పునరుద్ధరించాలి' అని సిద్ధరామయ్య తీ ర్మానాన్ని సభలో చదివారు. ఈ శాసనసభ పంచాయతీరాజ్ వ్యవస్థకు, వికేంద్రీకరణ సూత్రానికి పూర్తిగా కట్టుబడి ఉందని ఈ సభ పునరుద్ఘాటిస్తోంది, పూర్వ పథకాన్ని పునరుద్ధరించేందుకు చిత్తశుద్ధితో సభ కట్టుబడి ఉంది, ఎంజిఎన్ఆర్ఇజిఎ పథకం గ్రామీణ జీవనానికి సంజీవని వంటిది, గ్రామీణ జీవితంలో ఒక భాగం, అందువల్ల కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దుచేసి విబి–జీ రామ్ జీ చట్టాన్ని తీకురావడాన్ని ఈ సభ చాలా గట్టిగా ప్రతిఘటిస్తోంది' అని పేర్కొంది.

14వ ఆర్థిక సంఘం కర్ణాటక రాష్ట్రానికి 4.71 శాతం పన్ను వాటా చెల్లించాలని సిఫార్సుచేసిందనీ,కానీ 15వ ఆర్థిక సంఘంలో మాత్రం ఈ వాటాను 3.64 శాతానికి తగ్గించారని తీర్మానం సందర్భంగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విమర్శించారు. ఇప్పుడు 16వ ఆర్థిక సంఘం రాష్ట్ర వాటాను 4.131 శాతం ఇవ్వాలని సిఫార్సు చేయగా, ఈ సిఫార్సు 14వ ఆర్థిక సంఘం చేసిన సిఫార్సుకంటే 14.1 శాతం తక్కువగా ఉందని విమర్శించారు. ఈ విధంగా రాష్ట్రం ఆర్థికంగా క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటున్న తరుణంలో విబి–జీ రామ్ జీ పథకం ద్వారా రాష్ట్రంపై నలభైశాతం భారాన్ని విధించారని, దీనివల్ల రాష్ట్ర ఆర్థిక భద్రత, అభివృద్ధి దెబ్బతింటుందన్నారు. ఢిల్లీ పాలకులు రాజప్రాసాదాలలో కూర్చుని పథకాలు రచిస్తున్నారని, గ్రామసభకు ఉండే అధికారాలను హరించారని విమర్శించారు. అవసరాలకు అనుగుణంగా పనులను ఎంపిక చేసుకునే అధికారం పంచాయతీలకు లేకుండాపోయిందన్నారు. గ్రామంలో ఎలాంటి పనులు చేయాలో ఎంపిక చేసుకునే ప్రణాళిక పంచాయతీలోనే అమలు చేయాల్సి ఉందన్నారు. ఈ కొత్త చట్టం 12 నెలలకు బదులుగా 10 నెలల పనులకు మాత్రమే అనుమతిస్తుందని, కార్మికులకు ఎంత వేతనం చెల్లించాలనే విషయంపై స్పష్టత లేదని, ఇలా చేయడం గ్రామీణ కార్మికులను బానిసత్వంలోకి నెట్టడమేనని తీర్మానంలో ఆయన విమర్శించారు.

ప్రతిపక్ష నాయకుడు ఆర్.అశోక నాయకత్వాన బిజెపి సభ్యులు తక్షణం ఈ తీర్మానానికి తీవ్ర అభ్యంతరం తెలియజేశారు. ''ఈ సభ వ్యతిరేకిస్తోందని చెప్పకండి, కాంగ్రెస్ ప్రభుత్వం వ్యతిరేకిస్తోందని తీర్మానంలో రాసుకోండి, మీరు రాసుకున్న తీర్మానంలో మమ్మల్ని కూడా భాగస్వాముల్ని చేయకండి''అని బిజెపి సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. బిజెపి సభ్యులు తీవ్రంగా అభ్యంతరం చెప్పినప్పటికీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన తీర్మానాన్ని చదవడం ఆపకుండా కొనసాగించారు. ప్రతిపక్ష సభ్యులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే చర్చల సందర్భంగా వాటిని ప్రస్తావించాలని సలహా ఇచ్చారు. దీంతో ప్రతిపక్ష సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి పథకం కింద కాంగ్రెస్ ప్రభుత్వం దోపిడీకి పాల్పడిందని వారు ఆరోపించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com